thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 197 కరీంనగర్ బుధవారం, 24 సెప్టెంబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## సొంత ప్రజలపైనే పాక్ బాంబుల దాడి

ఇస్లామాబాద్ : ఉగ్రవాద నిరోధక చర్యల్లో భాగంగా పాకిస్థాన్ వైమానిక దళం జరిపిన బాంబుల దాడిలో ఆ దేశ ప్రజలు బలయ్యారు. ఖైబర్ పక్తున్‌ఖ్వా ప్రావిన్స్‌లో పాకిస్థాన్ వాయుసేనకు చెందిన జేఎఫ్-17 ఫైటర్ జెట్లు ఎనిమిది ఎల్ఎస్-6 బాంబులు జారవిడవడంతో కనీసం 30 మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో పిల్లలు, మహిళలు కూడా ఉన్నారు. వేకువజామున 2 గంటల సమయంలో తిరా లోయలోని మాత్రె దారా అనే గ్రామంపై దాడులు చేసింది. ఈ దాడుల్లో చాలామంది గాయపడ్డారని స్థానిక మీడియా వెల్లడించింది. కాగా క్షతగాత్రుల పరిస్థితి ఎలా ఉందన్నది తెలియరాలేదు. సంఘటనా స్థలంలో మరణించిన చిన్నారులు సహా పలువురి మృతదేహాలు పడి ఉన్న ఫొటోలు, వీడియోలు వైరల్ అయ్యాయి. అక్కడికి సహాయక బృందాలు చేరుకుని శిథిలాల కింద పడి ఉన్న మృతదేహాల కోసం గాలిస్తున్నాయి. మృతుల సంఖ్య మరింత పెరగవచ్చని భావిస్తున్నారు.

### తెలంగాణలో ఆ 23 గ్రామాల్లో స్థానిక ఎన్నికలపై...

# 'సుప్రీం' స్టే




దిల్లీ: ములుగు జిల్లా మంగపేట మండలంలో స్థానిక సంస్థల ఎన్నికలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. మండల పరిధిలోని 23 గ్రామాల్లో స్థానిక ఎన్నికల నిర్వహణపై స్టే ఇస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ గ్రామాలను గిరిజన గ్రామాలుగా పేర్కొంటూ గతంలో హైకోర్టు ప్రకటించడంపై ఆయా గ్రామాల గిరిజనేతరులు సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. మంగపేట మండలంలోని 23 గ్రామాలు గిరిజన పరిధిలో లేవని 1950లో రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీనిపై 2013లో గిరిజన సంఘాలు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా.. నిజాం ఆర్డర్ ఆధారంగా గిరిజన గ్రామాలుగా పరిగణించాలని తీర్పు ఇచ్చింది. రాష్ట్రపతి ఉత్తర్వులను పక్కన పెట్టి.. నిజాం ఇచ్చిన ఆదేశాలను పరిగణనలోకి తీసుకోవడంపై స్థానికులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తమ గ్రామాలను గిరిజన గ్రామాలుగా పరిగణించవద్దని పిటిషన్‌లో పేర్కొన్నారు. 1950లో రాష్ట్రపతి ఇచ్చిన ఉత్తర్వుల్లో మంగపేట మండలంలో 23 గ్రామాలు లేవని గిరిజనేతరుల తరపు న్యాయవాది విష్ణువర్ధన్ రెడ్డి కోర్టులో వాదనలు వినిపించారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతున్న వేళ స్టే ఇవ్వాలని కోరారు. దీంతో ప్రతివాదులకు నోటీసులు జారీ చేసిన జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌లతో కూడిన ధర్మాసనం.. హైకోర్టు ఉత్తర్వులపై స్టే విధించింది. మంగపేట పరిధిలోని 23 గ్రామాల్లో స్థానిక ఎన్నికలపైనా స్టే ఇస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

## హైకోర్టును ఆశ్రయించిన స్మితా సభర్వాల్




హైదరాబాద్: సీనియర్ ఐఏఎస్ అధికారిణి స్మితా సభర్వాల్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. కాళేశ్వరం అంశంపై పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను హైకోర్టులో ఆమె సవాల్ చేశారు. నోటీసుల జారీ, వాంగ్మూలం నమోదు చేసిన విధానాన్ని సవాల్ చేసిన ఆమె.. ఆ నివేదికను కొట్టివేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. ఈ నివేదిక ఆధారంగా తనపై తదుపరి చర్యలు చేపట్టకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ పిటిషన్ రిజిస్ట్రీ పరిశీలనలో ఉండగా.. పరిశీలన పూర్తయి లిస్ట్ అయిన తర్వాత విచారణకు వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ వ్యవహారంలో ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి, నీటిపారుదల శాఖ మాజీ ముఖ్య కార్యదర్శి ఎస్కే జోషీ హైకోర్టును ఆశ్రయించగా ఆయనకు ఇటీవల ఊరట లభించింది. కమిషన్ నివేదిక సిఫారసుల ఆధారంగా ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోరాదంటూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఈ నేపథ్యంలో తాజాగా స్మితా సభర్వాల్ సైతం ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.




# ఆదివాసీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

## మేడారం ఆలయ అభివృద్ధిలో ఖర్చుకు వెనుకాడం

### ఆలయ అభివృద్ధి పనులపై సమీక్షించిన సీఎం రేవంత్ రెడ్డి



మేడారం: ఆదివాసీల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ములుగు జిల్లా మేడారం సమ్మక్క-సారలమ్మ అమ్మవార్ల గద్దెలను దర్శించుకున్న అనంతరం ఆలయ అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు. అనంతరం ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఆలయ అభివృద్ధి బాధ్యతతో కూడిన భావోద్వేగమని పేర్కొన్నారు. ఈ పనులతో మంత్రి సీతక్కతోపాటు తన జన్మ ధన్యమైనట్లేనన్నారు. కుంభమేళాకు రూ.వేల కోట్లు ఇస్తున్న కేంద్రం.. ఆదివాసుల కుంభమేళా 'మేడారం జాతర'కు మాత్రం ఎందుకు నిధులు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. ఈ జాతరకు జాతీయ హోదా గుర్తింపు ఇవ్వాలని, ఈ మేరకు నిధులు మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. "సమ్మక్క- సారలమ్మ ఆశీస్సులతో 2023 ఫిబ్రవరి 6న ఇక్కడినుంచే పాదయాత్ర మొదలు పెట్టా.

తెలంగాణకు పట్టిన చీడపీడలను వదిలించేందుకు ఈ గడ్డపై నుంచి అడుగులు వేశాం. ఆనాడు పాలకులు సమ్మక్క -సారలమ్మ ఆలయ అభివృద్ధిపై వివక్ష చూపారు. కానీ, మా ప్రభుత్వం ఎన్ని రూ.కోట్లయినా మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉంది. ఆదివాసులను, పూజారులను, సంప్రదాయ కుటుంబాలను ఇందులో భాగస్వాములను చేస్తున్నాం. సమ్మక్క, సారలమ్మ ఆశీర్వాదంతోనే ప్రజా ప్రభుత్వం ఏర్పడింది. శాశ్వత ప్రాతిపదికన ఆలయాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. స్థానికుల అభిప్రాయాలు తెలుసుకొనేందుకే ఇక్కడికి వచ్చాను. 100 రోజుల్లో పనులు పూర్తయ్యేలా అధికారులు చూడాలి. రాతి కట్టడాలతోనే నిర్మాణాలు ఉండేలా డిజైన్లు రూపొందించాం. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకొనేలా నిర్మాణాల రూపకల్పన చేశాం. జంపన్నవాగులో నీరు నిల్వ ఉండేలా ప్రణాళికలు రూపొందించాలి. రాబోయే వంద రోజుల్లో నిష్ఠతో పనులు పూర్తి చేయాలి. రాతి కట్టడాలే నిర్మిస్తాం. మహా జాతర నాటికి పనులు పూర్తి చేస్తాం. స్థానికుల భాగస్వామ్యం, సహకారంతోనే ఇది సాధ్యం.

మహా జాతరకు మళ్లీ వస్తా. ఈసారి జాతరను గొప్పగా చేసుకుందాం" అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. అంతకుముందు మేడారం ఆలయ అభివృద్ధిపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో భాగంగా పూజారులు, ఆదివాసీ సంఘాల ప్రతినిధుల అభిప్రాయాలను సీఎం రేవంత్ తెలుసుకున్నారు. "పోరాటానికి, పౌరుషానికి స్ఫూర్తి సమ్మక్క, సారలమ్మలు. ఆ అమ్మవార్ల ఆశీర్వాదంతో ప్రజాప్రభుత్వం ఏర్పడింది. నేను ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచి వనదేవతలను సందర్శిస్తున్నా. ప్రకృతి వైపరీత్యాలనూ తట్టుకునేలా శాశ్వత ప్రాతిపదికన ఆలయాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. సంప్రదాయంలో వీసమెత్తు కూడా తేడా రాకుండా ఉండాలనేదే మా అభిమతం. ఆదివాసీ పోరాట చరిత్రను, స్ఫూర్తిని భవిష్యత్తు తరాలకు అందించేలా పనిచేయాలి" అని ముఖ్యమంత్రి తెలిపారు.

## భారత ఐటీ రంగంపై...

# హెచ్ 1బీ పిడుగు!

### రూ.25 లక్షల కోట్ల వ్యాపారంపై ప్రభావం




## ఆందోళన వ్యక్తం చేస్తున్న ఐటీ నిపుణులు

బెంగళూరు : అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్-1బీ వీసాల విషయంలో తీసుకున్న నిర్ణయం భారత ఐటీ రంగంపై తీవ్ర ప్రభావం చూపించనుందని నిపుణులు, ఆర్థిక వేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని దశాబ్దాలుగా అమెరికా నుంచి ఐటీ రంగం లబ్ధి పొందిందని, తాజాగా హెచ్-1 బీ వీసాకు లక్ష డాలర్ల రుసుమును నిర్ధారించడంతో ఈ రంగంపై పిడుగు పడినట్టు అయిందని చెబుతున్నారు. అమెరికా వర్క్ వీసా కార్యక్రమాలు, సాఫ్ట్ వేర్ ఔట్ సోర్సింగ్, వ్యాపార సేవలు తదితరాల రూపంలో భారత ఐటీ సెక్టార్ 283 బిలియన్ డాలర్ల (రూ. 25 లక్షల కోట్లు) వ్యాపారం చేస్తోందని, తాజా పరిణామాలతో దీనిపై తీవ్ర ప్రభావం పడనుందని నిపుణులు తెలిపారు. భారత దేశ మొత్తం ఐటీ రంగం వాటాలో 57శాతం అమెరికా మార్కెట్ నుంచే లభిస్తోందని తెలిపారు. కాగా, గత ఏడాది గణాంకాలను పరిశీలిస్తే హెచ్-1బీ వీసాల విషయంలో భారత్ 71 శాతంతో అతిపెద్ద లబ్ధిదారుగా ఉందని చెబుతున్నారు. కేవలం 11.7 శాతం లబ్ధితో చైనా రెండో స్థానంలో ఉందని నిపుణులు తెలిపారు. మరోవైపు, యాపిల్, జేపీమోర్గాన్, వాల్‌మార్ట్, మైక్రోసాఫ్ట్, మెటా, అల్ఫాబెట్ వంటి దిగ్గజ ఐటీ కంపెనీలపై ట్రంప్ ఒత్తిడి పెరిగింది. స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వడంతోపాటు విదేశీయులను తగ్గించుకోవాలని, ఈ మేరకు మార్పులు చేసుకోవాలని కూడా వైట్‌హౌస్ పేర్కొంది. ఇది కూడా భారత్‌పై తీవ్ర ప్రభావం చూపనుందని నిపుణులు చెబుతున్నారు. అమెరికాలో ఉద్యోగం చేయాలన్న భారతీయుల కల చేజారుతోందని ఐటీ ఔట్‌సోర్స్ కంపెనీ జెన్సార్ టెక్నాలజీస్ సీఈవో గణేష్ నటరాజన్ తెలిపారు. ఔత్సాహికుల అమెరికా కల సంక్లిష్టంగా మారిందన్నారు. భారత్, మెక్సికో, ఫిలిప్పీన్స్ వంటి దేశాల నుంచి నిపుణులైన ఉద్యోగులను నియమించుకునే విషయంలో కంపెనీలు పరిమితి పాటించనున్నాయని తెలిపారు. ఇదిలావుంటే, నాస్కామ్ కూడా ఇదే అభిప్రాయాన్ని వెల్లడించింది. హెచ్-1బీ వీసా రుసుము పెంచడంతో అమెరికాను నిపుణుల కొరత వెంటాడుతుందని తెలిపింది. దీని ప్రభావం అమెరికా ఆవిష్కరణలు, ఐటీ రంగంపై ప్రభావం చూపుతుందని పేర్కొంది. 'ఎంకే' గ్లోబల్ చీఫ్ ఎకానమిస్ట్ మాధవి అరోరా స్పందిస్తూ.. ప్రపంచ వాణిజ్యం సహా సాంకేతిక యుద్ధంలోకి సేవల ఎగుమతులు కూడా చేరే అవకాశం ఉందన్నారు. సప్లయ్ చైన్(సరఫరా వ్యవస్థ)పై ఒత్తిడి పెరుగుతుందని తెలిపారు. ఇలా చాలా మంది నిపుణులు ట్రంప్ నిర్ణయంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఐటీ ఒప్పందాలు సహా ప్రాజెక్టులపై ప్రభావం పడుతుందన్నారు. అదేవిధంగా భవిష్యత్తులో భారత్‌కు చెందిన హెచ్-1బీ వీసా హోల్డర్లు కూడా తగ్గే అవకాశం ఉంటుందని తెలిపారు. ఫలితంగా చెల్లింపులు కూడా తగ్గుతాయన్నారు.

**వీసా ఫీజును ఎత్తివేసే యోచనలో బ్రిటన్...** కొత్త హెచ్-1బీ వీసా దరఖాస్తు రుసుమును ట్రంప్ లక్ష డాలర్లకు పెంచి హడలెత్తిస్తున్న నేపథ్యంలో బ్రిటన్ ప్రభుత్వం ఇందుకు భిన్నమైన పంథాలో ముందుకెళ్లాలనుకుంటున్నట్టు తెలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతిభావంతులను ఆకర్షించే ప్రయత్నాలను బ్రిటన్ ప్రభుత్వం ముమ్మరం చేయాలనుకుంటోంది. ప్రపంచంలోని అగ్రశ్రేణి సైన్స్, టెక్నాలజీ నిపుణులను తమ దేశానికి ఆకర్షించేందుకుగాను వీసా ఫీజును మినహాయించే దిశగా యోచన చేస్తున్నట్టుగా 'ఫైనాన్షియల్ టైమ్స్' కథనం పేర్కొంది. ఇందులో భాగంగా భారతీయులు సహా ప్రపంచ నిపుణులను ఆకర్షించడంపై గ్లోబల్ టాలెంట్ టాస్క్‌ఫోర్స్ దృష్టిసారించినట్టు తెలిపింది. బ్రిటన్ ఆర్థిక వ్యవస్థ వృద్ధికి ఊతమిచ్చే మార్గాలను అన్వేషించేందుకు ఈ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటైంది. ఇది ప్రధాని కీర్ స్టార్మర్, చాన్స్‌లర్ రాచెల్ రీవ్స్‌కు నేరుగా నివేదిస్తుంది. వీసా ఖర్చులను సున్నాకు తగ్గించే యోచన చేస్తున్నట్టుగా ప్రభుత్వ అధికారిని ఉటంకిస్తూ ఆ ఆంగ్ల పత్రిక కథనం పేర్కొంది.




## భూభారతి పేరుతో.. నకిలీ పట్టాదారు పాస్ పుస్తకాలు..

ఖమ్మం: ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకొని కొందరు వ్యక్తులు మోసాలకు పాల్పడుతున్నారు. డబ్బు సంపాదించడమే లక్ష్యంగా.. వివిధ రకాల మోసాలు, నేరాలకు పాల్పడుతున్నారు. వారి స్వలాభం కోసం లేనోడి పొట్టను కొడుతున్నారు. తాజాగా ఇలాంటి ఘటనే ఒకటి జిల్లా కేంద్రంలో వెలుగు చూసింది. పట్టాదారు పాసు పుస్తకాలు ఇప్పిస్తామని ఓ ముఠా రైతుల నుంచి డబ్బులు దండుకుంది. రైతుల ఫిర్యాదు మేరకు ముఠా గుట్టురట్టు చేసి ముఠా సభ్యులను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. భూ భారతిలో పట్టాదారు పాస్ పుస్తకాలు ఇప్పిస్తామంటూ ఓ ముఠా రైతులను మోసం చేసినట్లు పోలీసులు తెలిపారు. డబ్బులు ఇచ్చి పట్టాదారు పుస్తకం కోసం వెళ్లగా.. నకిలీ పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు ఇచ్చేవారని పేర్కొన్నారు. బయ్యారంలో కలర్ జిరాక్స్ మిషిన్లను పాల్వంచలో ప్రింటింగ్ మిషన్లను ఏర్పాటు చేసుకుని నకిలీ పాస్ పుస్తకాలతో దందా చేసినట్లు గుర్తించినట్లు చెప్పారు. కొందరు రైతులకు పాస్ పుస్తకం ఇవ్వడం ఆలస్యం కావడంతో.. అనుమానం వచ్చిన రైతులు కూసుమంచి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వివరించారు. ఈ మేరకు తనిఖీలు చేపట్టి ముఠాలోని ముగ్గురు సభ్యులను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. ఖమ్మం జిల్లాతో పాటు ఆరు జిల్లాలలో ఈ ముఠా మోసాలు చేసినట్లు గుర్తించామన్నారు. ఈ మేరకు నకిలీ పాస్ పుస్తకాల దందాపై లోతుగా విచారణ చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.

## కాంగ్రెస్ చిల్లర వేషాలు వేస్తోంది.. ఎంపీ అర్వింద్ ఫైర్



నిజామాబాద్ , సెప్టెంబరు23 : కామారెడ్డి లో వరద నష్టం అంచనాపై రీ సర్వే చేయాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపూరి అర్వింద్ సూచించారు. కామారెడ్డిలో వరద నష్టానికి ఒక్క పైసా కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ నిధులను రాష్ట్ర ప్రభుత్వం వాడుకుంటోందని గుర్తుచేశారు. మాధవనగర్, మామిడిపల్లి, అర్సపల్లి రైల్వే బ్రిడ్జిల కోసం బీజేపీ ఉద్యమాలు చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా మూడు ప్రాంతాల్లో ఆందోళనలు చేయాలని బీజేపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వరద నష్టం నిధులను ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చిల్లర వేషాలు వేస్తోందని విమర్శించారు ఎంపీ ధర్మపూరి అర్వింద్. ఇవాళ(మంగళవారం) నిజామాబాద్‌లో ఎంపీ ధర్మపూరి అర్వింద్ మీడియాతో మాట్లాడారు. కామారెడ్డిలో వరద నష్టం ఇవ్వకపోతే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఏం చేస్తున్నారని నిలదీశారు.కేసీఆర్ ప్రభుత్వం మాదిరిగానే చిల్లర వేషాలనూ కాంగ్రెస్ కూడా వేస్తోందని ధ్వజమెత్తారు. నిజామాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షులు, ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్నా పెండింగ్ పనులకు నిధులు ఎందుకు తేవడం లేదని ప్రశ్నించారు. కర్ణాటక, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉ ందని.. ఆల్మట్టి పెంపుపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తేల్చుకోవాలని ఎంపీ ధర్మపూరి అర్వింద్ సవాల్ విసిరారు.




**కోటగిరి: నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలో విషాద ఘటన చోటుచేసుకుంది. గోడ కూలి తండ్రి, కుమార్తె మృతి చెందారు. మంగళవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకుంది. ఇంటి పక్కనే ఉన్న రైస్‌మిల్ గోడ కూలి వీరు నివాసం ఉంటున్నన రేకుల షెడ్డుపై పడింది. దీంతో షెడ్డులో నిద్రిస్తున్న ఇందూరు మహేష్ కుమార్, నెలల వయసు ఉన్న చిన్నారి ప్రాణాలు కోల్పోయారు. చిన్నారి తల్లి మహేశ్వరికి తీవ్ర గాయాలు కాగా.. స్థానిక ఆస్పత్రికి తరలించారు. సోమవారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షానికి రైస్‌మిల్ గోడ పూర్తిగా తడిసిపోయి కూలినట్లు స్థానికులు చెబుతున్నారు.**

## కృష్ణా ట్రైబ్యునల్‌లో సమర్థమైన వాదనలు వినిపిస్తాం: ఉత్తమ్



దిల్లీ: కృష్ణా ట్రైబ్యునల్‌లో రాష్ట్రం తరపున సమర్థమైన వాదనలు వినిపిస్తామని తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉ త్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. ఇవాళ్టి నుంచి మూడు రోజులపాటు కృష్ణా ట్రైబ్యునల్‌లో వాదనలు కొనసాగనున్నాయి. ఈ నేపథ్యంలో మంత్రి ఉత్తమ్ దిల్లీ వెళ్లారు. ట్రైబ్యునల్ ముందు రాష్ట్ర వాదనలు స్వయంగా పరిశీలిస్తానని చెప్పారు. కృష్ణా జలాల్లో న్యాయమైన వాటా సాధిస్తామన్నారు. "కృష్ణా జలాల్లో మనకు రావాల్సిన వాటా తప్పక రావాల్సిందే. ట్రైబ్యునల్ ముందు రాష్ట్రం తరపున వైద్యనాథన్ వాదనలు వినిపిస్తున్నారు. బ్రిజేశ్ కుమార్ ట్రైబ్యునల్-2 ఉమ్మడి రాష్ట్రానికి 1050 టీఎంసీలు కేటాయిచింది. ఇప్పుడు కృష్ణా జలాల్లో రాష్ట్రానికి 70 శాతం కేటాయించాలని వాదనలు వినిపిస్తున్నాం. సాగుభూమి, నదీ పరివాహకంలో జనాభా ఆధారంగా అధిక వాటా కోరుతున్నాం. గత భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం వల్లే కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం జరిగింది. కేవలం 299 టీఎంసీలకు అంగీకరిస్తూ అప్పటి కేసీఆర్ ప్రభుత్వం సంతకం చేసింది. ఈ చర్యతో రాష్ట్రానికి పదేళ్లుగా అన్యాయం జరుగుతోంది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం 780 టీఎంసీలను కోరుతోంది" "ఏపీ ప్రభుత్వం కృష్ణా జలాలను బేసిన్ అవతలకు తరలిస్తోంది. అల్మట్టి ఎత్తు పెంపును అడ్డుకుని తీరుతాం. తెలంగాణ జల హక్కులను కాపాడేందుకు ఎవరితోనైనా పోరాడుతాం" అని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు"







చెన్నై: తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే దివంగత నేత కరుణానిధి విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలంటూ రాష్ట్ర ప్రభుత్వం వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తప్పుపట్టింది. 'మీ నేతలను కీర్తించేందుకు ప్రజాధనాన్ని ఎలా వినియోగిస్తారు" అని అత్యున్నత న్యాయస్థానం ప్రశ్నించింది. ప్రభుత్వం తన పిటిషన్‌ను ఉపసంహరించుకొని, ఈ వ్యవహారంపై మద్రాస్ హైకోర్టునే ఆశ్రయించాలని సూచించింది. తిరునెల్వేలి జిల్లాలోని వల్లియూర్ వెజిటేబుల్ మార్కెట్ ప్రవేశద్వారం వద్ద కరుణానిధి కాంస్య విగ్రహం ఏర్పాటుచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి కోరింది. ఆ పిటిషన్‌పై అసహనం వ్యక్తంచేసిన అత్యున్నత న్యాయస్థానం.. గతంలో మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. బహిరంగ ప్రదేశాల్లో విగ్రహాల ఏర్పాటుకు అనుమతిస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వలేదని హైకోర్టు అప్పుడు స్పష్టంచేసింది. ఇలాంటి ఏర్పాట్ల వల్ల ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడతారని అనుమతి నిరాకరించింది. విగ్రహాల ఏర్పాటుకు ఎలాంటి అనుమతి ఇవ్వకూడదంటూ గతంలో సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చిందని గుర్తుచేసింది. ఆ నేపథ్యంలో ప్రభుత్వాలు అనుమతి ఇవ్వడం సాధ్యంకాదని తేల్చిచెప్పింది. తమిళనాడు రాజకీయాలపై కరుణానిధి చెరగని ముద్ర వేశారు. దశాబ్దాల పాటు డీఎంకే పార్టీని నడిపిన ఆయన.. ఐదుసార్లు ముఖ్యమంత్రి పదవిని చేపట్టారు. తమిళం మాట్లాడే ప్రజల హక్కుల కోసం, సామాజిక న్యాయం, అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారు.




## ఆయుధాలు అప్పగించాలి.. భూపతికి మావోయిస్టు కేంద్ర కమిటీ హెచ్చరిక

హైదరాబాద్: సీనియర్ మావోయిస్టు నేత మల్లోజుల వేణుగోపాల్ ఎలియాస్ భూపతిపై మావోయిస్టు కేంద్ర కమిటీ కీలక చర్యలు తీసుకుంది.


అతడిని ద్రోహిగా పేర్కొంటూ.. ఉన్న ఆయుధాలను వెంటనే పార్టీకి అప్పగించాలని ఆదేశించింది. లేకపోతే వాటిని పీపుల్స్ గెరిల్లా ఆర్మీ స్వాధీనం చేసుకుంటుందని హెచ్చరించింది. ఇటీవల ఆయుధాలు వదిలేసేందుకు సిద్ధంగా ఉన్నామంటూ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి హోదాలో మల్లోజుల వేణుగోపాల్ ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రకటనను కేంద్ర కమిటీ తప్పుబట్టింది. పార్టీపై మల్లోజుల వేణుగోపాల్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని కేంద్ర కమిటీ ఆరోపించింది.

కాల్పుల విరమణ, శాంతి చర్చలపై అతడి ప్రకటనను ఖండించింది. లొంగిపోయేందుకే ఇలాంటి ప్రకటనలు చేస్తున్నారని పేర్కొంది. భూపతి.. సీనియర్ మావోయిస్టు నేత మల్లోజుల కోటేశ్వరరావు ఎలియాస్ కిషన్‌జీకి తమ్ముడు.




హైదరాబాద్: కులగణన సర్వే వివరాలు బయటపెట్టకుండా బీసీ రిజర్వేషన్ల ఖరారుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఆరోపించారు. తమకు అనుకూలంగా ఉన్న చోట రిజర్వేషన్లు ఖరారు చేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల తేదీలు ప్రకటించేలోపే కులగణన సర్వే వివరాలు వెల్లడించి ప్రభుత్వం తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని పేర్కొన్నారు. హడావుడిగా ఎన్నికలు నిర్వహించి రాజకీయ ప్రయోజనం పొందడానికి ప్రయత్నిస్తే బీసీలకు అన్యాయం చేసినట్లేనన్నారు. గ్రామ పంచాయతీల వారీగా కుల గణన వివరాలు వెల్లడించాలని ఆమె డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం తెలంగాణ జాగృతి మొదటి నుంచి చిత్తశుద్ధితో పని చేస్తోందన్నారు. రిజర్వేషన్ల పెంపు సాధించే వరకు పోరాటం కొనసాగిస్తామని కవిత తెలిపారు.


## 'గ్రూప్- 1 తీర్పు'పై హైకోర్టులో మరో అప్పీల్ దాఖలురి



హైదరాబాద్: తెలంగాణలో గ్రూప్-1 జనరల్ ర్యాంకింగ్ లిస్ట్, మార్కుల జాబితాను రద్దు చేస్తూ ఇటీవల వెలువడిన తీర్పుపై హైకోర్టులో మరో అప్పీల్ దాఖలైంది. గ్రూప్-1 ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థి ఒకరు ఈ అప్పీల్ దాఖలు చేశారు.

జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు గతంలో ఇచ్చిన తీర్పును కొట్టివేయాలని విజ్ఞప్తి చేశారు. దీంతో సదరు అభ్యర్థి అప్పీల్‌ను సీజే ధర్మాసనం విచారణకు స్వీకరించింది. టీజీపీఎస్సీ కూడా అప్పీల్ దాఖలు చేశారని న్యాయవాది పేర్కొనగా.. ఈ రెండు పిటిషన్లు కలిపి విచారిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది.

## అన్నపూర్ణా దేవి అలంకారంలో శ్రీ భద్రకాళీ అమ్మవారు




వరంగల్ శ్రీ భద్రకాళీ అమ్మవారి ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు కన్నులపండుగగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి అర్చకులు విశేష పూజలను నిర్వహించారు. అన్నపూర్ణా దేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఆలయానికి భారీ సంఖ్యలో తరలి వచ్చారు. అమ్మవారి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం అధికారులు ఉచిత అన్నప్రసాద వితరణ చేస్తున్నారు.

## శ్రీశైలం ప్రాజెక్టుకు పోటెత్తిన వరద.. పది గేట్లు ఎత్తి నీటి విడుదల

**శ్రీశైలం జలాశయానికి వరద పోటెత్తింది. జూరాల, సుంకేసుల ప్రాజెక్టుల నుంచి వరద కొనసాగుతోంది. శ్రీశైలం ప్రాజెక్టులోకి 3,42,516 క్యూసెక్కులు చేరుతుండగా 4,06,227 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ నుంచి 30,000 క్యూసెక్కులు, ఎడమ గట్టు విద్యుత్ కేంద్రం నుంచి 35,315 క్యూసెక్కులు, కుడిగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 30,072 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పది స్పిల్ వే గేట్లను 12 అడుగులు ఎత్తి 3,10,840 క్యూసెక్కులు నాగార్జునసాగర్‌కు వదులుతున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 883 అడుగులకు చేరింది. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా ప్రస్తుతం 204.35 టీఎంసీలుగా కొనసాగుతోంది.**

# ఇంగ్లీష్ ఛానల్ ను ఈదిన తొలి భారతీయ మహిళ ఆరతి సాహా

## - సెప్టెంబర్ 24... పద్మశ్రీ ఆరతి సాహా జయంతి



ఆరతి గుప్తా నీ సాహా (సెప్టెంబర్ 24, 1940 – ఆగష్టు 23, 1994) ఇంగ్లీషు ఛానెల్ ను ఈదిన తొలి భారతీయ మహిళ. ఈమె జిబ్రాల్టర్ జలసంధిని ఈదిన తొలి భారతీయ మహిళగా గుర్తింపు పొందింది. ఆమె తన నాల్గవ యేట నుండే ఈత అభ్యాసం ప్రారంభించింది. ఆమె ప్రతిభను "సచిన్ నాగ్" అనే కోచ్ గుర్తించాడు. 1945 నుండి 1951 వరకు ఆమె ఆలిండియా రికార్డు (1949) తో పాటు 22 పోటీలలో పాల్గొన్నది. ఆమె ఇంగ్లీషు ఛానెల్ ఈదిన భారతీయ స్విమ్మర్ అయిన మిహిర్ సేన్ పట్ల ప్రభావితురాలైంది. సెప్టెంబర్ 29 1959 న ఇంగ్లీషు ఛానెల్ ఈది భారత దేశంలో ప్రథమ మహిళగా నిలిచింది. 1960 లో, ఆమె పద్మశ్రీ అవార్డు పొందిన మొదటి భారతీయ క్రీడాకారిణి అయింది. 1946 –1956 మధ్య, ఆరతి అనేక ఈత పోటీలలో పాల్గొన్నది. 1945 – 1951 మధ్య ఆమె పశ్చిమ బెంగాల్‌లో 22 రాష్ట్ర స్థాయి పోటీలను గెలుచుకుంది. 1948 లో, ఆమె ముంబైలో జరిగిన జాతీయ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంది. ఆమె 100 మీటర్ల ఫ్రీస్టైల్ మరియు 200 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్‌లో రజతం గెలుచుకుంది. 200 మీటర్ల ఫ్రీస్టైల్‌లో కాంస్యం గెలుచుకుంది. ఆమె 1949 లో అఖిల భారత రికార్డును సృష్టించింది. 1951 పశ్చిమ బెంగాల్ రాష్ట్ర పోటీల్లో, ఆమె 100 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్‌లో 1 నిమిషం 37.6 సెకన్లు పూర్తి చేసి డాలీ నజీర్ నెలకొల్పిన అఖిల భారత రికార్డును అధిగమించింది. అదే పోటీల్లో, ఆమె 100 మీటర్ల ఫ్రీస్టైల్, 200 మీటర్ల ఫ్రీస్టైల్, 100 మీటర్ల బ్యాక్ స్ట్రోక్‌లో కొత్త రాష్ట్ర స్థాయి రికార్డును సాధించింది. ఆమె 1952 సమ్మర్ ఒలింపిక్స్‌లో స్వదేశీ డాలీ నజీర్‌తో కలిసి భారత దేశానికి ప్రాతినిధ్యం వహించింది. పాల్గొన్న నలుగురు మహిళలలో ఆమె ఒకరు. భారత బృందంలోని అతి పిన్న వయస్కురాలు. ఒలింపిక్స్‌లో, ఆమె 200 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్ ఈవెంట్‌లో పాల్గొంది.

ఆరతి బ్రోజెన్ దాస్ నుండి ఇంగ్లీష్ ఛానెల్‌ని దాటడానికి మొదటి ప్రేరణ పొందింది. 1958 బట్లిన్ ఇంటర్నేషనల్ క్రాస్ ఛానల్ స్విమ్మింగ్ రేస్‌లో, బ్రోజెన్ దాస్ పురుషులలో మొదటి క్రీడాకారుడు. ఇంగ్లీష్ ఛానల్‌ను దాటిన భారత ఉపఖండం నుండి మొదటి వ్యక్తిగా గుర్తింపు పొందాడు. 1959లో ఈవెంట్ కోసం బట్లిన్ ఇంటర్నేషనల్ క్రాస్ ఛానల్ స్విమ్మింగ్ రేస్ నిర్వాహకులకు ఆరతి పేరును దాసే ప్రతిపాదించాడు. 24 జూలై 1959 న, ఆమె తన మేనేజర్ డాక్టర్ అరుణ్ గుప్తాతో కలిసి ఇంగ్లాండ్ వెళ్లింది. ప్రాథమిక ప్రాక్టీస్ తరువాత, ఆమె తన చివరి ప్రాక్టీస్‌ను 13 ఆగస్టు నుండి ఇంగ్లీష్ ఛానల్‌లో ప్రారంభించింది. ఆ సమయంలో, 1959 బట్లిన్ ఇంటర్నేషనల్ క్రాస్ ఛానల్ స్విమ్మింగ్ రేస్‌లో పాల్గొన్న డాక్టర్ బిమల్ చంద్ర ఆమెకు మార్గదర్శకత్వం వహించాడు. ఆయన ఇటలీలోని నేపుల్స్‌లో జరిగిన మరో ఈత పోటీ నుండి ఇంగ్లాండ్ చేరుకున్నాడు. 23 దేశాలకు చెందిన 5 మంది మహిళలతో సహా మొత్తం 58 మంది పోటీలో పాల్గొన్నారు. ఈ రేసు 27 ఆగష్టు 1959 న స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 1 గంటకు ఫ్రాన్స్‌లోని కేప్ గ్రిస్ నెజ్ నుండి ఇంగ్లాండ్‌లోని శాండ్‌గేట్ వరకు షెడ్యూల్ చేయబడింది. అయితే, ఆరతి సాహా యొక్క పైలట్ బోట్ సకాలంలో రాలేదు. ఆమె 40 నిమిషాలు ఆలస్యంగా ప్రారంభించాల్సి వచ్చింది. అనుకూలమైన పరిస్థితిని కోల్పోయింది. ఉదయం 11 గంటలకు, ఆమె 40 మైళ్ల కంటే ఎక్కువ ఈదుకుంటూ ఇంగ్లాండ్ తీరానికి 5 మైళ్ల దూరంలో వచ్చింది. ఆ సమయంలో ఆమె వ్యతిరేక దిశ నుండి బలమైన ప్రవాహాన్ని ఎదుర్కొంది. ఫలితంగా, సాయంత్రం 4 గంటలకు, ఆమె మరో రెండు మైళ్లు మాత్రమే ఈత కొట్టగలదు. ఆమె ఇంకా కొనసాగించాలని నిశ్చయించు కున్నప్పటికీ, పైలట్ ఒత్తిడితో ఆమె విడిచిపెట్టాల్సి వచ్చింది. 29 సెప్టెంబర్ 1959 న, ఆమె తన రెండవ ప్రయత్నం చేసింది. ఫ్రాన్స్‌లోని కేప్ గ్రిస్ నెజ్ నుండి ప్రారంభించి, ఆమె 16 గంటల 20 నిమిషాల పాటు ఈదుతూ, కఠినమైన తరంగాలతో పోరాడి 42 మైళ్ల దూరంలో సాండ్‌గేట్, ఇంగ్లాండ్‌కు చేరుకుంది. ఇంగ్లాండ్ తీరానికి చేరుకుని, ఆమె భారత జెండాను ఎగుర వేసింది. విజయలక్ష్మి పండిట్ ఆమెను ముందుగా అభినందించారు. జవహర్ లాల్ నెహ్రూ, పలువురు ప్రముఖులు ఆమెను వ్యక్తిగతంగా అభినందించారు. సెప్టెంబర్ 30 న, ఆల్ ఇండియా రేడియో ఆరతి విజయాన్ని సాధించినట్లు ప్రకటించింది. ఆమెకు 1960 లో పద్మశ్రీ అవార్డుతో భారత ప్రభుత్వం సత్కరించింది. ఆమె ఆగష్టు 23 1994 న మరణించింది. 1998 లో వివిధ రంగాలలో భారతీయ మహిళల కృషికి గుర్తింపుగా, ఆర్తీ గుప్తాకు కూడా పోస్టల్ స్టాంపును భారత ప్రభుత్వం విడుదల చేసింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# జెన్ జెడ్ ని తట్టుకోవడం ఎవరి తరం ?



జెన్ జెడ్ ఇపుడు దేశంలో సగటు రాజకీయ నేతల నుంచి ప్రముఖ నేతల వరకూ అందరిలో వినిపిస్తున్న మాట. కొత్తగా ఉంది. జనాలకు క్యాచీగా ఉండి కనెక్ట్ అవుతోంది అని వాడేస్తున్నారు. పైగా తమ ప్రత్యర్ధులకే ముప్పు అని భావిస్తున్నారు, ఒక రకంగా భ్రమిస్తున్నారు. జెన్ జెడ్ తరం ఉప్పొంగాలని విరుచుకుపడాలని కూడా ఎవరికి వారుగా పిలుపు ఇస్తున్నారు. నిజానికి చూస్తే భారతీయ సమాజం ఈ విధంగా ఉంది పదిలంగా ఉంది, భద్రంగా ఉంది అంటే దానికి కారణం సగటు యువతలో సముద్రమంత సహనం ఉండడమే అని అంటున్నారు.

**ఎనభయ్యేళ్ళుగా :** దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దాదాపుగా ఎనభై ఏళ్ళకు దగ్గర పడుతోంది. అయితే మంచి జరగలేదు అని ఎవరూ అనలేరు, దేశం అభివృద్ధి చెందలేదు అని కూడా అనవసరంగా నిందించే పరిస్థితి కూడా లేదు. ప్రపంచంలో భారత్ మంచి ప్లేస్ లో ఉంది అని అంతా అంగీకరిస్తారు. కానీ ఎపుడో ఆరున్నర దశాబ్దాల కిందట ఒక మహాకవి తెలుగు సినిమాలో రాసిన ఒక పాట నగ్న సత్యాన్ని ఈ రోజుకీ ప్రతీ పౌరుని చెవులలో అలా వినిపిస్తూనే ఉంటుంది. అదే అక్షర సత్యమని కూడా గుర్తు చేస్తూనే ఉంటుంది. ఇంతకీ ఆ పాట ఏమిటి అంటే వెలుగు నీడలలో పాడవోయి భారతీయుడా పాట. అవినీతి బంధుప్రీతి చీకటి బజారు నిరుద్యోగం, లంచాలు, రాజకీయ పెత్తనం ఇలా ఏ వైపు చూసినా ఏముంది గర్వకారణం అన్నట్లుగానే దేశం పరిస్థితి ఉంది.

**ఆకలి అగ్ని కణంగా :** ఎక్కడ అయినా మనిషిని మండించేది ఎంతటి వారిని అయినా ఎదిరించేలా చేసేది ఆకలి. ఇక చదువుకుందామంటే భారీగా ఫీజులు, తీరా చదివాక ఉద్యోగాలు దొరకవు. ఇప్పటికి యాభై ఏళ్ళ క్రితం ఆకలి రాజ్యం సినిమాలో ఆత్రేయ రాసిన పాట సాపాటు ఎటూ లేదు బ్రదర్ అన్న దాంతో అంతా చూడవచ్చు. నిరుద్యోగం నిలువెత్తులా ఎదిగి మింగేస్తున్న వేళ సగటు యువ జనంలో ఆశలు ఎలా ఉంటాయి అన్నది ఆలోచించాల్సిందే కదా. అలాగే ఎటు చూసినా అవినీతి ఆశ్రిత పక్షపాతంతో మగ్గిపోతున్న వేళ హాహాకారాలే కదా జనంలో వినిపించే ఆర్తనాదాలు అన్న ఆవేదన సైతం కలుగుతుంది.

**రెండు భారతాలుగా :** ఒకే దేశంలో రెండు భారతాలు ఉన్నాయి. ఒకటి సంపన్న భారతం. రెండవది నిరుపేద భారతం. మూడున్నర దశాబ్దాల క్రితం ఆర్ధిక సంస్కరణలు అమలు అయ్యాక దేశంలో ధనవంతులు మరింతగా పెరిగారు. వారి ఆస్తులు బాగా పెరిగాయి. అదే సమయంలో మధ్యతరగతి అధోగతి పాలు అయ్యారు. పేదలుగా జారిపోయారు. ఆ పేదలు కటిక పేదలు అయ్యారు. పాలకులు పేదరికాన్ని తీసేసామని కోట్లాది మందిని పేదరికం నుంచి ఒడ్డున పడేశామని గొప్పగా చెప్పవచ్చు కానీ నిజానికి ఈ దేశంలో 140 కోట్ల మంది ప్రజానీకం ఉంటే 80 కోట్ల మందికి పైగా ఇంకా తెల్ల రేషన్ కార్డు మీద చౌక దుకాణాల వద్ద సరుకులు ఇస్తున్నారు అన్నది ఒక కఠిన సత్యంగా కళ్ళ ముందు ఉంది అన్నది మేధావుల మాటగా ఉంది.

**సముద్రమంత సహనం :** ఈ దేశానికి ఎంతో సహనం ఉంది. అసలు ఈ గడ్డకు మాత్రం అది సొంతం అని చెప్పాలి. ఎంతో మంది విదేశీయులు దేశం మీద పడి దండయాత్రలు చేసినా వారి మీద పోరాడి పంపించే శక్తి కూడా ఉంది. అదే సమయంలో మంచిగానే ఉంటూ శత్రువును సైతం ఆవల గట్టుకు పంపించే సహనం కూడా జనాలలో ఉంది. అదే ఎప్పటికీ శ్రీరామ రక్షగా దేశంలో అందరికీ నిలిచి దీవిస్తోంది.

**కట్టలు తెంచుకోవద్దనే :** ఈ దేశంలో జెన్ జెడ్ తరం శివమెత్తాలని వారు వీరభద్రులై ప్రళయ తాండవం చేయాలని కొందరు రాజకీయ నేతలు ఉత్సాహపడుతున్నారు. కానీ అదే కనుక జరిగితే ముందు వారే తట్టుకోలేరు అన్నది పచ్చి నిజం. అలుగుటయే ఎరుగని ధర్మరాజు అలిగిన నాడు సాగరమ్ములన్నీ ఏకమయ్యేను అన్న మహా భారత పద్యం సాక్షిగా సలసల మండే యువత అయినా సగటు జనత అయినా సహనంగా ఉన్నంత సేపే అని అంతా గుర్తు ఉంచుకోవాలి. కట్టలు తెంచుకుంటే మాత్రం అదిసునామీయే అవుతుంది.

అలాంటి స్థితి పరిస్థితి రాకుండా సమున్నత భారతంగా సహన భారతంగా సకుటుంబ పరివారం సమాజంగా సగర్వంగా తలెత్తుకుని నిలబడి ప్రపంచానికి మనమే ఒక అద్భుత సందేశంగా నిలవాలన్నదే అందరి కోరిక. అందువల్ల దయచేసి ప్రత్యర్థుల మీద సెటైర్ల కోసం జెన్ జెడ్ ని ఎవరూ వాడొద్దు. ఎందుకంటే అది అగ్గి రవ్వ. నిప్పు కణిక తట్టుకోలేరు అంతే. తస్మాత్ జాగ్రత్త.

# విద్యార్థి దశ నుంచే సామాజిక స్పృహ

## సెప్టెంబర్ 24 ... ఎన్ఎస్ఎస్ దినోత్సవం






విద్యార్థుల ప్రప్రథమ కర్తవ్యం విద్యాభ్యాసం. కానీ భావి భారతాన్ని నిర్ణయించ వలసినది యువకులే. ప్రతి దేశ పురోభివృద్ధి లోనూ, ఉద్యమాల లోనూ విద్యార్థులు పాలు పంచు కుంటారు. ఒక్కొక్కసారి ఆవేశం ఎక్కువ కావచ్చు కానీ కల్లాకపటం ఎరగని నిర్మల, సున్నిత మనస్కులు విద్యార్థులు. వారు కూడా సంఘజీ వులే, సంఘంలో భాగస్వాములే, సంఘసేవ (%ూశీఎఋుశ్రీ ంవతీఙఱషవ%) వారికీ సామాజిక బాధ్యతగా ఉంది. విద్యాభ్యాసానికి ఆటంకాలు లేకుండా సంఘసేవ చేసే అవకాశాలను ప్రభుత్వాలు కల్పిస్తున్నాయి. విద్యను ఆర్జించే వయసులోనే యువతీ యువకులలో సేవాభావం, దేశభక్తి, సామాజిక స్పృహ ను కలిగించేందుకు 'జాతీయ సేవా పథకం' (ఎన్ఎస్ఎస్) ప్రారంభమైంది. నిరుపేదల కష్ట సుఖాలలో పాలు పంచుకుంటూ, సమాజ సేవ చేసే లక్ష్యంతో జాతిపిత మహాత్మా గాంధీ శత జయంతి సందర్భంగా 1969 సెప్టెంబర్ 24వ తేదీన ఈ పథకాన్ని దేశ వ్యాప్తంగా మొదలు పెట్టారు. అప్పటి "విశ్వ విద్యాలయాల నిధుల సంఘం" (యూజీసీ) చైర్మన్ రాధాకృష్ణన్ జాతీయ సేవా పథకాన్ని విద్యా సంస్థలలో ప్రారంభించాలని సూచించారు. 1959 జనవరిలో జరిగిన సీఏబీఈ పాలక మండలి ఆయన సూచనకు ఆమోదం తెలిపింది. 1952లో పంచవర్ష ప్రణాళికలో ప్రతిపాదించబడి, 4వ పంచవర్ష ప్రణాళికలో ప్లానింగ్ కమిషనర్ ద్వారా 5కోట్ల రూపాయలను ఎన్ఎస్ఎస్ పథకానికి కేటాయించారు. 1958లో అప్పటి ప్రధాన మంత్రి పండిట్ నెహ్రూ దేశంలోని ముఖ్య మంత్రులకు జాతీయ సేవా పథకాన్ని అమలు చేయాలంటూ లేఖలు రాశారు. ఈ పథకానికి తగిన వ్యూహ రచన చేయాలని కూడా ఆయన కేంద్ర విద్యాశాఖను ఆదేశించారు. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 37 విశ్వ విద్యాలయాలలో సుమారు 40,000 మంది వాలంటీర్లతో అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి వి.కె.ఆర్.రావు ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. 1999 నాటికి ఈ పథకంలో 13,52,000 మంది వాలంటీర్లు ఉన్నారు. 176 విశ్వ విద్యాలయాల పరిధిలో లక్షలాది మంది విద్యార్థులు ఎన్ఎస్ఎస్‌లో సేవలందిస్తున్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లోనూ ఎన్ఎస్ఎస్ యూనిట్లను కళాశాల స్థాయిలో ప్రారంభించారు. లక్షలాది మంది వాలంటీర్లు సమాజ సేవలో భాగస్వాములు అవుతున్నారు. ప్రతిఫలం ఆశించకుండా సేవా మార్గం పట్టేవారే ఎన్ఎస్ఎస్‌లో వలంటీర్లుగా చేరతారు. మొక్కల పెంపకం, పారిశుద్ధ్యం, రక్తదాన శిబిరాలు, అక్షరాస్యత వంటి కార్యక్రమాల్లో విద్యార్థినీ విద్యార్థులు స్వచ్ఛందంగా పాల్గొంటున్నారు. సామాజిక కార్యక్రమాల అమలులో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఒకనాడు దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ఒకవైపు విద్యా వ్యాసంగాన్ని కొనసాగిస్తూనే, మరోవైపు సంఘసేవకు విద్యార్థులను సమాయత్త పరచేదే జాతీయ సేవా పథకం. సామాజిక కార్యక్రమాలపై యువతకు తర్ఫీదునివ్వడమే గాక, వారి సేవలను వినియోగించు కోవడం ఎన్ఎస్ఎస్‌లో కనిపిస్తుంది. కళాశాల స్థాయిలో ఎన్ఎస్ఎస్ విభాగాలకు ప్రిన్సిపాల్ పర్యవేక్షకుడిగా, ఒక అధ్యాపకుడు ప్రోగ్రాం అధికారిగా వ్యవహరిస్తారు. సమాజ సేవ పట్ల ఆసక్తి చూపే విద్యార్థులను ఇందులో చేర్చుకుంటూ, ప్రతి వందమంది విద్యార్థులను ఒక యూనిట్‌గా ప్రత్యేక తరగతులను నిర్వహిస్తుంటారు. రెండు విద్యా సంవత్సరాలలో కనీసం 240 గంటలు సంఘసేవలో పాల్గొనేలా కృషి జరుగుతోంది. భావితరాలకు వారసులైన విద్యార్థులు జట్లుగా పనిచేస్తూ ఐక్యతా భావాన్ని పంచు కుంటారు. సమాజంలో విద్యార్థి తన స్థానాన్ని, గమ్యాన్ని నిర్ణయించు కొనేలా చేయడం ఇందులోని ప్రధాన అంశం. విద్యార్థులు చిత్తశుద్ధితో, క్రమశిక్షణతో సామాజిక సేవలో పాల్గొనేలా చేయడమే జాతీయ సేవా పథకం ప్రధాన ధ్యేయం. కళాశాల ప్రిన్సిపాల్ నిర్ణయించిన ప్రకారం సమీప ప్రదేశాల్లో ఆలయాలు, చారిత్రక కట్టడాల పునరుద్ధరణ, గ్రామీణ ప్రాంతాలలో అపరిశుభ్రతను తొలగించడం, మంచినీటి సౌకర్యాల మెరుగుదలకు శ్రమదానం, పర్యావరణ పరిరక్షణ, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు ఎన్ఎస్ఎస్ శిబిరాలలో నిర్వహిస్తుంటారు. ఒక గ్రామాన్ని దత్తత తీసుకొని అక్కడి వసతులను గ్రామస్తుల సహకారంతో మెరుగు పరచేందుకు విద్యార్థులు కృషి చేస్తారు. రక్తదానం, ఉత్సవాలలో స్వచ్ఛంద సేవ, అతివృష్టి, అనావృష్టి, వరదలు, తుఫానులు, భూకంపాలు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించి నపుడు విరాళాలు సేకరించి తగు సహాయ సహకారాలను అందించడం కూడా ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమాలుగా ఉన్నాయి. అక్షరాస్యతా కార్యక్రమాల అమలులో భాగస్వాములు కావడం, ఆరోగ్య సూత్రాలను బోధించడం, ఎయిడ్స్ వంటి ప్రాణాంతక వ్యాధులపై ప్రజలను చైతన్య పరచడం వంటి కార్యక్రమాల్లోనూ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొంటారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవలకు గుర్తింపుగా విశ్వ విద్యాలయాలు ధ్రువీకరణ పత్రాలను అంద జేస్తాయి. ఉద్యోగ నియామకాలు, ఇతర సందర్భాల్లో ఈ సర్టిఫికెట్ లకు విలువ ఉంటుంది. ఆర్మీ, ఎయిర్ ఫోర్సు, మిలటరీ, నర్సింగ్ సర్వీసులలో, పోలీసు, టెలికాం, సమాచార వ్యవస్థ తదితర విభాగాల్లో నియామకాల సందర్భంగా ఎన్ఎస్ఎస్ సర్టిఫికెట్లు ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుంది. 'నా కోసం కాదు, నీ కోసమే..' అనే దీక్షా నినాదంతో– సేవలు అందించడమే ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల లక్ష్యం. యువతలో సామాజిక స్పృహను కల్పిస్తూ, వారిని సేవా భావంతో ముందుకు నడిపించడం నిరంతర కార్యక్రమంగా కొనసాగాలి. ఈ లక్ష్యంతో ఏర్పాటైన జాతీయ సేవా పథకం ఎంతోమంది విద్యార్థులను ఆకర్షిస్తోంది. ఈ పథకంలో చేరిన వారు క్రమశిక్షణ, సామాజిక చైతన్యం కలిగి జీవితంలో ముందుకు రాణించే అవకాశం ఉంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# అమెరికాలో ఇవేం పాడు పనులు.. పరువు తీసిన భారత యువతి.. వైరల్ వీడియో

అమెరికా వెళ్లాలని లక్షలాది మంది భారతీయ యువత కలలు కంటారు. ఉన్నత విద్య, మంచి ఉపాధి అవకాశాలు, స్థిరమైన భవిష్యత్తు కోసం ప్రతి సంవత్సరం భారత్ నుంచి అమెరికాకు వెళ్లే వారి సంఖ్య పెరుగుతూనే ఉంది. 2023–24లో అమెరికాలో చదువుతున్న భారత విద్యార్థుల సంఖ్య 3.32 లక్షలకు చేరింది. అలాగే 2023లో గ్రీన్‌కార్డ్ పొందిన వారిలో భారత్ మూడో స్థానంలో నిలిచింది. ఇక H-1B వీసాల విషయంలో 80 శాతం కంటే ఎక్కువ మంది భారతీయులే ఉన్నారు. ఇలాంటి సమయంలో అమెరికాలో చదువుకునే కొంతమంది యువత ప్రవర్తనపై సామాజిక మాధ్యమాల్లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా అమెరికా ట్రైన్‌లో ఓ భారతీయ అమ్మాయి బహిరంగంగా డ్యాన్స్ చేస్తూ కనిపించిన వీడియో వైరల్‌గా మారింది. చుట్టూ ఉన్న అమెరికన్లు ప్రశాంతంగా ప్రయాణిస్తుంటే, ఆమె మాత్రం అడ్డంగా డ్యాన్స్ చేస్తూ విచిత్రమైన స్టెప్స్ వేసింది. ఈ




వీడియో నెట్టింట విపరీతంగా షేర్ అవుతూ, విమర్శలకు తావిస్తోంది. నెటిజన్లు ఆమె ప్రవర్తనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "భారత్ పరువు తీస్తుంది", "అప్పులు చేసి అమెరికా పంపిస్తే ట్రైన్స్‌లో రీల్స్ చేస్తారా?", "మీ లాంటి వాళ్ల వల్లే వీసా ధరలు పెరిగాయి" అంటూ మండిపడుతున్నారు. మరికొందరు ఆమెను వెంటనే ఇండియాకు పంపాలని డిమాండ్ చేస్తున్నారు. దేశ ప్రతిష్టను దెబ్బతీసే ప్రవర్తనగా దీన్ని పేర్కొంటున్నారు. ఇక మరోవైపు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల తీసుకున్న సంచలన నిర్ణయం దీనికి మరింత రంగు పులిమింది. తాజాగా హెచ్1బీ వీసా దరఖాస్తు ఫీజును లక్ష డాలర్లకు (సుమారు రూ. 83 లక్షలు) పెంచే నూతన నిబంధనలను ప్రకటించారు. ఈ నిర్ణయం అమెరికాలోని టెక్నాలజీ రంగానికే కాకుండా, హెచ్1బీ వీసాలపై ఆధారపడిన భారతీయ ఐటీ రంగానికి తీవ్రంగా దెబ్బతీయనుందని నిపుణులు అంటున్నారు.

**సమాజంలో చర్చ...** అమెరికాలో చదువుకునే లేదా ఉద్యోగాలు చేస్తున్న భారతీయ యువత ప్రవర్తనపై సమాజంలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. వ్యక్తిగత చర్యలు దేశ ప్రతిష్టను ప్రభావితం చేస్తున్నాయనే వాదన బలంగా వినిపిస్తోంది. ట్రంప్ తీసుకున్న ఫీజు పెంపు నిర్ణయానికి కూడా ఈ తరహా ఘటనలు ఒక కారణమని కొందరు అభిప్రాయపడుతున్నారు. మొత్తంగా, అమెరికా ట్రైన్‌లో ఒక అమ్మాయి చేసిన డ్యాన్స్ వీడియో సోషల్ మీడియాలో వినోదం కంటే ఎక్కువగా జాతీయ గౌరవం, వీసా విధానాలు, యువత ప్రవర్తనలపై చర్చను రగిలించింది.

# ఇజ్రాయెల్, అమెరికాకు షాక్.. పాలస్తీనా దేశానికి బ్రిటన్ గుర్తింపు

ప్రపంచంలో మొత్తం ఉన్న దేశాల సంఖ్య ఎంత..? ఈ ప్రశ్నకు రకరకాల సమాధానాలు ఉన్నాయి. ఐక్యరాజ్య సమితి (యూఎన్) ప్రకారం అయితే 195. మరో మూడు అబ్జర్వర్ కంట్రీస్ (పరిశీలక దేశాలు). ఆ మూడు పాలస్తీనా, వాటికన్ సిటీ, కొసావో. వీటిలో వాటికన్ అనేది క్రైస్తవ మత పెద్ద పోప్ నివసించే నగరం. ఇక పాలస్తీనా అనేది 80 ఏళ్ల కిందటి వరకు ఒక ప్రత్యేక దేశమే. 1988లోనే పాలస్తీనాను భారత్ కూడా గుర్తించింది. అప్పట్లో ఈ గుర్తింపు ఇచ్చిన తొలి దేశాలలో మనదీ ఒకటి. ఇటీవల ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో పాలస్తీనాకు సంపూర్ణ దేశ హోదా కల్పించే తీర్మానానికి భారత్ మద్దతు తెలిపింది కూడా.

**ట్రంప్ కు షాక్ ఇస్తూ...** వాటికన్ తో పాటు ఐక్యరాజ్యసమితిలో ప్రస్తుతం పాలస్తీనా సభ్య దేశం కాని పరిశీలక దేశం. ఈ హోదాను సమితి సాధారణ సభ ఇస్తుంది. ఇక తాజాగా పాలస్తీనాను బ్రిటన్, ఆస్ట్రేలియా, కెనడా కూడా ఒక దేశంగా గుర్తించాయి. త్వరలో ఫ్రాన్స్ సహా మరికొన్ని దేశాలు ఇదే నిర్ణయం తీసుకోనున్నాయి. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమంటే.. ఈ దేశాలన్నీ అమెరికాకు



ఒకప్పుడు మిత్ర దేశాలు. అయితే, డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధ్యక్షుడు అయ్యాక యూరప్ దేశాలనూ వదలకుండా టారిఫ్ లు బాదేస్తున్నారు. పలు విషయాల్లో వాటిని వేధిస్తున్నారు. దీంతో ఆయనకు షాక్ ఇస్తూ పాలస్తీనాను దేశంగా గుర్తించాయి.

**అమెరికా నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చినా..** బ్రిటన్ అంటే అమెరికా సోదరుడు అనుకోవాలి. అంతటి మిత్ర దేశం ఇప్పుడు అమెరికా నుంచి తీవ్ర అభ్యంతరాలు వస్తున్నా లెక్క చేయకుండా పాలస్తీనాను దేశం గుర్తిస్తూ చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. దీనికి ఇజ్రాయెల్, అమెరికా నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చినా బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ పట్టించుకోలేదు. హమాస్ మిలిటెంట్లను లక్ష్యంగా చేసుకుని 2023 నుంచి గాజాపై ఇజ్రాయెల్ యుద్ధం చేస్తోంది. అయితే, అక్కడ అమాయక ప్రజలు బలవుతూ తీవ్రస్థాయి మానవతా సంక్షోభం ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో గాజాలో కాల్పుల విరమణ పాటించాలని, ఐక్యరాజ్య సమితి సాయం అందేలా చూడాలని, దీర్ఘకాల శాంతికి అంగీకరించాలని ఇజ్రాయెల్ ను బ్రిటన్ కోరుతోంది. దీనికి ఒప్పుకోకుంటే పాలస్తీనాను దేశం గుర్తిస్తామని జూలైలోనే స్టార్మర్ స్పష్టం చేశారు. ట్రంప్ ఇటీవల బ్రిటన్ వెళ్లిన సందర్భంలో ఈ ఆలోచనను వ్యతిరేకించారు. కానీ, స్టార్మర్ మాత్రం చరిత్రలో నిలిచిపోయే నిర్ణయం తీసుకున్నారు. పాలస్తీనా, ఇజ్రాయెల్ లో శాంతిని పునరుద్ధరించేందుకు, రెండు దేశాల దేశ పరిష్కారానికి ఈ చర్య చేపట్టినట్లుగా తెలిపారు.

**రెండు దేశాల పరిష్కారం అంటే?...** ద్విదేశ (రెండు దేశాల) పరిష్కారం అంటే... పాలస్తీనా, ఇజ్రాయెల్ రెండూ అని అర్థం. భారత్ ఇప్పటికే దీనికి మద్దతు తెలిపింది. ఒకప్పటి వలస దేశాల రాజు అయిన బ్రిటన్ కూడా ఒప్పుకోవడం కీలక పరిణామం.

చురకలు

## సంపాదకీయం

### అయ్యప్ప సెంట్రిక్‌గా.. కేరళలో మత రాజకీయం..!

కేరళ అంటే.. మూడు కీలక విషయాలు తెరమీదికి వస్తాయి. 1) కమ్యూనిస్టుల ప్రాబల్యం ఎక్కువగా ఉన్న రాష్ట్రం. 2) విద్యాధికులైన ప్రజలు(అక్షరాస్యత) ఎక్కువగా ఉన్న రాష్ట్రం. 3) అయ్యప్ప కొలువైన శబరిమల దేవస్థానం. ఈ మూడు విషయాలు తరచుగా చర్చకు వస్తూనే ఉంటాయి. వీటితోపాటు.. ప్రకృతి సౌందర్యానికి కేరళ కేరాఫ్, అదేవిధంగా క్రిస్టియానిటీ జోరుగా పెరుగుతున్న రాష్ట్రం కూడా ఇదే కావడం గమనార్హం. అయితే.. తాజాగా ఇక్కడ తీవ్ర స్థాయిలో మత వివాదం చోటు చేసుకుని.. అది మత రాజకీయాల దిశగా అడుగులు వేస్తోంది.


**విషయం ఏంటి?...** సుప్రశిద్ధ శబరిమల ఆలయాన్ని పరిరక్షించేందుకు, నిర్వహించేందుకు.. - ట్రావెన్ కోర్ దేవస్వం బోర్డ్ - ఉన్న విష యం తెలిసిందే. ఆలయాన్ని ఎలా నిర్వహించాలి? ఎలాంటి పద్దతులు పాటించాలి? ఏటా ప్రపంచం నలుమూ లల నుంచి వచ్చే స్వామి మాల ధారులకు ఎలాంటి సౌకర్యాలు కల్పించాలి? ప్రసాదాలు.. పద్ధతులు.. ఇలా అన్ని రూపాల్లోనూ అప్పయ్య స్వామి ఆలయానికి సంబంధించి వ్యవహారాలను ఈ బోర్డు ఆధ్వర్యంలోనే నడుస్తున్నాయి. ఇక, ఈ ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు ఏర్పడి.. సెప్టెంబరు 20(శనివారం) నాటికి 75 సంవత్సాలు పూర్తి అవుతున్నాయి. ఈ నేపథ్యంలో పవిత్ర పంబా నది సమీపంలో - అగోలా అయ్యప్ప సంగమం - పేరుతో ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు కీలక సమావేశాన్ని నిర్వహిస్తోంది. దీనికి రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో పినరయి విజయన్ హాజరు కానున్నారు. అంగరంగ వైభవంగా సాగే ఈ కార్యక్రమానికి భారీ ఏర్పాట్లు కూడా చేశారు. అయితే.. ఇక్కడే బీజేపీ తీవ్ర వివాదానికి తెరదీసింది. నాస్తికుడు, కమ్యూనిస్టు అయిన.. పినరయి విజయన్ ఈ కార్యక్రమానికి హాజరు కావడం ఏంటి? అయితే గియితే.. విశ్వహిందూ ధర్మానికి ప్రతీకగా ఉన్న ప్రధాని మోడీని కదా పిలవాలి? అనే డిమాండ్‌తో బీజేపీ రాష్ట్ర స్థాయి ఉద్యమానికి పిలుపునిచ్చింది. ఫలితంగా శుక్రవారం రాత్రి నుంచే కేరళలో రవాణా సేవలు నిలిచిపోయాయి. అంతేకాదు.. పంబా తీరానికి వెళ్లే మా ర్గాలను కూడా బీజేపీ నాయకులు.. ఈ పార్టీకే చెందిన నిరంతర స్వామి మాలధారులు కూడా మూసిసి.. ఉద్యమిస్తు న్నారు. అయితే.. ఈ వ్యవహారంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నాస్తికుడు, ఆస్తికుడు అనే తేడా లేకుండా.. స్వామికి అందరూ భక్తులేనని.. ఆయన పట్ల విశ్వాసం ఉన్న వారు చాలా మంది ఉన్నారని ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు చెబుతోంది. అంతేకాదు.. దీనికి కొన్ని ఉదాహరణలు కూడా పేర్కొంటోంది. అయినప్పటికీ.. బీజేపీ పార్టీ నాయకులు, ఆ పార్టీ తరఫున గెలిచి.. కేంద్ర మంత్రిగా ఉన్న నటుడు కూడా.. ఈ నిర్ణయాన్ని, కార్యక్రమాన్ని కూడా తప్పుబడుతున్నారు. దీంతో పంబా తీరంలోను.. కార్యక్రమం నిర్వహించే ప్లేస్‌లోనూ.. తీవ్ర ఉద్రిక్తత, ఉత్కంఠ భరిత వాతావరణం నెలకొంది.

## సాహితీ దిగ్గజం తిరునగరి - సెప్టెంబర్ 24...తిరునగరి రామానుజయ్య జయంతి



అభినవ మహాకవి, భారతి భాష భూషణ్ దాశరధి కృష్ణమాచార్య పురస్కార గ్రహీత డాక్టర్ తిరునగరి రామానుజయ్య (సెప్టెంబరు 24, 1945 - ఏప్రిల్ 25, 2021) తెలంగాణ రాష్ట్రంకు చెందిన సాహితీవేత్త, పద్యకవి. పద్యం, గేయం, వచన ప్రక్రియలలో సాహిత్య కృషి చేశారు. పద్యకవి, వచనకవితా కవి, కవిత్వ విమర్శకుడు తిరునగరి. తిరునగరి యాదాద్రి జిల్లా రాజపేట మండలంలోని బేగంపేట గ్రామంలో శ్రీమతి జానకిరామక్క, మనోహర్ దంపతులకు 1945 సెప్టెంబర్ 24న జన్మించారు. కవిత్వమే శ్వాసగా జీవించే కవిత్వోపాసకులు ఆయన. మానవత్వం తన కవిత్వ వస్తువుగా, మానవ వేదనలను కవిత్వీకరించటంలో ఆయన ఘనాపాటి. అసాధారణ ధారణాశక్తితో ఎందరో రచనలను ఉదాహరిస్తూ, ఆశువుగా పద్యాలు చెప్తూ తాను చేసే సాహిత్యోపన్యాసాలు చేయడంలో తనకు తానే సాటి. సహజ, సరళ శైలిలో రాయడంలో దిట్ట. కవిత్వ రచన, విమర్శనం, వ్యాఖ్యానాలు ఆయనకు కరతలామలకాలు. మూడు దశాబ్దాలపాటు తెలుగు భాషోపాధ్యాయుడుగా, తెలుగు ఉపన్యాసకులుగా పనిచేసిన తిరునగరి వేలాదిమంది శిష్యులకు వందనీయులు, ఆరాధ్యులు. తెలుగు, సంస్కృతం, ఆంగ్ల త్రి భాషల్లో పట్టు సాధించి, ప్రాచ్య, పాశ్చాత్య కవిత్వ సిద్ధాంతాలను ఆకళింపు చేసుకుని, గత ఐదు దశాబ్దాల నుంచి నిరంతర సాహిత్య సేవకు అంకితమైన సాహితీవేత్త. ఆయన సాహిత్య వ్యాసాలు వెయ్యికి దాటే వుంటాయి. గొప్ప గేయ రచయిత కూడా. తిరునగరి వందలాది లలిత, దేశభక్తి, ప్రబోధాత్మక గేయాలు రచించారు. వందలకొద్ది సాహిత్య సదస్సులలో, కవి సమ్మేళనాలలో ప్రధానవక్తగా పాల్గొన్నారు. అనితరసాధ్యమైన ప్రసంగాలు చేసారు. హైదరాబాదులోని ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాల నుండి దాదాపు 100 లలిత, దేశభక్తి గీతాలు, కవితలు, ప్రసంగాలు ప్రసారమయ్యాయి. ప్రైవేట్ ఆల్బమ్స్ కు భక్తిగీతాలు, ప్రబోధగీతాలు రాశారు. అయన వరంగల్ వాణి, ఆంధ్రపత్రికకు ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా పనిచేశారు. ఆంగ్లం, హిందీ నుండి కవితలు, వ్యాసాలు అనువాదం చేశారు. తిరునగరి జీవితం - సాహిత్యం అన్న అంశాలపై ఉస్మానియా విశ్వ విద్యాలయం తెలుగుశాఖలో పరిశోధనలు జరిగాయి. పాతికకు పైగా ప్రభుత్వ, ప్రభుత్వేతర పురస్కారాలు ఆయన అందుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా యిచ్చే దాశరథి పురస్కారం-2020 గ్రహీత ఆయన. ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ఆం.ప్ర. ప్రభుత్వ సత్కారం (1975), నల్లగొండ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడుగా సత్కారం (1976,1978), యాదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పండిత సత్కారం (1992), బి.ఎన్.రెడ్డి సాహిత్య పురస్కారం (1994), ఆం.ప్ర. ప్రభుత్వ కళానీరాజన పురస్కారం (1995), ఆం.ప్ర. ప్రభుత్వ విశిష్ట (ఉగాది) పురస్కారం (2001), విశ్వసాహితి' ఉత్తమ పద్యకవి పురస్కారం (2003), భారత్ భాష భూషణ్ (డాక్టరేట్) అఖిల భారత భాషా సాహిత్య సమ్మేళనం భోపాల్, మధ్యప్రదేశ్ (2003), ఆటా (అమెరికా తెలుగు అసోసియేషన్) సత్కారం (2006), ఆం.ప్ర. ప్రభుత్వ అధికార భాషా సంఘం సత్కారం (2006), రాచమళ్ళ లచ్చుమ్మ స్మారక 'మాతృమూర్తి' అవార్డు, నల్గొండ (2008), ప్రతిభా పురస్కారం 2012 - తెలుగు విశ్వవిద్యాలయం, 2014, వేదా చంద్రయ్య తెలంగాణ రాష్ట్ర స్థాయి పురస్కారం (2015), పద్మశ్రీ ఎస్.టి. జ్ఞానానందకవి సాహిత్య పురస్కారం (2016), శ్రీ కృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయం దాశరథి పురస్కారం (2017), గిడుగు తెలుగు భాషా పురస్కారం (2017), సారిపల్లి కొండలరావు, యువకళా వాహిని సాహిత్య పురస్కారం (2019), ఆరాధన సాహిత్య పురస్కారం (2019), అభినందన సినారె సాహిత్య పురస్కారం (2019), డా. దాశరథి వంశీ జీవిత సాఫల్య సాహితీ పురస్కారం (2019), తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ దాశరథి సాహితీ పురస్కారం - 2020, ఆగస్టు 15న ప్రగతి భవన్ లో సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు చేతుల మీదుగా, ఇలా ఎన్నో పురస్కారాలు, సన్మానాలు అందుకున్నారు. ఔద్యోగిక సమయంలో యాదాద్రి జిల్లా ఆలేరులో నివాస మేర్పరచు కున్నారు. ప్రస్తుతం చింతల్(హెచ్ ఎం టి)లోని గణేశ్ నగర్ లో విశ్రాంత జీవితాన్ని గడుపు తుండే వారు. 2021 ఏప్రిల్ 25న ఈ లోకాన్ని వదిలి వెళ్లారు. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

## బహుభాషా కోవిదుడు చక్రపాణి - సెప్టెంబర్ 24... "చందమామ" చక్రపాణి వర్ధంతి




ఆలూరు వెంకట సుబ్బారావు అనే పేరు చాలా మంది విని ఉండక పోవచ్చు. "చక్రపాణి' అనే కలం పేరు కలిగిన వ్యక్తిగా చాలా మందికి తెలియక పోవచ్చు. చందమామ అనగానే వెంటనే గుర్తు వచ్చే పేరు చక్రపాణిదే. పిల్లల నుండి పండు ముదుసలి వరకు చదవడం వచ్చిన ప్రతి ఒక్కరూ చందమామ ఎప్పుడో ఒకప్పుడు చదివే ఉంటారనడం అతిశయోక్తి కాదు. దేశం స్వాతంత్ర్యం పొందడానికి ఒక నెల రోజుల ముందే చక్రపాణి, నాగిరెడ్డితో కలసి1947 జూలై లో పిల్లల కోసం చందమామ కథల పుస్తకం ప్రారంభిం చాడు. అయితే చందమామ స్థాపించాలనే ఆలోచన పూర్తిగా చక్రపాణిదే. సున్నిత హాస్యంతో, విజ్ఞాన, వినోదాత్మకమైన చక్కటి కథల తో ఆబాల గోపాలన్ని అలరించిన చందమామ పత్రికకు 1975లో చక్ర పాణి మరణించే వరకు సంపాదకుడిగా కొనసాగాడు. ఆలూరు వెంకట సుబ్బారావు (కలం పేరు చక్రపాణి) బహుభాషావేత్త, తెలుగు రచయిత, పత్రికా సంపాదకుడు, సినీ నిర్మాత, దర్శకుడు. చందమామ-విజయా కంబైన్స్ నిర్మాణ సంస్థ స్థాపకుల్లో ఒకడు. గుంటూరు జిల్లా తెనాలిలో 1908, ఆగష్టు 5 న గురవయ్య, వెంకమ్మ దంపతులకు జన్మించిన చక్రపాణి జాతీయోద్యమ ప్రభావానికి లోనై ఉన్నత పాఠశాల విద్యకు స్వస్తి చెప్పి, యలమంచిలి వెంకటప్పయ్య వద్ద హిందీ భాషను అభ్యసించి, హిందీ భాషా వ్యాప్తికి ఎనలేని కృషి సాగిస్తున్న వ్రజనందన వర్మ వద్ద హిందీ భాషలో మంచి పాండిత్యాన్ని గడించాడు. 'చక్రపాణి' అనే కలం పేరును ఆయనే ప్రసాదించాడు. చక్రపాణి స్వయం కృషితో సంస్కృతం, ఇంగ్లీషు భాషలలో పరిచయాన్ని పొందాడు. క్షయ వ్యాధిగ్రస్తుడై 1932 లో మదనపల్లె లోని శానిటోరియంలో వైద్యం కోసం అక్కడే కొన్ని నెలలు ఉండి, సాటి రోగి అయిన ఒక పండితుని సాయంతో బెంగాలీ భాష కూడా నేర్చుకొన్నాడు. అలా బెంగాలీ నవలలను తెలుగు లోకి అనువదించడం ప్రారంభించాడు. ముఖ్యంగా శరత్‌బాబు నవలలను ఆయన అనువాదం ఎంత బాగా చేశాడంటే, ఆ పుస్తకాల మూలం బెంగాలీ అంటే నమ్మనంతగా చేశాడు. వాగ్దత్త, సుభద, పల్లీయులు, చంద్రనాథ్, దేవదాస్, పరిణీత, నవ విధాన్, బడాదీది, పతివ్రత, హేమాంగిని, నిష్కృతి, మా వారు, వంటి శరత్ రచనలను తెలుగులో అనువదించారు. తెలుగులో చిన్న చిన్న కథలు, నవలలు కూడా రాశాడు. చక్రపాణి రచయితగా, అనువాదకుడిగా పేరు సంపాదించి సినిమా అవకాశాలు రాగా, 1940 లో ముంబైలోని ఫేమస్ ఫిలింస్ వారి ధర్మపత్ని కోసం ముందుగా మాటలు రాశాడు. 1945లో బి.ఎన్. రెడ్డి, మూలా నారాయణస్వామి కలిసి వాహినీ సంస్థ బ్యానర్ మీద 'స్వర్గసీమ' నిర్మిస్తూ కథ, సంభాషణల రచన కోసం చక్రపాణిని పిలిపించారు. చిత్తూరు నాగయ్య హీరోగా, జయమ్మ నాగయ్య భార్యగా, భానుమతి సుజాతా దేవిగా నటించగా ఘంటసాల గాయకుడుగా వెండితెరకు పరిచయమైన చిత్రం "స్వర్గసీమ" బహుళ జనాదరణ పొందింది. 1949 లో చక్రపాణికి బి.ఎన్.కె ప్రెస్ లో బి.నాగిరెడ్డి తో స్నేహం కలవడం, జీవితాంతం ఆ స్నేహం అనురాగ బంధంగా బలపడటం, ఇద్దరు కలసి విజయా ప్రొడక్షన్స్ స్థాపించి, సినిమాలు తీయాలని నిర్ణయించడం జరిగింది. తొలి ప్రయత్నంగా 'షావుకారు' (1950) చిత్రాన్ని ఎల్.వి. ప్రసాద్ దర్శకత్వంలో నిర్మించింది. ఈ సినిమాకి కథ, సంభాషణలు చక్రపాణి సమకూర్చారు. 1951 లో అఖండ విజయం సాధించిన 'పాతాళ భైరవి' చిత్రాన్ని నిర్మించి, తర్వాత వాహినీ స్టుడియోలో తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషలలో దాదాపు 35 చలన చిత్రాలను రూపొందించారు. విజయా ప్రొడక్షన్స్ క్రింద మాయా బజార్, గుండమ్మ కథ, మిస్సమ్మ, సి.ఐ.డి. అప్పు చేసి పప్పు కూడు లాంటి అజరామరాలైన సినిమాలు తీశారు. "మనం తీసేది జనం చూడ్డం కాదు జనం కోరేది మనం తీయాలి " అనే ధోరణి ఆయనది. 1934-1935 లో కొడవటిగంటి కుటుంబరావుతో కలసి తెనాలిలో యువ మాసపత్రికను మంచి అభిరుచిగల తెలుగు పాఠకుల కోసం ప్రారంభించాడు. ఈ పత్రికను చక్రపాణి 28 సంవత్సరాలు నడపగా కుటుంబరావు దానికి సంపాదకుడుగా వ్యవహరించారు. 1939 లో సి.పుల్లయ్య ధర్మపత్ని సినిమాకు కథ సమకూర్చాడు. శ్రీరాజేశ్వరి విలాస్ కాఫీ క్లబ్ చిత్రానికి కథ చక్రపాణి రాశాడు. ఆ సినిమా విడుదల కాకుండానే సెప్టెంబరు 24, 1975 న చక్రపాణి కన్ను మూశాడు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

## నాటక సినీ ఆధ్యాత్మిక రంగాలలో మమేకమైన ధూళిపాళ సెప్టెంబర్ 24... ధూళిపాళ సీతారామ శాస్త్రి జయంతి



తెలుగు నాటక, సినిమా రంగాల్లో అసమాన ప్రతిభను చూపించిన ధూళిపాళ సీతారామ శాస్త్రి జీవితం, నిజమైన కళాకారునికి ఆదర్శం కావలసిన గ్రంధం వంటిది. ఒకప్పటి రంగస్థలంపై నటనా నాట్యములతో జయధ్వజం ఎగరేసిన ఈ మహనీయుడు, చివరికి జీవితం అనే నటకూటాన్ని వదిలిపెట్టి ఆధ్యాత్మిక మార్గంలోకి అడుగుపెట్టి మానవ సేవకు పరమ ధ్యేయంగా నిలిచారు.

**బాల్యం నుంచే నటనపై ఆసక్తి....** ధూళిపాళ సీతారామ శాస్త్రి జననం 24-9-1921న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమ గోదావరి జిల్లా లో ఒక బ్రాహ్మణ కుటుంబంలో జరిగింది. చిన్ననాటి నుంచే ఆయనకు నాటకాలపై ఆసక్తి ఉండేది. ధూళిపాళ నటనలోని బలమైన వాచకశైలి, హావభావాలు, పాత్ర లోపలికి చొచ్చుకుపోయే తీరు ఆయన్ను ప్రేక్షకుల గుండెల్లో చిరస్థాయిగా నిలిపాయి. ప్రత్యేకించి శకుని పాత్రలో ఆయన ఇచ్చిన జీవం, ప్రేక్షకుల కళ్ళముందు ఆ పాత్రను సజీవంగా మార్చింది. ఎన్.టి.రామారావుతో కలిసి ఎన్నో పౌరాణిక చిత్రాల్లో నటించిన ఆయన నటనకు విమర్శకులు సైతం తలవంచక తప్పలేదు.

**నాటక రంగం నుండి సినిమా వరకు...** ఆయన నాటకాలలో నటించడమే కాకుండా వాటిని రాయడం, దర్శకత్వం వహించడం వంటి విభాగాల్లోనూ చురుకుగా పాల్గొన్నారు. హరికథ, పురాణ కథలు, నాటక రచనలు వంటి అనేక కళారూపాలలో ఆయన సవాళ్లను స్వీకరించారు. నాటక రంగంలో ఆయనకు మంచి పేరు ఉండటంతో, ఆయనను సినిమా రంగంలోకి ఆహ్వానించారు.


**సినీ జీవితం...** ధూళిపాళ సినిమాలలో ఎక్కువగా విలన్ పాత్రలు మరియు పౌరాణిక పాత్రలు పోషించారు. ముఖ్యంగా ఆయన నటించిన 'కార్తవీర్యార్జునుడు', 'భీష్ముడు', 'శకుని', 'జరాసంధుడు', 'నికుంభుడు' వంటి పాత్రలు ఇప్పటికీ ప్రేక్షకుల మనసుల్లో నిలిచి పోయాయి. ఆయన స్వరంలో ఉన్న గంభీరత, సంభాషణల ఉచ్ఛారణలో కనిపించే ఆత్మవిశ్వాసం ఆయన్ను ప్రత్యేకతతో నిలబెట్టాయి.

**ఆధ్యాత్మిక మార్గం వైపు మలుపు...** కళామతల్లికి మూడు దశాబ్దాలపాటు సేవలందించిన అనంతరం ఆయన కళారంగం నుంచి స్వచ్ఛందంగా తప్పుకుని "శ్రీ మారుతి సేవేంద్ర సరస్వతి"గా మారడం, జీవితం మీద ఆయన దృష్టిని తెలియ జేస్తుంది. 2001 మే 7న ఆయన కంచి కామకోటి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి ద్వారా సన్యాస దీక్షను స్వీకరించి శ్రీ మారుతి సేవేంద్ర సరస్వతిగా మారారు. ధనమూ, ఖ్యాతీ త్యజించి సేవా మార్గాన్ని ఎంచుకున్న ఆయన, నిజమైన తపస్విగా మారారు. ధూళిపాళ సీతారామ శాస్త్రి ఏప్రిల్ 13,2007లో మరణించారు. కానీ ఆయన అందించిన కళారూపాలు, నటనలో ఉన్న నాటకీయత తెలుగు సినిమా మరియు నాటక రంగాలలో చిరస్థాయిగా నిలిచి పోయాయి.

**పాఠం నేర్పిన పాత్ర...** ధూళిపాళ జీవితం మనందరికీ ఒక గొప్ప పాఠం. నటుడిగా, సన్యాసిగా - రెండు రంగాల్లో ఆయన చూపిన నిబద్ధత, సమర్పణ అసాధారణమైనవి. ఆత్మగౌరవం నుంచి ఆధ్యాత్మిక సాధన వరకూ ఆయన గమనం స్ఫూర్తిదాయకం.

**ముగింపు కాదు - సందేశం...** ధూళిపాళ జీవితం అంటే ఒక నటుడు నాటకాన్ని మాత్రమే కాదు, జీవితాన్నే ఒక కళగా మార్చగలడనే విషయం మనకు తెలుస్తుంది. ఆయన నాటకాలూ, ఆధ్యాత్మిక సేవలూ ఒకే రకంగా ప్రజల హృదయాలను తాకాయి. ఆయనను తలచుకోవడం అంటే ఒక యుగాన్ని స్మరించడమే. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

## దేశం గర్వించదగ్గ అణు భౌతిక శాస్త్రవేత్త రాజా రామన్న - సెప్టెంబర్ 24... రాజారామన్న వర్ధంతి



రాజారామన్న, (జనవరి 28, 1925) - సెప్టెంబర్ 24, 2004) భారత అణు శాస్త్రవేత్త. భారత దేశం శాస్త్ర, సాంకేతిక రంగాలలో సంచలన విజయాలు సాధించడంలో, అద్భుతమైన ప్రగతిని సాధించడంలో కీలకపాత్ర వహించిన వారిలో డాక్టర్ రాజారామన్న ఒకరు. భారత దేశం అణుబాంబును తయారు చేయడంలో ఆయన కీలకపాత్ర పోషించారు. అణు శాస్త్ర మరియు సాంకేతిక పరిజ్ఞానంలో అభివృద్ధి చెందిన దేశంగా మన దేశానికి గుర్తింపు తేవడంలో రామన్న పాత్ర అద్వితీయం. కర్ణాటకలోని మైసూర్లో 1925 జనవరి 28నాడు జన్మించిన రాజా రామన్న ప్రాథమిక విద్యాభ్యాసం మైసూర్ లోనే చేశారు. తరువాత బెంగళూర్, మద్రాసు నగరాలలో ఉన్నత విద్యాభ్యాసం చేసి లండన్లోని కింగ్స్ కాలేజి నుండి మాలిక్యులర్ ఫిజిక్స్ లో పిహెచ్.డి. చేశారు. 1949లో టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ లో ప్రొఫెసర్ గా రామన్న తన ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. అక్కడ సుప్రసిద్ధ శాస్త్రజ్ఞుడు, డా. హెూమీ జహంగీర్ భాభా సహచర్యం రాజారామన్నను ఎంతగానో ప్రభావితం చేసింది. తారాపూర్ అణు విద్యుత్ కేంద్రం నిర్మాణ బాధ్యతలను డా. హెూమీ భాభా డా.రాజా రామన్నకు అప్పగించారు. వాటిని రామన్న సమర్థవంతంగా నిర్వహించారు. భారత ప్రభుత్వం హెూమీ భాభా మరణం తరువాత అటామిక్ ఎనర్జీ కమీషన్ ఛైర్మన్ గా, అటామిక్ ఎనర్జీ డిపార్ట్ మెంట్ సెక్రటరీగా డా.రాజారామన్నను నియమించింది.1972 నుండి 1978 వరకు, మళ్ళీ 1981 నుండి 1983 వరకు బాబా ఆటమిక్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్‌గా పనిచేశారు. 1978 నుండి 1981 వరకు, రక్షణ మంత్రికి శాస్త్రీయ సలహాదారు పదవిలో ఉన్నారు. ఇందిరా గాంధీ హయాంలో భారత దేశం 1974 మే 18 తేదీన జరిపిన అణు పరీక్ష అప్పట్లో ఒక సంచలనం. దాని వెనక రామన్న కృషి అసమానం. ఇందిరా గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు భారతదేశపు మొట్టమొదటి భూగర్భ అణు పేలుడులో రాజా రామన్న కీలక పాత్ర పోషించారు. అణు పేలుడు పరికరం తయారీకి వెళ్ళే వివిధ విభాగాలలో నైపుణ్యం ఉన్న అనేక బృందాలను ఆయన కలిసి తీసుకు వచ్చారు. రాజస్థాన్ ఎడారిలో పోఖ్రాన్ వద్ద జరిపిన ఈ అణు పరీక్ష ఫలితంగా అమెరికా, యూరోపియన్ దేశాలు ఇండియాపై ఆంక్షలు విధించాయి. ఇండియా పట్ల అణు అంటరాని తనాన్ని పాటించాయి. తాము ఒక పక్క అణ్వస్త్రాలను గుట్టలుగా పేర్చుకుంటూనే ఇండియాలాంటి మూడో ప్రపంచ దేశాలు అణ్వస్త్రాలు సమకూర్చు కోవడానికి వీలు లేదని శాసించాయి. భారత దేశ మొట్ట మొదటి అణు బాంబు నిర్మాణం దేశంలో కూడా రహస్యంగానే సాగింది. బాంబు రూపకల్పన, నిర్మాణం, పరీక్షలలో పాల్గొన్న 75 మంది శాస్త్రవేత్తలకు (బార్క్ అధిపతి రాజా రామన్న నాయకుడు) తప్ప భారత మంత్రులకు ఎవరికీ బాంబు నిర్మాణం అవుతున్న సంగతి తెలియదు. శాస్త్రవేత్తలు కాకుండా భారత ప్రధాని ఇందిరాగాంధి, ఆమె సలహాదారు మరియు అప్పటి మాజీ ప్రిన్సిపల్ కార్యదర్శి పి.ఎన్.హక్సర్, అప్పటి ప్రిన్సిపల్ కార్యదర్శి డి.పి.ధర్ లకు తప్ప రక్షణ మంత్రికి కూడా బాంబు సంగతి తెలియదు. 1972 సెప్టెంబరు లో బార్క్ సందర్శించిన ఇందిర నోటిమాటతో బాంబు నిర్మాణానికి, పరీక్షకు ఆదేశాలు ఇచ్చారని భావించ బడింది. 1997లో డాక్టర్ రాజా రామన్న స్వయంగా పోఖ్రాన్ లో పేల్చింది అణు బాంబే అని చెప్పేవరకూ అధికారికంగా దాని గురించి తెలియక పోవడం గమనార్హం. 1989 టాటాల ప్రోత్సాహం, ఫ్రాన్స్ నుండి ఆర్థిక సహకారం అందడం వలన డా. రాజారామన్న బెంగుళూర్ లో పరిశోధన సంస్థను స్థాపించారు. రామన్న చేసిన అసమాన కృషికి గుర్తింపుగా పద్మశ్రీ (1968), పద్మభూషణ్ (1973), పద్మ విభూషణ్ (1975) అవార్డులు రామన్నను వరించాయి. 2004, సెప్టెంబర్ 24 న మరణించారు. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# తగ్గిన పన్నుభారం


సిరిసిల్ల: జిల్లాలో వస్త్రోత్పత్తులను ఆధారం చేసుకొని జీవిస్తున్న నేత కుటుంబాలకు వస్తు సేవల పన్ను (జీఎస్టీ) 2.0తో భారం తగ్గింది. వస్త్ర పరిశ్రమలో ముఖ్యంగా కాటన్, పాలిస్టర్ రెండు రకాల నూలును ఉపయోగించి వస్త్రాలు నేస్తారు. అందులో కాటన్‌పై 5 శాతం జీఎస్టీలో మార్పులేదు. పాలిస్టర్ నూలుపైనే 12 నుంచి 5 శాతానికి తగ్గించారు. సోమవారం నుంచి ఇది అమలులోకి వస్తుంది. ఆటుపోట్లను ఎదుర్కొంటున్న వస్త్ర పరిశ్రమలో పన్ను తగ్గింపు కొంత ఊరటనిచ్చే అంశమని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. కాగా కాటన్ నూలు, చేనేత వస్త్రాలపై జీఎస్టీ ఎత్తివేయాలని చేనేత పారిశ్రామిక సహకార సంఘాలు కోరుతున్నా ఫలితం లేకపోవడం వారిని నిరాశకు గురిచేసింది.

**జీఎస్టీ ఇలా..**

జిల్లాలో 35 వేలకు పైగా మరమగ్గాలు ఉన్నాయి. వీటిలో 20 శాతం మగ్గాలపై కాటన్ ఉత్పత్తులు కాగా మిగతావాటిపై పాలిస్టర్ వస్త్రం ఉత్పత్తి జరుగుతోంది. ఈ రంగంలో ప్రత్యక్షంగా పరోక్షంగా 15 వేల మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారు. డెకరేషన్ వస్త్రం, హల్దీ వేడుకలకు ఏకరూప దుస్తులు, జెండాలు, ప్రభుత్వ ఆర్డర్లలో విద్యార్థుల ఏకరూప దుస్తులు, చీరల వంటి పలురకాల వస్త్రాలకు జిల్లాలో ఉత్పత్తి అవుతాయి. వీటన్నింటిలోనూ సింహభాగం పాలిస్టర్ నూలు వాడకమే ఎక్కువ. దీనిలో పాలిస్టర్ నూలు కొనుగోలుపై 12 శాతం ఉన్న జీఎస్టీని 5కు తగ్గించారు. ఉత్పత్తి అయిన వస్త్రం అమ్మకంపైన 5 శాతం జీఎస్టీ అలాగే ఉంది.

20 వేల టన్నుల వినియోగం

జిల్లా వస్త్రపరిశ్రమలో ప్రభుత్వ, ప్రైవేటు ఉత్పత్తుల్లో అత్యధికంగా పాలిస్టర్ నూలు, తర్వాతి స్థానంలో కాటన్ వినియోగం ఉంటుంది. పాలిస్టర్ 20 వేల టన్నులు, కాటన్ 10 వేల టన్నులు ఉపయోగిస్తారు. రాష్ట్రంలో పాలిస్టర్ నూలు తయారీ పరిశ్రమలు లేవు. ముడి నూలు పూర్తిగా మహారాష్ట్ర, గుజరాత్‌ల నుంచి దిగుమతి అవుతుంది. దీనికి



రవాణా ఛార్జీలు కిలోకు రూ.5-7 అదనపు ఖర్చవుతోంది. జీఎస్టీ తగ్గుదలతో పరిశ్రమకు ఉపకరిస్తుంది.

జిల్లాలో నూలు కొనుగోలు, వస్త్రోత్పత్తులపై ఏటా సుమారు రూ.100 కోట్ల మేరకు వ్యాపారం జరుగుతుంది. గతంలో 12శాతం జీఎస్టీ చెల్లించి ముందు నూలు కొనుగోలు చేసి వస్త్రం ఉత్పత్తి పూర్తయి, విక్రయించే సమయంలో 5శాతం పన్ను ఉండేది. ప్రస్తుతం నూలు కొనుగోలు, విక్రయం రెండూ 5 శాతమే ఉన్నాయి. దీంతో ముడి సరకు కొనుగోలు నుంచి విక్రయాల వరకు జీఎస్టీ క్లియర్‌గా ఉంటుంది. గతంలో మాదిరిగా 7శాతం బ్యాలెన్స్ ఉండదు.

జీఎస్టీ తగ్గింపు వస్త్రోత్పత్తిదారులపై ఆర్థిక భారంలేకుండా చేస్తుంది. ముడిసరకు అయిన నూలు కొనుగోలు సులభమవుతుంది. ఉత్పత్తులను పెంచుకునేందుకు వీలుగా ఉంటుంది. ఒడుదొడుకులను ఎదుర్కొంటున్న పరిశ్రమను నిలదొక్కుకునేలా చేస్తుంది. జిల్లాలో పాలిస్టర్ వస్త్రోత్పత్తులపై రంగంలో ఆధారపడిన అన్ని వర్గాలకు ఊరటనిస్తుంది. అంతేకాదు.. మరిన్ని మేలురకాల ఉత్పత్తులను పెంచుకునే అవకాశం.. పరిశ్రమ విస్తరణకు దోహదపడుతుంది.

# సాగుకు లేదు బెంగ

బోయినపల్లి: రాజరాజేశ్వర జలాశయం (మధ్యమానేరు) జలకళ సంతరించుకుంది. ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి జలాశయం నీటితోపాటు మానేరు, మూలవాగు నుంచి వచ్చిన వరద నీటితో పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేశారు. ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో కొనసాగుతుండటంతో నీటిని దిగువకు, ఇతర ప్రాజెక్టులకు తరలిస్తున్నారు.

**యాసంగి పంటలకు భరోసా**

బోయినపల్లి మండలం మాన్వాడ వద్ద నిర్మించిన మధ్యమానేరు జలాశయానికి మానేరు, మూలవాగులతో ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి జలాశయం నుంచి వరద కాలువ ద్వారా వచ్చే నీరు ఆధారం. ఇక్కడి నుంచి దిగువమానేరు జలాశయం, అన్నపూర్ణ, మల్లపేట రిజర్వాయర్, కుడి, ఎడమ కాలువలు, రాజరాజేశ్వర స్వామి దేవస్థానం గుడి చెరువు, మిషన్ భగీరథకు నీరు వెళ్తోంది. జలాశయంలో నీటి నిల్వ తక్కువ ఉండటం, వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో జలాశయం కుడి కాలువ, దిగువన వరి నాట్లు వానాకాలంలో ఆలస్యమయ్యాయి. కాగా ఎగువన కురిసిన వర్షాలకు ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి జలాశయంతో పాటు ఎగువమానేరు, మూలవాగు నుంచి జలాశయంలోకి భారీగా నీరు వచ్చి చేరడంతో పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేయడంతోపాటు దిగువన ఎల్ఎండీ జలాశయంతోపాటు ఇతర ప్రాజెక్టులకు నీటిని విడుదల చేశారు. జలాశయం జలకళను సంతరించుకోవడంతో



వానాకాలంతోపాటు యాసంగి పంటలకు రైతులకు భరోసా వచ్చింది. వానాకాలంలో కుడి కాలువ కింద సుమారు 57వేల ఎకరాలు, ఎడమ కాలువ కింద 2 వేల ఎకరాల పంటలు సాగవుతున్నాయి.

నీటి తరలింపు ఇలా..

జలాశయానికి 1 జూన్ 2025 నుంచి శుక్రవారం నాటికి ఎస్సారెస్పీ ద్వారా 34.194 టీఎంసీలు, ఎల్లంపల్లి నుంచి 6.768, ఎగువమానేరు, మూలవాగు నుంచి 19.291 టీఎంసీలు నీరు చేరింది. ఎల్ఎండీ జలాశయానికి 16.049 టీఎంసీలు, అన్నపూర్ణ జలాశయానికి 22.393, మల్లపేట రిజర్వాయర్‌కు 0.517, మిషన్ భగీరథకు 1.222 టీఎంసీల నీటిని తరలించారు.

జలాశయం పూర్తి సామర్థ్యం 27.55 టీఎంసీలు కాగా ప్రస్తుతం 27.171 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గతేడాది ఇదే సమయంలో 25.22 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ప్రస్తుతం జలాశయానికి ఎస్సారెస్పీ నుంచి 4700 క్యూసెక్కులు, మానేరు, మూలవాగు నుంచి 4800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ఇదే సమయంలో ఎల్ఎండీ జలాశయానికి 5500 క్యూసెక్కులు, అన్నపూర్ణ జలాశయానికి 3,200 క్యూసెక్కులు, మల్లపేట రిజర్వాయర్‌కు 561 క్యూసెక్కుల నీరు తరలిస్తున్నారు.

# సౌర కాంతులకు 'ప్రోత్సాహకం'



కరీంనగర్ : పర్యావరణ పరిరక్షణ, సహజ వనరుల వినియోగం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం సౌర విద్యుత్తును ప్రోత్సహిస్తోంది.. ఇందులో భాగంగా ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన అందుబాటులోకి తెచ్చింది. ఇప్పటికే ఈ పథకం ద్వారా గృహాలపై సౌరఫలకలు ఏర్పాటు చేసుకొనే వారికి రాయితీ కల్పిస్తున్న కేంద్రం గ్రామాల్లో పూర్తి స్థాయిలో సౌరకాంతులు విస్తరింప చేయాలనే లక్ష్యంతో జిల్లాల వారీగా మోడల్ సోలార్ గ్రామాలను ఎంపిక చేస్తోంది. సోలార్ వినియోగంలో మొదటి స్థానంలో నిలిచిన గ్రామానికి రూ.కోటి ప్రోత్సాహకం ఇవ్వనుంది. ఈ పథకానికి అయిదు వేలకు పైగా జనాభా ఉన్న గ్రామాలను మాత్రమే పరిగణనలోకి తీసుకుని ఉమ్మడి జిల్లాలో 96 గ్రామాలను ఎంపిక చేశారు. ఎంపిక చేసిన గ్రామాల్లో నివాస గృహాలు, గ్రామ పంచాయతీలు, వ్యవసాయ పంపుసెట్లు ఇలా ప్రతి దానికి సౌర విద్యుత్తును ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది.

ఎక్కువ సౌర విద్యుత్ ఉత్పత్తి అయ్యే గ్రామానికి కేంద్రం రూ.కోటి ప్రోత్సాహకం అందజేస్తుంది. ప్రతి జిల్లా నుంచి ఒక్కో గ్రామాన్ని పరిగణనలోకి తీసుకుంటారు.

ఎంపిక చేసిన గ్రామాల్లో సౌర విద్యుత్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గ్రామ కార్యదర్శులతో వాట్సప్ గ్రూప్‌లు ఏర్పాటు చేసి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. మహిళా సంఘాలను కూడా ఇందులో భాగస్వామ్యం చేశారు. ఈ ఏడాది జూన్‌లో దీనిని అందుబాటులోకి తేగా ఆరు నెలలు గడువుగా నిర్ణయించారు.

**ఆసక్తి చూపుతారా?**

రాష్ట్ర ప్రభుత్వం 200ల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తును అందిస్తుంది. గ్రామాల్లో చాలావరకు 200ల యూనిట్లకు లోపే విద్యుత్ వినియోగం ఉంటుంది. దీంతో కరెంట్ బిల్లులు చెల్లించనవసరం ఉండదు. అలాంటప్పుడు ఎంత మంది సౌర విద్యుత్ వైపు మొగ్గు చూపుతారనే విషయంలో సందిగ్ధం నెలకొంది. 3 కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తికి సంబంధించి సోలార్ ఫలకలు ఏర్పాటు చేసుకోవాలంటే సుమారు రూ.లక్షకు పైగా ఖర్చవుతుందని అంటున్నారు. దీంతో ఎంతమంది సౌరశక్తి వైపు మొగ్గు చూపుతారో తెలియని పరిస్థితి.

**డీఎల్‌సీ కమిటీ ఆధ్వర్యంలో..**

జిల్లా పాలనాధికారి ఛైర్మన్‌గా జడ్పీ సీఈవో, డీపీవో, డీఆర్‌డీవో, ఎస్‌ఈ (విద్యుత్), ఎల్‌డీఎం సభ్యులుగా డీఎం (రెడ్కో) కన్వీనర్‌గా గల కమిటీ ఈ గ్రామాలను ఎంపిక చేసింది. ఎంపికైన గ్రామాల్లో రూ.కోటి ద్వారా చేపట్టే అభివృద్ధి పనులను కూడా ఈ కమిటీయే పర్యవేక్షిస్తుంది.

అవగాహన కల్పిస్తున్నాం

సౌర విద్యుత్‌పై అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ ఎంపిక చేసిన గ్రామాల్లో ప్రజలకు విస్తృతంగా అవగాహన పెంచే కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రజల నుంచి స్పందన బాగానే ఉంది. భవిష్యత్తులో సోలార్ విద్యుత్ వినియోగం మరింత పెరుగుతుంది.

– మునిందర్‌రెడ్డి, జిల్లా మేనేజర్, రెడ్కో

# బల్దియా వాహనాలకు బాధ్యులెవరు?




కరీంనగర్ : కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణతోపాటు ఇంజినీరింగ్ విభాగం, హరితహారం కార్యక్రమాలకు వాహనాలు వినియోగిస్తున్నారు. రోజూ ఉదయం చెత్త సేకరణకు వాహనాలన్నీ రోడ్ల మీద తిరాల్సిందే. వీటికి తప్పనిసరిగా ఫిట్‌నెస్ సక్రమంగా ఉండాలి. మరమ్మతులు ఉంటే ఎప్పటికప్పుడు చేసి ఇబ్బందుల లేకుండా చూడాలి. అయితే ఈ వాహనాలకు బీమా సదుపాయం లేకపోవడం గమనార్హం.

**మొరాయిస్తున్న ట్రాక్టర్లు**

నగరవ్యాప్తంగా తిరుగుతున్న ట్రాక్టర్లను 2005-06లో కొన్నారు. తర్వాత మరిన్ని తీసుకోగా వాటిని శానిటేషన్ పనులకు ఉపయోగిస్తున్నారు.

20 ఏళ్లు దాటినా.. కొత్త ట్రాక్టర్లు కొంటామని అధికారులు మాటలు చెబుతున్నా.. ఆచరణకు నోచుకోవడంలేదని కార్మికులు వాపోతున్నారు. ఇంజిన్లు, టైర్లు, బ్యాటరీలు తదితర పరికరాలు పాడైతే తాత్కాలికంగా మరమ్మతులు చేస్తున్నారు. కొంతకాలంగా ఇవి కూడా నిలిపివేశారు. ఏ వాహనం ఎక్కడ ఆగిపోతుందో తెలియడంలేదని పారిశుద్ధ్య కార్మికులంటున్నారు. బేలర్లకు తాళ్లను కట్టుకొని నెట్టుకు రావాల్సి వస్తోంది.

పెండింగ్‌లో కొటేషన్ దస్త్రం

పారిశుద్ధ్య వాహనాలకు బీమా చేయడం లేదు. ప్రమాదాల సమయంలో ఔట్‌సోర్సింగ్ డ్రైవర్లు బాధ్యత వహించాల్సి వస్తోంది.

పెద్ద ప్రమాదాలు జరిగితే డ్రైవర్ నుంచి కమిషనర్ వరకు కేసులు నమోదవుతాయి.

గతేడాది నామమాత్రపు కొటేషన్‌తో బీమా చేయించారు. ఈ ఏడాది కొటేషన్లు పిలవగా, ఆమోదించే సమయంలో ఫిర్యాదు రావడంతో టెండర్ పిలవాలని కమిషనర్ ఆదేశించారు.

దస్త్రం సిద్ధం చేయగా ఇంజినీరింగ్ అధికారులు దానిని పెండింగ్‌లో పెట్టారు.

**వాహనాల లెక్క ఇలా...**

ట్రాక్టర్లు 47, స్వచ్ఛ ఆటోలు 21, స్వీపింగ్ మిషన్లు 5, ఫాగింగ్ మిషన్లు 4, డీఆర్‌ఎఫ్ వాహనాలు 3, కంపాక్టర్స్ 2, డంపర్‌ప్లేసర్లు, జేసీబీ, డోజర్, ఎక్సావేటర్, జెట్టింగ్ మిషన్, డీసిల్టింగ్ మిషన్, స్టాటిక్ కంపాక్టర్, బుల్డోజర్ ఒక్కోటి ఉన్నాయి.

త్వరలోనే పూర్తయ్యేలా చర్యలు

బల్దియా వాహనాలకు గతేడాది వరకు బీమా చేయించాం. ఈసారి బీమా సదుపాయాన్ని త్వరలోనే కల్పిస్తాం. ప్రస్తుతం టెండర్ దశలో ఉంది.

– ప్రఫుల్ దేశాయ్, కమిషనర్, బల్దియా

# పనులు ఆపేసి.. ప్రమాదాలకు వదిలేసి..

కోరుట్ల: రోజురోజుకూ విస్తరిస్తున్న కోరుట్ల పట్టణంలో మౌలిక వసతులు సమకూరడం లేదు. సుమారు లక్ష జనాభా ఉండగా ఇందుకు సరిపడా రహదారులను, కూడళ్లను అభివృద్ధి చేయడంలో అధికారులు విఫలమవుతున్నారు. పట్టణ సుందరీకరణ కోసం 2018-19లో ప్రభుత్వం టీయూఎఫ్ఐడీసీ(తెలంగాణ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ) కింద రూ.50 కోట్లు కేటాయించింది. రెండు విడతల్లో చేపట్టాల్సిన పనులను ముందుగానే గుర్తించారు. ఇందులో భాగంగా పట్టణంలోని జాతీయ రహదారిని విస్తరించారు.

**అక్కడ మూడేళ్ల కిందటే పూర్తి**

ప్రధాన రహదారిపై వాహనాల రద్దీ నియంత్రణకు, ప్రజల రాకపోకలు సులువుగా ఉండేందుకు నాలుగు చోట్ల కూడళ్లను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. మొదటి విడతలో నందిచౌక్, బస్టాండ్ సర్కిల్, ఐబీ అతిథిగృహాల వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్, హైమాస్ట్ లైట్లు ఏర్పాటుకు రూ.కోటి కేటాయించారు. రెండో విడతలో రూ.10 లక్షలతో శ్రీ వేంకటేశ్వర ఆలయ సర్కిల్‌లో కూడలి నిర్మాణం, మినీ హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. నాలుగు చోట్ల కూడళ్ల అభివృద్ధికి నమూనాలు రూపొందించి ప్రణాళికలు సిద్ధం చేశారు. పనులను వెంటనే ప్రారంభించకుండా ఏళ్ల తరబడి జాప్యం చేస్తూ వచ్చారు.

2023 చివరలో కాంగ్రెస్ ప్రభుత్వం రాగా గతంలో మంజూరు చేసిన టీయూఎఫ్ఐడీసీ పనులను నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసింది. నియోజకవర్గంలోని కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల్లో కూడళ్ల సుందరీకరణ పనులు ఒకేసారి ప్రారంభించగా మెట్‌పల్లిలో శాస్త్రీచౌక్, ఆర్టీసీ బస్సు డిపో సర్కిల్లలో మూడేళ్ల కిందటే పూర్తయ్యాయి. కోరుట్లలో మాత్రం



నిర్లక్ష్యంగా వదిలేశారు.

రెండోసారి కేటాయించినా..టీయూఎఫ్ఐడీసీ నిధులను ప్రభుత్వం అర్ధంతరంగా నిలిపివేయడంతో కొత్త బస్టాండ్ సర్కిల్‌ను విస్తరించి సుందరీకరణ చేసేందుకు ఆరు నెలల క్రితం పురపాలక సంఘం 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.18 లక్షలు కేటాయించింది. ఈ నిధులు కేవలం కూడలి అభివృద్ధికే సరిపోతాయని, అంబేడ్కర్ నూతన విగ్రహం ఏర్పాటుకు మరిన్ని నిధులు అవసరమవుతాయని పనులు ప్రారంభించకుండా జాప్యం చేస్తున్నారు. అంబేడ్కర్ విగ్రహం రహదారికి ఒకవైపు ఉండటంతో ఆ మార్గంలో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. బస్టాండ్ నుంచి బస్సులు బయటకు వెళ్లే ప్రదేశంలో దారి ఇరుగ్గా మారి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

సరిపడా నిధులు లేకనే ఆలస్యం

గతంలో కూడళ్ల అభివృద్ధికి టీయూఎఫ్ఐడీసీ నిధులు మంజూరైనా ప్రభుత్వ ఆదేశాలతో పాత పనులను నిలిపివేశాం. బస్టాండ్ సర్కిల్‌లో కూడలి విస్తరణకు నిధులు కేటాయించాం. సరిపోయే పరిస్థితి లేక పనులు ఆలస్యమవుతున్నాయి. –సురేశ్, మున్సిపల్ డీఈఈ

## ఇసుకాసురుల జోరుతో తారుమారు

మణుగూరు : గ్రామాలకు వేసిన రహదారులు 20 టన్నుల బరువును మాత్రమే మోయగలవు. అంతకంటే ఎక్కువ బరువు కలిగిన వాహనాలకు నిబంధనల ప్రకారం అనుమతులు లేవు. మణుగూరులోని కమలాపురం–చినరావిగూడెం గ్రామాలకు వేసిన రహదారి కూడా ఇదే నిబంధన పరిధిలోకి వస్తుంది. ఇక్కడి గోదావరిలో ఇసుక దందా నిర్వాహకులు ప్రైవేటు స్థలాలు తీసుకొని ఇసుకను తోలుకోవాల్సిన వారు ఏకంగా ఈ రహదారిని వాడుకున్నారు. రెండు గ్రామాల ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే లారీలను నడుపుతున్నారు. ఫలితంగా తారురోడ్డు గుంతలు పడి శిథిలావస్థకు చేరింది. లారీల కారణంగా దుమ్ము బారిన పడుతూ ప్రజలు ఇబ్బందులకు గురవుతు



న్నారు.గ్రామస్థులు ఇసుక లారీలను నిలుపుదల చేయడంతో ఇసుక నిర్వాహకులు పోలీసులను ఆశ్రయించారు. మరో 15 రోజుల పాటు నడుపుకొనేందుకు పోలీసుల సమక్షంలో అంగీకారం జరిగిందనే చర్చ కొనసాగుతోంది. ఈ సమస్యపై పోలీసులు ఎందుకు మధ్యవర్తిత్వం వహిస్తున్నారనే అంశంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**ఇవీ సమస్యలు..**

లారీల కారణంగా రెండు గ్రామాలకు రాకపోకలతో పాటు విద్యార్థుల చదువులకు ఆటంకం కలుగుతోంది. ఆర్అండ్‌బీ, ఆర్టీఓ అధికారులు పర్యవేక్షించడం లేదు. మూడు నెలల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎనిమిది ప్రమాదాలు జరిగాయి. నలుగురు గాయపడ్డారు. రహదారి పక్కన ఉన్న విద్యుత్తు స్తంభం విరిగింది. డ్రైవర్లు మద్యం మత్తులో గ్రామాల్లో దుందుడుకుగా వాహనాలు నడుపుతున్నారు. స్థానిక అధికారులు స్పందించకపోవడంతో కలెక్టర్‌ను కలిసేందుకు గ్రామస్థులు సమావేశాలను ఏర్పాటు చేసుకుంటున్నారు.మణుగూరు నుంచి చినరావిగూడెం వరకు ఆర్అండ్‌బీ పరిధిలో ఉంది. లారీలు అధిక బరువు ఉండటం మూలంగానే రహదారి ధ్వంసమైంది. ఉన్నతాధికారులతో పాటు ఆర్టీఓ శాఖకు లేఖ రాస్తాను. శ్రావణ్‌కుమార్, ఆర్అండ్‌బీ ఏఈ, మణుగూరు

# పశువైద్యం.. దయనీయం!

మణుగూరు : జిల్లాలో వైద్యులు, సిబ్బంది, ఔషధాల కొరతతో పశు వైద్యశాలలు వెలవెలబోతున్నాయి. ఏళ్ల క్రితం నిర్మించిన భవనాలు శిథిలావస్థకు చేరాయి. వెరసి పశువైద్యం గాలిలో దీపంగా మారింది. జిల్లాలో పడకేసిన పశువైద్యంపై కథనం.జిల్లాలో ఏరియా పశువైద్యశాలలు, జిల్లా పశువైద్యశాలలు, 47 పశు వైద్యశాలలు, 90 పశువైద్య ఉపకేంద్రాలు ఉన్నాయి. వీటిలో పశు వైద్యశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టు ఒకటి ఖాళీగా దర్శనమిస్తోంది. వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు 10, వెటర్నరీ లైవ్‌స్టాక్ అధికారి 4, లైవ్‌స్టాక్ అసిస్టెంట్ 6, జూనియర్ వెటర్నరీ అధికారి 2, వెటర్నరీ అసిస్టెంట్ 10 ఖాళీలు ఉన్నాయి. ఆఫీస్ సబార్డినేట్స్ 65 ఖాళీలు దర్శనమిస్తున్నాయి. అన్ని విభాగాల్లో మొత్తమ్మీద 341 మంది అధికారులు, సిబ్బంది అవసరమవగా ప్రస్తుతం 238 మంది ఉన్నారు. పలుచోట్ల క్షేత్రస్థాయిలో వైద్యమందక పశువులు చనిపోతున్నాయి. పశుపోషకులు, పాడి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వర్షాకాలంలో పశువులకు సీజనల్ వ్యాధులు సంక్రమిస్తాయి. ఏడాదికి పైగా జిల్లాలో మందుల కొరత వేధిస్తే.. పది రోజుల క్రితం ఔషధాలను పంపిణీ చేశారు. మూగజీవాలను పాములు కాటేస్తే ఏ పశు వైద్యశాలలోనూ విరుగుడు సూదులు అందుబాటులో లేవు. జిల్లాలో 8.50 లక్షల జీవాలకు గతంలో నట్టల నివారణ మందులను ప్రభుత్వం



పంపిణీ చేస్తే.. సిబ్బంది ఊరూరా తిరిగి ఏడాదికి మూడు, నాలుగుసార్లు ఉచితంగా వేసేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని గొర్రెలు, మేకల పెంపకందారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక లీటరు నట్టల నివారణ మందును సుమారు 100 నుంచి 120 జీవాలకు అందిస్తారు. ఈ మందు బయట మార్కెట్‌లో రూ.500 వరకు ధర పలుకుతోంది. ఏడాదికి రూ.కోటికి పైగా ఖర్చవుతోంది. చేసేదేమీ లేక ప్రైవేటు దుకాణాల్లో ఔషధం కొంటున్నారు.

జిల్లాలో పశువులు (తెల్లవి, నల్లవి): 5,16,220

జీవాలు (గొర్రెలు, మేకలు): 8,57,331

పశువైద్యశాలల్లో మెరుగైన వైద్య సేవలందించేందుకు కృషి చేస్తున్నాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైతే శిథిలావస్థ భవనాల స్థానంలో కొత్తవి నిర్మిస్తాం. పశు వైద్యాధికారులు, సిబ్బంది ఖాళీలను ప్రభుత్వం భర్తీ చేస్తే సమస్య పరిష్కారమవుతుంది.బి.పురంధర్, జిల్లా పశు వైద్యాధికారి

### రూ. 4 కోట్ల భవనం.. నిష్ఫలమేనా..?

చింతకాని : గ్రామీణ ప్రాంతంలోని క్రీడాకారుల్లో నైపుణ్యం పెంపొందించేందుకు.. పలు క్రీడాంశాల్లో వారికి తర్ఫీదు ఇచ్చేందుకు 2013లో చింతకాని మండలం లచ్చగూడెంలో సుమారు రూ.4 కోట్లు వెచ్చించి అప్పట్లో ఇండోర్ స్టేడియం నిర్మాణం చేపట్టారు. ఈ భారీ భవనంలో బాల్‌బ్యాడ్మింటన్, క్యారమ్స్, చెస్, స్టోర్, కోచ్‌లకు ప్రత్యేక గది, జిమ్నాస్టిక్స్‌కు మల్టీపర్పస్ గది, పురుషులు, స్త్రీలు, దివ్యాంగులు డ్రెస్ మార్చుకునేందుకు.. ఇలా అనేక ప్రత్యేక గదులు సైతం ఏర్పాటు చేశారు.సాంకింగ్ కాంప్లెక్స్, డైనింగ్ హాలుకు ప్రత్యేక భవనాలు, ఆవరణలో క్రీడా సామగ్రిని సైతం ఏర్పాటు చేశారు. కానీ నాటి నుంచి నేటి వరకూ ఈ ఇండోర్ స్టేడియాన్ని వినియోగంలోకి తీసుకురాకపోవడంతో నిర్మించి నిష్ఫలంగా మారింది. ఈ స్టేడియాన్ని వినియోగంలోకి తెచ్చేందుకు గత కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సైతం పరిశీలించారు. ఈ ఇండోర్ స్టేడియాన్ని వినియోగంలోకి తెస్తే క్రీడాకారులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలో లచ్చగూడెం ఇండోర్ స్టేడియంను వినియోగంలోకి తెస్తామని డీవైఎస్ఓ సునీల్‌రెడ్డి తెలిపారు.

# వణికిస్తున్న డెంగీ.. మలేరియా

కొత్తగూడెం: జిల్లాలో డెంగీ, మలేరియా కోరలు చాస్తోంది. కేవలం 12రోజుల వ్యవధిలో మలేరియా పాజిటివ్ కేసులు 43, డెంగీ కేసులు 34 నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. ఆగస్టు 19నాటికి మలేరియా 11, డెంగీ 54 కేసులుండగా.. ప్రస్తుతం మలేరియా 54, డెంగీ 88గా నమోదయ్యాయి. గత కొన్ని రోజులుగా వాతావరణంలో వచ్చిన మార్పులు.. ముసురుతో కూడిన వర్షాల కారణంగా అనారోగ్య సమస్యలు అధికమవుతున్నాయి. వైరల్ జ్వరాలు, జలుబులతో పాటు విష జ్వరాలు విజృంభిస్తుండటంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు బాధితులతో కిటకిటలాడుతున్నాయి. ప్రధానంగా ఆళ్లపల్లి మండలంలో డెంగీ కేసులు అధికంగా నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు.

**జులైలో అయిదు.. ఆగస్టుకు 88**

జిల్లాలో నెల వ్యవధిలోనే పరిస్థితులు మారిపోయాయి. ఈ ఏడాది జనవరి నుంచి జులై వరకు డెంగీ కేసులు ఐదు నమోదు కాగా.. ఆగస్టు చివరి నాటికి అవి 88కి చేరాయి. కేవలం ఒక్క నెలలోనే 83 కేసులు నమోదయ్యాయంటే పరిస్థితి తీవ్రత అర్థం చేసుకోవచ్చు. ఇవన్నీ అధికారిక లెక్కలు. ప్రైవేటు ఆసుపత్రుల్లో, ఇతర నగరాల్లో చికిత్స పొందుతున్న జిల్లా వాసులు అనధికారికంగా పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఇవి కాకుండా జలుబు, దగ్గు, తీవ్ర ఒళ్లు నొప్పులు, కళ్లమంట, శ్వాస సంబంధిత వ్యాధి బాధితులు జిల్లా సర్వజనాసుపత్రికి బారులుదీరుతున్నారు. ఇంటో ఒకరు వ్యాధి బారిన పడితే వరుసగా కుటుంబ సభ్యులందరికీ వ్యాపిస్తోంది. గ్రామాల్లో పారిశుద్ధ్య లేమి, నిధుల కొరత, తేమ వాతావరణం కారణంగా సెప్టెంబరులోనూ సమస్య తీవ్రత అధికంగా ఉండే అవకాశముందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**పడకేసిన పారిశుద్ధ్యం**

జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు తోడు.. పల్లెల్లో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా తయారైంది. ఏజెన్సీలో ఇదే సమస్యతో వ్యాధులు ప్రబలుతున్నట్లు అర్థమవుతోంది. పంచాయతీల్లో నిధుల కొరత కారణంగా దోమల నివారణ చర్యలను గాలికొదిలేస్తున్నారు. గిరిజన ప్రాంతాల్లో వైద్య సదుపాయాల కల్పన ఆశించిన స్థాయిలో లేకపోవటం



ప్రతికూలంగా మారింది. జిల్లాలో మలేరియా హైరిస్క్ విభాగం కింద 80గ్రామాలు, డెంగీ హైరిస్క్ విభాగం కింద 162 గ్రామాలు ఉన్నట్లు అధికారులు ప్రకటించడమే ఇందుకు నిదర్శనం.

**స్వీయ సంరక్షణ చర్యలే కీలకం**

వ్యాధులు విజృంభించకుండా స్వీయ జాగ్రత్తలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇంటి పరిసరాల్లో దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్త పడాలి. వర్షాకాలంలో కాచివడపోసిన నీటిని తాగడం ఉత్తమమని, వేడిగా ఉన్నప్పుడే ఆహార పదార్థాలను తీసుకోవాలని, జ్వరం బారిన పడితే వెంటనే వైద్యులను సంప్రదించాలని అధికారులు సూచిస్తున్నారు.

జిల్లాలో కేసులు
మలేరియా: 54
డెంగీ: 88

'వైద్యశాఖ పరంగా గ్రామాల్లో దోమల నివారణ చర్యలు చేపడుతున్నాం. ప్రతి మంగళ, శుక్రవారాల్లో డ్రై డే నిర్వహిస్తున్నాం. ఇంటింట జ్వర సర్వే నిర్వహించి, పాజిటివ్ కేసులు నమోదైన ప్రాంతాల్లో దోమల మందు పిచికారి చేయిస్తున్నాం.' డా.స్పందన, మలేరియా జిల్లా ప్రోగ్రాం అధికారి, భద్రాద్రి కొత్తగూడెం

# కొత్త ప్రాజెక్టులపైనే తగ్గింపు

హైదరాబాద్: కొన్ని రకాల నిర్మాణ సామగ్రిపై ఈనెల 22 నుంచి జీఎస్టీ తగ్గింపు అమల్లోకి రానుంది. తద్వారా నిర్మాణ వ్యయం తగ్గే అవకాశం ఉంది. ఎంత మేరకు తగ్గుతుందనే దానిపై బిల్డర్లు మదింపు చేస్తున్నారు. ఆ ప్రకారం కొనుగోలుదారులకు బదిలీ చేస్తారా? అంటే బిల్డర్ల నుంచి మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. సిమెంట్, టైల్స్, మార్బుల్స్ వంటి సామగ్రిపై జీఎస్టీ శ్లాబులను మార్చారు. సిమెంట్ సరఫరాదారులు ధరలు తగ్గిస్తే గృహ కొనుగోలుదారులకు ఆ ప్రయోజనాన్ని అందిస్తామని కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా(క్రెడాయ్) తెలిపింది.



2-2.5 శాతం వరకు.. తగ్గింపు కొత్త ప్రాజెక్టులపైనే ఉంటుందని, నిర్మాణంలో ఉన్నవాటిపై కాదనే అభిప్రాయం కొందరు బిల్డర్లు వ్యక్తం చేస్తున్నారు. 'స్టీల్‌పై జీఎస్టీ 18 శాతంలో మార్పు లేదు. సిమెంట్‌పై 28 నుంచి 18 శాతానికి మార్చారు. కొన్నింటిపై ఇప్పుడు 5 శాతం ఉంటే 18 శాతానికి పెంచారు. ఇవన్నీ మదింపు చేశాక జీఎస్టీ రేట్ల సవరణతో నిర్మాణ వ్యయం రెండు నుంచి రెండున్నర శాతం తగ్గే అవకాశం ఉంది. కానీ ఇప్పటికే నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు 60 శాతం వరకు సామగ్రి కొనుగోలు చేసి ఉంటారు. అంతేకాకుండా ముందు కొనుగోలు చేసిన వారి కంటే... తర్వాత కొనుగోలు చేసే వారికి తక్కువ ధరకిస్తే సమస్యలు వస్తాయి. ఈ నేపథ్యంలో పాత ప్రాజెక్టుల్లో ధరలు తగ్గించడం కంటే ప్రొడక్ట్ అప్‌గ్రేడ్ చేసే అవకాశం ఉంది. దీనిపై అధ్యయనం చేసున్నాం. కొత్త ప్రాజెక్టులకు మాత్రం తగ్గింపు వర్తిస్తుంది' అని బంజారాహిల్స్‌లో ఏర్పాటు చేసిన 'నగరం లోపల నగరం- ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్'పై సమావేశంలో ఏఎస్‌బీఎల్ సంస్థ సీఈవో అజితేష్ కొరుపోలు అన్నారు. కేవలం ఆఫీస్ కారిడార్ అనే పరిమితిని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ దాటిందని .. నివాస, వినోద, ఆహార కేంద్రాలతో నగరంలోనే నగరంగా ఎదిగిందని పేర్కొన్నారు.

# నాలా.. ఎన్నాళ్లిలా?



హైదరాబాద్: ఏటా వర్షాల వల్ల నగరంలో లక్షల కుటుంబాలు నష్టపోతున్నాయి. యంత్రాంగం మాత్రం సమస్యకు శాశ్వత పరిష్కారం చూపలేకపోతోంది. ఆచరణ సాధ్యం కాని లక్ష్యాలతో.. నాలాలపై ఉన్న ఆక్రమణలన్నింటినీ తొలగిస్తామంటూ.. నాలా విస్తరణ పనులకు టెండర్లు పిలుస్తోంది. భూసేకరణ చేపట్టలేక.. రెండు, మూడేళ్లకు పనులను ఆపేస్తోంది. వ్యూహాత్మక నాలాల అభివృద్ధి కార్యక్రమం(ఎస్ఎన్‌డీపీ) రెండో దశ పనులే అందుకు నిదర్శనం. ఏడాది కిందట రూ.667కోట్ల అంచనా వ్యయంతో పనులు మొదలవగా.. ఇప్పటి వరకు 10శాతం పురోగతి కూడా లేదు.

రెండోదశ 10 శాతమే.. 2021లోఎస్ఎన్‌డీపీ తెరపైకి తెచ్చారు. మొదటి దశ పనులు 2023 నాటికి 80శాతం పూర్తయ్యాయి. భూసేకరణ జరగక.. మిగిలినవి పూర్తవలేదు. ఏడాది కిందట మొదలైన రెండో దశ పనులు భూసేకరణ సమస్యతో కేవలం 10శాతమే జరిగాయి.

**2020లో..**

జీహెచ్ఎంసీ, రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులు సర్వే చేపట్టి 80శాతం ముంపు పరిష్కారానికి 12వేల ఆక్రమణలను తొలగించాల్సి ఉందని తేల్చారు. బాధితులకు నష్టపరిహారం, రెండు పడక గదులు ఇచ్చి.. ఆక్రమణలను తొలగించాలని అప్పటి సీఎం కేసీఆర్ ఆదేశించారు. స్థానికుల నుంచి వ్యతిరేకత రావడంతో.. కూల్చివేతలు నిలిచాయి.

హడావుడి నిర్ణయంతో..

కిర్లోస్కర్, వోయంట్స్ కమిటీల ప్రతిపాదనల మేరకు ఎస్ఎన్‌డీపీ-2 పనులకు టెండర్లు పిలిచారు. క్షేత్రస్థాయిలో 3మీటర్లు, 5మీటర్లు ఉన్న నాలాను.. ఒకేసారి 21మీటర్లకు విస్తరించాలని ప్రణాళిక ఇవ్వడంతో.. ఇంజినీర్లు చేతులెత్తేశారు. నాలాలపై అపార్ట్‌మెంట్లు, వ్యక్తిగత గృహాలు ఉన్నాయి. కూల్చితేగానీ పనులు జరగవంటూ పక్కకు జరిగారు.

**ఇవిగో ఉదాహరణలు..**

సున్నంచెరువు, కామునిచెరువు, మైసమ్మ చెరువు, పరికి చెరువు, పటేల్ చెరువు తదితర ప్రాంతాల్లోని వరద నాలాల విస్తరణకు ప్రణాళిక రూపొందించినా ముందుకుసాగడం లేదు.

# దళారెందుకు.. దర్జాగా విక్రయించు!



సంగారెడ్డి : అన్నదాతలు పండించిన పత్తిని దళారుల జోక్యం లేకుండా.. వారు నేరుగా విక్రయించి లబ్ధి పొందేందుకు భారత పత్తి సంస్థ(సీసీఐ) కసరత్తు చేస్తోంది. కొనుగోలు కేంద్రాల సంఖ్య పెంచడంతో పాటు 'కపాస్ కిసాన్' యాప్‌ను ప్రయోగాత్మకంగా అమలు చేయనుంది. వచ్చే నెల మొదటి వారంలో పత్తి సేకరణ ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కపాస్ కిసాన్ యాప్‌పై కర్షకులకు అవగాహన కల్పించాల్సిన అవసరముంది.

**గతంలో అక్రమాలు**

ఉమ్మడి మెదక్ జిల్లాలో 4.90 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. అతివృష్టి కారణంగా దిగుబడులపై అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. గతేడాది సిద్దిపేట జిల్లాలో తాత్కాలిక రిజిస్ట్రేషన్(టీఆర్)ల జారీలో భారీగా అవకతవకలు జరిగినట్లు అధికారులు నిర్ధారించారు. విజిలెన్స్ అదికారులు మార్కెటింగ్‌శాఖ అధికారుల పాత్రపై విచారణ జరుపుతున్నారు. సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోనూ సీసీఐ అధికారులు వ్యాపారులతో కుమ్మక్కై రైతులకు నష్టం చేశారనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో అక్రమాలకు అడ్డుకట్ట వేయాలనే ఉద్దేశంతో సీసీఐ కపాస్ కిసాన్ యాప్‌ను రూపొందించింది.

**సంగారెడ్డిలో నాలుగు.. సిద్దిపేటలో ఐదింటిలో..**

సంగారెడ్డి జిల్లాలో నాలుగు కేంద్రాలలో, సిద్దిపేట జిల్లాలో ఐదింటిలో ప్రయోగాత్మకంగా యాప్ వినియోగించి.. పత్తి కొనుగోలు చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. సీసీఐ నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని సంగారెడ్డి జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీ రియాజ్ వెల్లడించారు.

**ఎలా పనిచేస్తుందంటే..**

పత్తి పండించిన రైతులందరూ కపాస్ కిసాన్ యాప్‌ను చరవాణిలో డౌన్‌లోడ్ చేసుకోవాలి.
వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద పంట నమోదు సమయంలో ఇచ్చిన చరవాణి నంబర్ ఆధారంగా ఓటీపీతో లాగిన్ కావాలి.
రైతు పేరు, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా, పట్టా పాసుపుస్తకం నంబరు, పత్తి సాగు చేస్తున్న విస్తీర్ణం తదితర వివరాలు నమోదు చేయాలి.
పంట విస్తీర్ణం తదితర వివరాలన్నీ సీసీఐకి చేరుతాయి. ఫలితంగా రైతు పేరుతో సీసీఐ కొనుగోలు కేంద్రాలకు పంట తీసుకొచ్చే దళారులు, వ్యాపారులను నియంత్రించే అవకాశం ఉంటుంది.
పత్తి అమ్మేయాలనుకున్న రైతులు ఏ కొనుగోలు కేంద్రంలో, ఎప్పుడు విక్రయిస్తారో ముందుగానే స్లాట్ బుకింగ్ చేసుకునే అవకాశం ఉంటుంది.

# శివారులో భూ సేకరణకు శ్రీకారం



మొయినాబాద్: నగర శివారులోని విలువైన ప్రభుత్వ భూములపై సర్కారు దృష్టిపెట్టింది. గత ప్రభుత్వ హయాంలోనే రాజధానికి ఆనుకొని ఉన్న భూముల వివరాలు సేకరించింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం భూసేకరణ ప్రారంభించింది. ఇప్పటికే మొయినాబాద్ పురపాలిక పరిధిలోని ఎన్కేపల్లిలో గోశాల ఏర్పాటుకు 99.14 ఎకరాలను సేకరించిన సర్కారు తాజాగా ఇదే పురపాలిక పరిధిలోని పెద్దమంగళారం రెవెన్యూలో 383.07 ఎకరాలను తమ ఆధీనంలోకి తీసుకొనే పనిలో నిమగ్నమైంది. ఇప్పటికే ఆ భూముల సర్వే, ఇతర వివరాలను సేకరించింది. స్థానికులను ఒప్పించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఈ భూసేకరణ దేనికి అన్నది మాత్రం రహస్యంగా ఉంచింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు చేపట్టినట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

సాగులో ఉన్నది కొంతే..

ఇక్కడ ఎకరం రూ.5 కోట్ల వరకు ధర పలుకుతోంది. అవుటర్ రింగురోడ్డుకు 10 కి.మీ.ల సమీపంలోనే విలువైన సర్కారు భూములుండగా వాటిని తిరిగి తమ ఆధీనంలోకి తీసుకుంటోంది. సుమారు రూ.2వేల కోట్లు విలువ చేసే ఇక్కడి భూముల్లో ఏం ఏర్పాటు చేస్తారన్నది మాత్రం చెప్పడంలేదు. మొయినాబాద్ పురపాలిక పెద్దమంగళారం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు-149లో 155.12ఎకరాలు, సర్వే నంబరు-218లో 227.35 ఎకరాలున్నాయి. ఇందులో 52 ఎకరాలను గతంలోనే ప్రభుత్వం 16మంది పేదలకు ఇచ్చింది. మిగిలిన భూముల్లో అదే గ్రామానికి చెందిన పేదలు అనధికారికంగా పంటలు సాగు చేస్తున్నారు. ఉస్మాన్‌సాగర్‌కు ఎగువనే ఇవి ఉన్నాయి. ఈ ప్రాంతం జీవో నంబరు-111 పరిధిలో ఉంది. కాలుష్యకారక పరిశ్రమల ఏర్పాటుకు అనుమతి లేకపోవడంతో పర్యావరణ హితానికి చెందిన సంస్థలే కొలువుదీరేఅవకాశాలున్నాయని తెలుస్తోంది.

**పరిహారం ప్రకటన..**

పేద రైతులకు ఇచ్చిన 52 ఎకరాలకు తీసుకుని వారికి పరిహారం ఇవ్వనుంది. ఎకరానికి 800 గజాల స్థలం చొప్పున ఇవ్వాలని నిర్ణయించారు. మిగిలినవారికి 300 గజాల చొప్పున పట్టాలివ్వాలనే ప్రతిపాదన తెరపైకి వచ్చింది. వీటిపై రెవెన్యూ అధికారులు ఇటీవలే గ్రామస్థులతో సమావేశమై ప్రభుత్వ ఆలోచనను వివరించారు. వ్యతిరేకత రాకపోవడంతో ప్రక్రియలో వేగం పుంజుకునే అవకాశాలున్నాయి.

మండలం: మొయినాబాద్
రెవెన్యూ గ్రామం: పెద్దమంగళారం
సేకరిస్తున్న భూమి : 383.07 ఎకరాలు
ఎకరం ధర: సుమారు రూ.5కోట్లు

# అర్ధరాత్రి.. ఆకాశానికి చిల్లు!

కొత్తగూడెం: భద్రాద్రి, ఖమ్మం జిల్లాల్లో ఆదివారం అర్ధరాత్రి నుంచి ఉదయం వరకు పలుచోట్ల ఆకాశానికి చిల్లుపడిందా అన్నరీతిలో వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి. వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించాయి. అనేక చోట్ల లోలెవల్ వంతెనలు, రహదారుల పైనుంచి వరద చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పలు కాలనీల్లోకి వాననీరు చేరికతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరో నాలుగు రోజులపాటు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

ములకలపల్లి మండలం పూసుగుడెం పాఠశాల ప్రహరీ గోడ కూలిపోయింది. మండలంలో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మాదారం వద్ద పాములేరు వాగు ఉద్ధృతితో పాల్వంచ-దమ్మపేట రోడ్డు కోతకు గురైంది. ఇల్లెందు పట్టణంలోని చర్చి ఏరియాకు వెళ్లే రహదారిపై వరద నీరు భారీగా చేరడంతో సుమారు 30కుటుంబాలు బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది.

చుంచుపల్లి మండలంలోని ఎన్‌కే నగర్ పంచాయతీ పరిధిలోని ఇళ్ల చుట్టూ వాననీరు చేరింది. విద్యానగర్ వద్ద కొత్తగూడెం-ఖమ్మం ప్రధాన



రహదారిని వరద చుట్టుముట్టడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దమ్మపేటలో భారీ వర్షం నమోదు కావడంతో వరద నీరు రోడ్లపైకి చేరింది. దుకాణ సముదాయాలను చుట్టేసింది.

పాల్వంచలోని శ్రీనివాస కాలనీలోని రహదారిపైకి వర్షపు నీరు చేరి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టు పది గేట్లు ఎత్తి 18వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలారు.

గోదావరి తగ్గుముఖం

భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా తగ్గుముఖం పట్టింది. ఆదివారం రాత్రి 11గంటలకు 47.80 అడుగుల వద్ద ప్రవహించిన గోదావరి 8గంటల వరకు 42.70అడుగులకు తగ్గింది.

కొత్తగూడెంలో (192.4 మి.మీ), ఇల్లెందులో(150.6), చుంచుపలి (147.6), లక్ష్మీదేవిపల్లి(121.2), అశ్వారావుపేట(111.6), అన్నపురెడ్డిపల్లి(105.4) వర్షం కురిసింది. అత్యల్పంగా భద్రాచలం (5 మి.మీ), ఆళ్లపల్లి (16.5), దుమ్ముగూడెం(18.4), బూర్గంపాడు(19.6) నమోదైంది. జిల్లాలోసాధారణ వర్షపాతం 9.6మి.మీ కాగా.. 75.6 మి.మీ కురవటం గమనార్హం. 688శాతం అధికంగా నమోదైంది. కిన్నెరసాని రిజర్వాయర్ గేట్లు 3 ఎత్తి 15 వేల క్యూసెక్కుల వరదనీటిని సోమవారం దిగువకు విడుదల చేశారు. ఎగువన కురిసిన వర్షాలకు నీటిమట్టం 405.70 అడుగులకు చేరింది.

# సారథి.. ఏం తీరిది!

ఖమ్మం: రవాణా శాఖ సేవల్లో పారదర్శకత పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం 'సారథి' వెబ్‌సైట్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబరు 1నుంచి మూడో విడతలో నిజామాబాద్, ఖమ్మం, సూర్యాపేట, వికారాబాద్ జిల్లాల్లోని మొత్తం 10 ఆర్టీఏ కార్యాలయాల్లో సేవలు ప్రారంభించారు. జిల్లాలో ఖమ్మం, వైరా, సత్తుపల్లి ఆర్టీఏ కార్యాలయాల పరిధిలో నూతన సేవలకు సంబంధించి కేవలం ఒకే దరఖాస్తు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంపై అవగాహన, ప్రచారం కొరవడటమే దీని కారణమని స్పష్టంగా అర్థమవుతోంది.

దేశ వ్యాప్తంగా రవాణా శాఖ సేవలను సులభంగా పొందేందుకు వీలుగా కేంద్రం %www.sarathi.parivahan.gov.in% పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ సైట్‌లో నమోదైన సేవలను దేశంలో ఎక్కడినుంచైనా పొందే వెసులుబాటు ఉంటుంది. గతంలో ఓ రాష్ట్రంలోని వాహనాలు, వాహనదారుల సమాచారం మరో రాష్ట్రంలో తెలిసే అవకాశం ఉండదు. నూతన విధానంలో ఎక్కడి సమాచారం పొందొచ్చు. ప్రమాద సమయంలో వ్యక్తులు, వారి పూర్తి వివరాలు, వాహనాల సమాచారం తెలుసుకునేందుకు ఇదెంతో ఉపయోగపడుతుంది.

రాష్ట్రంలో తొలి విడతగా రవాణా శాఖ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో ప్రయోగాత్మకంగా 'సారథి' అమలు చేశారు. రెండో విడతలో 13 ఆర్టీఏ కార్యాలయాలను ఎంపిక చేశారు.



తొలిరోజు వచ్చిన దరఖాస్తులు: 1

**సేవలు ఇలా..!**

వాహనదారులు, దరఖాస్తుదారులు వెబ్‌సైట్ హోం పేజీలోని డైలాగ్ బాక్సులో తెలంగాణ రాష్ట్రం పేరును ఎంపిక చేసుకోవాలి. తర్వాత అందించే అన్ని రకాల సేవలు పేజీలో కన్పిస్తాయి. అవసరమైనదాన్ని ఎంపిక చేసుకొని వివరాలు నమోదు చేసి స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చు. స్లాట్ బుకింగ్ పత్రాలతోపాటు సేవలకు సంబంధించిన ఆధార పత్రాలు రవాణా శాఖ కార్యాలయంలో సమర్పించాలి. అధికారులు పరిశీలించి అప్రూవల్ చేస్తారు. ప్రస్తుతం ఖమ్మం జిల్లాలో లెర్నింగ్, డ్రైవింగ్ లైసెన్సు సేవలు మాత్రమే అందుబాటులోకి వచ్చినట్లు అధికారులు తెలిపారు.

**ప్రచారం నిల్**

గత నెలలో సారథి వెబ్‌సైట్‌పై జిల్లా నుంచి ముగ్గురు ఉద్యోగులకు హైదరాబాద్‌లో శిక్షణ ఇచ్చారు. ఆ తర్వాత పోర్టల్ సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లలేదు. ప్రచార విషయంలో ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని స్థానిక ఆర్టీఏ అధికారులంటున్నారు. గమనించాల్సిన అంశమేమిటంటే జిల్లాలోని ఉద్యోగులు, అధికారులకు సైతం సారథిపై పూర్తిస్థాయి అవగాహన కొరవడింది. ఫలితంగా తొలి రోజు కేవలం ఒకే దరఖాస్తు వచ్చింది. ప్రస్తుతం తెలంగాణ రవాణా శాఖ వెబ్‌సైట్ అందుబాటులో ఉన్న నేపథ్యంలో ఇబ్బందులు తలెత్తడం లేదు. ప్రభుత్వం, అధికారులు నూతన విధానంపై యుద్ధప్రాతిపదికన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

చురకలు



# గంజాయి తాగుతూ.. మత్తులో తూగుతూ

సిరిసిల్ల : ఒకప్పుడు పెద్దపెద్ద నగరాలకే పరిమితమైన గంజాయి దందా ఇప్పుడు పట్టణ, పల్లె ప్రాంతాలకు కూడా విస్తరించింది. సరదాగా మొదలైన గంజాయి అలవాటు వ్యసనంగా మారుతోంది. నిర్మానుష్య ప్రాంతాలను అడ్డాగా మార్చుకొని గంజాయి తాగుతూ మత్తులో తూగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. గంజాయి ఉచ్చులో పడిన యువత వారి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటోంది. గంజాయి వినియోగం.. సరఫరాపై జిల్లా పోలీస్ యంత్రాంగం కఠినంగా వ్యవహరిస్తున్నప్పటికీ కొందరు అక్రమార్కులు ఏదోరకంగా తీసుకొచ్చి యువతను మత్తులోకి దించుతున్నారు.

**శివారు ప్రాంతాలే అడ్డాగా..**

జిల్లాలో ప్రధానంగా యువతను విద్యార్థులను టార్గెట్ చేసుకొని గంజాయి అమ్మకాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. విభిన్న రూపాల్లో గంజాయి సిగరెట్లు, చాక్లెట్లు, తదితర తినుబండారాల్లో గంజాయిని ఉంచి విక్రయిస్తున్న ఘటనలు వెలుగులోకి వచ్చాయి. శివారు ప్రాంతాలు, ఛాయ్ హోటళ్లు తదితర నిర్మానుష్య ప్రదేశాల్లో గంజాయి తాగడానికి అడ్డాలుగా మారుతున్నాయి. గుట్టుచప్పుడు కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వచ్చి విక్రయాలు సాగిస్తున్నారు. కొందరు యువత గంజాయి తాగడమే కాకుండా సులభంగా డబ్బులు సంపాదించాలని విక్రయాలకు పాల్పడుతూ దొరికిన ఘటనలు ఉన్నాయి.

**మరింత నిఘా అవసరం**

గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. గంజాయి, ఇతర మత్తు పదార్థాలను అరికట్టడానికి ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు. పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. మాదక ద్రవ్యాలను నిరోధించడానికి కృషి చేస్తున్నారు. నార్కొటిక్ జాగిలాలతో తనిఖీలు నిర్వహిస్తున్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ మాదిరిగా గంజాయి కిట్ల సాయంతో పరీక్షలు నిర్వహిస్తూ పట్టిబడిన వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. జిల్లాలో ఈ సంవత్సరం ఇప్పటి వరకు 37 గంజాయి కేసుల్లో 95 మందిని అరెస్టు చేసి, 3.449 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. 12 గంజాయి మొక్కలను సైతం స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు గ్రామాల్లో మరింత నిఘా పెంచడంతోపాటు అసాంఘిక కార్యకలాపాలు జరిగే అడ్డాల వద్ద తనిఖీలు చేస్తే గంజాయిని కట్టడి చేయొచ్చని పలువురు నుంచి అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

**రవాణా చేసినా, విక్రయించినా కఠిన చర్యలు**
**మహేష్ బి.గితె, ఎస్పీ**

గంజాయి రవాణా చేసినా, విక్రయించినా, తాగినా.. వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. గంజాయి సరఫరాను అరికట్టేందుకు నిఘా పెంచుతున్నాం. నార్కొటిక్ జాగిలాలతో తనిఖీలు నిర్వహిస్తున్నాం. పట్టుబడితే కేసుల నుంచి తప్పించుకోలేరు. గంజాయి వల్ల కలిగే అనర్థాలపై యువతకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. యువత భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు. గంజాయి గురించి సమాచారం తెలిస్తే 87126 56392 నంబరుకు సమాచారం అందించాలి.

# రోడ్డుపై దుమ్ము.. తప్పదు తుమ్ము

హైదరాబాద్: గ్రేటర్‌లో వాయు నాణ్యత తగ్గడానికి ప్రధాన కారణం పీఎం 10 ఉద్గారాల స్థాయి పెరగడమే. ధూళి కణాలు ఊపిరితిత్తుల్లోకి చొచ్చుకుపోయి తీవ్ర అనారోగ్య సమస్యలను కలిగిస్తాయి. జాతీయ వాయు నాణ్యతా ప్రమాణాల ప్రకారం.. వార్షిక సగటు పీఎం 10.. ఘనపు మీటరు గాలిలో 60 మైక్రోగ్రాములకు మించకూడదు. కానీ గ్రేటర్‌లో 82 మైక్రోగ్రాములు నమోదైందని పోర్టల్ ఫర్ రెగ్యులేషన్ ఆఫ్ ఎయిర్ పొల్యూషన్ ఇన్ నాన్ అటైన్‌మెంట్ సిటీస్(ప్రాణ) నివేదిక స్పష్టం చేసింది. నగరంలో 'సోర్స్ ఆఫ్ అపాయింట్‌మెంట్' స్టడీ చేసిన ఐఐటీ కాన్పూర్ బృందం సైతం ఇదే



విషయాన్ని తెలియజేసింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం 24 గంటల్లో పీఎం 10.. ఘనపు మీటరు గాలిలో 45 మైక్రోగ్రాములకు మించకూడదు. కానీ నెల రోజుల్లో 61 నుంచి 71 మైక్రోగ్రాముల మధ్య నమోదవ్వడం ఆందోళన కలిగిస్తోంది.

**శ్వాసకోశ వ్యవస్థ ప్రభావితం..**

ధూళి కణాలను కట్టడి చేయకపోతే ఆస్తమా, ఊపిరితిత్తులు, గుండె సంబంధిత వ్యాధులొస్తాయి. ఉద్గారాల కట్టడికి పరిశ్రమల్లో ఫిల్టర్లు అమర్చడం, నిర్మాణ స్థలాల్లో ధూళి నియంత్రణ చర్యల అమలు, పచ్చదనం పెంపు, పునర్వినియోగ ఇంధన వనరులను ప్రోత్సహించడం కీలకం. ప్రజారవాణా పెంచేలా ప్రోత్సాహకాలు, కార్ పూలింగ్, ఇంధన దహనాన్ని తగ్గించే విధానాలు అవసరం. విద్యుత్ వాహనాలను పెంచి, కాలుష్య తనిఖీలను కొనసాగించాలి.

# పచ్చదనంపై భారీగా వేటు

మూసాపేట : కూకట్‌పల్లి పరిధి గల్ఫ్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (జీఓసీఎల్) కంపెనీ ఆవరణలోని వందలాది చెట్లు నరికివేతకు గురయ్యాయి. కట్టుదిట్టమైన రక్షణగోడతో ఉండే ఈ కంపెనీలో ఏం జరిగినా బయట ప్రపంచానికి తెలియదు. ఈ క్రమంలో 20 రోజులుగా భారీ యంత్రాల సాయంతో ఇక్కడ పెద్ద పెద్ద చెట్ల నరికివేత కొనసాగుతున్నట్లు కంపెనీ సిబ్బంది పేర్కొంటున్నారు. వాటిని సమూలంగా నరికేసి రాత్రి వేళల్లో సుదూర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. అటవీ అధికారులకు విషయం తెలిసినా పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.

**మళ్లీ నోటీసులు ఇస్తాం: లక్ష్మణ్, మేడ్చల్ జిల్లా అటవీశాఖాధికారి**

జీఓసీఎల్ కొనసాగిస్తున్న చెట్ల నరికివేత వ్యవహారం మా దృష్టిలో ఉంది. దీనిపై ఫిర్యాదులు రావడంతో ఇటీవలే వారి నుంచి రూ. 5 లక్షల జరిమానా వసూలు చేశాం. అయినా కూడా చెట్లను కొట్టేయడం తిరిగి కొనసాగుతున్నట్లు తాజాగా ఫిర్యాదులు అందాయి. మరోమారు నోటీసులు ఇచ్చి కంపెనీ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటాం.

# హద్దులు చెరిపి.. హద్దుమీరి!



శంకరపట్నం: జిల్లాలో అనేక చోట్ల జల వనరులు ఆక్రమణకు గురవుతున్నాయి. క్రమంగా వాటి రూపురేఖలు మారిపోతున్నాయి. సాగు నీటితోపాటు భూగర్భ జలాల వృద్ధికి దోహదపడే చెరువులు, కుంటలు కుచించుకుపోతున్నాయి. యథేచ్ఛగా కబ్జా చేస్తున్నా క్షేత్రస్థాయి అధికార యంత్రాంగం పట్టించుకోవడంలేదు. ఈ పరిస్థితి జిల్లాలోని అన్ని మండలాల్లో ఉన్నా.. శంకరపట్నం కూడా అందులో ఒకటి. మండలంలో సుమారు 93 చెరువులు, కుంటలు ఉన్నాయి. కొన్నేళ్లుగా వాటిలో కొన్ని ఆక్రమణకు గురవుతున్నాయి. వాటిపై ఆధారపడిన రైతులు, మత్స్యకారులకు జీవనోపాధి లేకుండా పోతోంది. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ఇదేంటని అడిగే వారు లేకుండా పోయారు. పెద్ద మనుషులుగా చెలామణి అవుతున్నా వారు, మమ్మల్ని ఎవరు అడుగుతారులే అనే వారు దర్జాగా కబ్జాకు పాల్పడుతున్నారు. పొలాలుగా చేసి సాగు భూమిగా మారుస్తున్నారు. కొన్ని చోట్ల శిఖం భూముల్లోనే నిర్మాణాలు చేస్తున్నారు. హద్దులు చెరిపి.. హద్దు మీరి ప్రవర్తిస్తున్నారు. వర్షాలు కురిసినప్పుడు ఆ ప్రదేశంలో పెద్ద మొత్తంలో నీరు నిల్వ ఉండటమే ఇందుకు సాక్ష్యం.

**మచ్చుకు కొన్ని ఉదాహరణలు...**

కన్నాపూర్‌లోని జక్కయ్యగారి కుంట ఆక్రమణకు గురి కావడంతో ఇటీవల సమీప రైతులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటంలేదు. కుంట విస్తీర్ణం 1.17 ఎకరాలు ఉండగా.. అక్కడ ఆనవాళు లేకుండా పోయాయి.కాచాపూర్ గ్రామంలోని కొత్తకుంట కట్టను ఇటీవల పొక్లెయిన్ యంత్రంతో తొలగించడంతో అధికారులు అడ్డుకున్నారు.

గతంలోనూ వారే కుంట ఆక్రమణకు యత్నించారు. మొలంగూర్ గ్రామంలోని రామన్నగారి కుంట కబ్జాకు గురైంది. రెండేళ్లైనా అధికారులు చర్యలు తీసుకోలేదు. కుంట విస్తీర్ణం ఆరెకరాలకు పైగా ఉండగా, తగ్గిపోయింది.ధర్మారం గ్రామ శివారులో ఓ కుంటను ఇటీవల కొందరు చదును చేశారు. తాడికల్ గ్రామ శివారులో మేలకుంటలో నిర్మాణాలు వెలిశాయి. అధికారులు హద్దులు నిర్ణయించినా.. కబ్జాలు ఆగడంలేదు.వంకాయగూడెంలోని యాపాలకుంట సమీపంలోనూ కొందరు ఆక్రమిస్తున్నా పట్టించుకోవటం లేదు. గూడాటిపల్లిలో ఓ కుంట స్థలంలో సాగు చేస్తున్నారు.

# 'అమృత్' ప్రగతి అంతంతే!



కరీంనగర్ : ఉమ్మడి జిల్లాలోని నగరాలు, పట్టణాల్లో తాగునీటి సౌకర్యం మెరుగు పర్చేందుకు కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 కింద నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో విలీన గ్రామాలు, కొత్తగా ఏర్పాటు చేసిన మున్సిపాలిటీల్లో తాగునీటి సౌకర్యాన్ని కల్పించేందుకు ప్రణాళికలు చేశారు. గతేడాది రాష్ట్ర ప్రభుత్వం ప్యాకేజీల వారీగా టెండర్లు పిలిచి పనులు ప్రారంభించింది. ప్రారంభించిన పనులన్నీ వచ్చే ఏడాది జూన్ కల్లా పూర్తి కావాల్సి ఉండగా ఆ పనుల ప్రగతి ఇంకా 50 శాతానికి కూడా చేరువ కాలేదు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో పనులు మరింత ఆలస్యమవుతున్నాయి..

**ఇదీ పరిస్థితి..** గ్రామీణ మిషన్ భగీరథ కింద వేసిన పైపులైన్ల సామర్థ్యం సరిపోకపోవడంతో ఆ నీరు సక్రమంగా పంపిణీ కావడం లేదు. ఒక్కో ట్యాంకు నిండటానికి గంటల తరబడి సమయం తీసుకోవడంతో ఆశించిన స్థాయిలో సరఫరాకు నీరందడం లేదు. ఎండాకాలంలో అయితే మరింత ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ప్రస్తుతం పైపులైన్ల విస్తరణ, సంపులు, రిజర్వాయర్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఈ పనులన్నీ సకాలంలో పూర్తయితే నగర, పట్టణాల్లో విలీనమైన కాలనీలకు శుద్ధజలం అందనుంది.

**పనుల ప్రగతి ఇలా..**

కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో 10 చోట్ల రిజర్వాయర్లు, సంపుల నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉండగా 8 ప్రాంతాల్లో ప్రారంభించారు. 157.95 కిలోమీటర్ల పొడువునా పైపులైను వేయాల్సి ఉండగా 69.54కిమీ మేరనే పూర్తయ్యింది. కొత్తపల్లిలో మూడు రిజర్వాయర్లు, సంపులు నిర్మించాల్సి ఉండగా రెండు చోట్ల పనులు ప్రారంభించారు. 32.97 కిమీ.ల పొడవునా పైపులైను వేయాల్సి ఉండగా 5.48కిమీ మేర పనులు చేశారు. చొప్పదండిలో రెండు సంపులు, రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టాల్సి ఉండగా ఒక చోట ప్రారంభించారు. 45.70 కి.మీ.ల పొడవునా పైపులైను వేయాల్సి ఉండగా ఆ పనులే ప్రారంభించలేదు.హుజూరాబాద్‌లో రెండు చోట్ల పనులు ప్రారంభించగా, ఇంకా 12.55 కి.మీ.ల మేర పైపులైన్ వేశారు. జమ్మికుంటలో రెండు చోట్ల సంపులు, రిజర్వాయర్ పనులు ప్రారంభించగా 44.30 కి.మీ.ల పొడవునా పైపులైను విస్తరించాలి. ఇప్పటి వరకు 9.82 కి.మీ.ల మేరనే పనులు పూర్తయ్యాయి.

**తాఖీదులు జారీ చేశాం**

అమృత్ పథకంలో పనులు త్వరగా పూర్తి చేసేలా సంబంధిత ఏజెన్సీకి తాఖీదులు జారీ చేశాం. పైపులైను పనులు జరుగుతున్నాయి. రిజర్వాయర్లు, సంపుల నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతున్నట్లు గుర్తించాం. గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.
సంపత్‌రావు, ఈఈ, ప్రజారోగ్యశాఖ, కరీంనగర్

# దొడ్డు బియ్యం.. పురుగులపాలు



పెద్దపల్లి : జిల్లాలోని గోదాముల్లో నిల్వ చేసిన దొడ్డుబియ్యం పురుగులపాలవుతోంది. రూ.30 కోట్ల విలువైన బియ్యం నిల్వలు పాడయ్యే పరిస్థితికి చేరుకున్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. పెద్దపల్లిలోని ఓ రేషన్ దుకాణంలో 30 క్వింటాళ్ల దొడ్డు బియ్యం మిగిలిపోయాయి. వీటిని వెనక్కి తీసుకువెళ్లాలని ఎన్ని పర్యాయాలు అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయిందని డీలర్ వాపోయారు. జిల్లాలోని 413 మంది డీలర్ల పరిస్థితి ఇదే. ఇళ్లలో దుకాణాలు నిర్వహించే వారి పరిస్థితి మరింత దయనీయంగా మారింది. బియ్యంకు పట్టిన పురుగులు ఇళ్లంతా వ్యాపిస్తున్నాయని వాపోతున్నారు. ఈ మేరకు జిల్లాలోని డీలర్లు జులైలో కలెక్టర్, డీఎస్‌వోకు ఫిర్యాదు చేసినా రేషన్ బియ్యం వెనక్కి వెళ్లలేదు.

**స్థలం సమస్య** బియ్యంలో పురుగుతోపాటు ప్రతి నెలా వచ్చే కోటాను నిల్వ చేసేందుకు స్థలం ప్రధాన సమస్యగా మారింది. ఒక్కో డీలర్ వద్ద సగటున 20 క్వింటాళ్ల బియ్యం మిగిలిపోయాయి. గత అయిదు నెలలుగా పురుగులు, ఎలుకలు పడుతుండటంతో తరుగు భారీగా ఉండే అవకాశముంది. కేవలం డీలర్ల వద్దే సుమారు 8,260 క్వింటాళ్ల బియ్యం మిగిలిపోయాయి.

**నిల్వ కేంద్రాల్లోనూ..**

రేషన్ డీలర్లతోపాటు పౌరసరఫరాలశాఖ గోదాముల్లోనూ దొడ్డు బియ్యం నిర్వహణ సమస్యగా మారింది. జిల్లాలోని మూడు ఎంఎల్ఎస్ కేంద్రాల్లో 210 మెట్రిక్ టన్నుల బియ్యం పురుగులు పడుతున్నాయి. అత్యధికంగా మంథని ఎంఎల్ఎస్ కేంద్రంలో 173 మెట్రిక్ టన్నులు, పెద్దపల్లిలో 27 మెట్రిక్ టన్నులు, సుల్తానాబాద్‌లో 10 మెట్రిక్ టన్నుల బియ్యం మిగిలిపోయాయి. వీటికితోడు పౌరసరఫరాలశాఖకు చెందిన బఫర్ గోదాముల్లో 8,638 మెట్రిక్ టన్నుల దొడ్డుబియ్యం నిల్వలున్నాయి. ఇవి వినియోగించడానికి కూడా పనికిరాని స్థితికి చేరాయి. పరిస్థితి ఇలాగే ఉంటే వీటిని కొనుగోలు చేసేవారు కూడా ముందుకు రారనే ప్రచారం జరుగుతుంది.

**ప్రభుత్వం ఆదేశాలతో..**దొడ్డు బియ్యంపై ప్రభుత్వమే తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. డీలర్ల వద్ద ఉన్న బియ్యం పురుగు పట్టి చెడిపోయినట్లు ఫిర్యాదులొచ్చాయి. కానీ వాటిని వెనక్కి తీసుకోవడం, నిల్వ చేసిన వాటిని ఇతర ప్రాంతాలకు తరలించడంపై స్పష్టమైన ఆదేశాలు రావాల్సి ఉంది.శ్రీకాంత్, పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్

# తగినంత లేక.. తప్పని వెత!

పరిగి : చౌడాపూర్ మండల కేంద్రానికి చెందిన అంజనయ్య మూడెకరాల్లో వరి సాగు చేశారు. పంటకు వేసేందుకు యూరియా కోసం ఆటోను అద్దెకు తీసుకుని మరికల్ వెళ్లగా అక్కడ దొరకలేదు. అక్కడి నుంచి 22 కి.మీ. దూరంలోని కుల్కచర్లకు వచ్చారు. ఇక్కడా వారికి నిరాశే ఎదురైంది. ఇదీ క్షేత్రస్థాయిలో రైతు పడుతున్న కష్టాలకు ఉదాహరణ. వరి నాట్లు ముందుగా వేసిన రైతులు కలుపుతీత పనుల్లో నిమగ్నమయ్యారు. దీంతో యూరియాకు డిమాండ్ పెరిగింది. జిల్లాలో ఇప్పటి వరకు కొరత లేకపోయినా, సోమవారం కుల్కచర్ల, పరిగి, చౌడాపూర్, మోమిన్‌పేట, ధారూర్ తదితర మండలాల్లో సమస్య నెలకొంది. బస్తా యూరియా కోసం గంటల తరబడి బారులు తీరినా దొరకని పరిస్థితి నెలకొంది. ఇలాంటి పరిస్థితుల్లో మరికొద్ది రోజుల్లో వినియోగం మరింత పెరిగే అవకాశం ఉంది. అధికారుల ముందస్తు చర్యలు తీసుకుంటే మేలని పలువురు రైతులు కోరుతున్నారు.

95వేల ఎకరాల్లో సాగు: పరిగి, తాండూరు, వికారాబాద్, కొడంగల్ నియోజకవర్గాల్లో 95వేల ఎకరాల్లో వరి సాగైంది. ఇంకా అక్కడక్కడా




ముదురు నాట్లు వేస్తున్నారు. రెండు వారాల కిందట వరి కోసం కొనుగోలు చేసిన యూరియా భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలకు వినియోగించడంతో కొరతకు దారి తీస్తోంది. తగినంత మేరకు డీసీఎమ్మెఎస్, ప్రాథమిక ఆగ్రోస్, సహకార సంఘాలు, ఇతర వ్యాపారుల వద్ద తగినంత నిల్వలను అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కొన్నిచోట్ల ఇప్పటికే రైతులు ఆందోళన బాట పట్టారు.

**కుల్కచర్లలో ఇలా:** కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల్లో ఈ సీజన్‌కు వివిధ పంటలకు 2400 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం. ఇప్పటి వరకు సగమే సరఫరా అయింది. దీంతో ఇబ్బందులు తప్పడంలేదు. సోమవారం కుల్కచర్ల, చౌడాపూర్ మండల కేంద్రాలకు 440 బస్తాలు సరఫరా అయింది. ఒక్కో రైతుకు ఒక్క బస్తానే ఇచ్చారు. పరిగిలో ప్రైవేట్ డీలర్ల వద్దకు రాకపోవడంతో ఒక్క ఆగ్రోస్ ద్వారానే అందుతున్నాయి.

**అదనులో పంపిణీ చేయాలి: శ్రీనివాస్ చౌడాపూర్**

సీజన్ సమయానికి ఎరువులు అందుబాటులో ఉంచితేనే ఇబ్బందులు ఉండవు. నాలుగు ఎకరాల్లో వరి, ఎకరం విస్తీర్ణంలో మొక్కజొన్న సాగు చేశా. వరిలో కలుపు నివారణ పనులు పూర్తిచేసి యూరియా కోసం వారం రోజులుగా తిరుగుతుండగా రెండు బస్తాలు దొరికాయి.

**ఇంకా తెప్పించేందుకు కృషి:వీరస్వామి, పరిమళ, వ్యవసాయాధికారులు కుల్కచర్ల, చౌడాపూర్**

అవసరమైన మేరకు యూరియా ఇంకా గ్రామాలకు అందాల్సి ఉంది. ఇప్పటికే వచ్చిన సంచులను రైతులకు అందించేందుకు తగిన చర్యలు తీసుకున్నాం. ఇంకా తెప్పించేందుకు కృషి చేస్తున్నాం. ఎరువుల సమస్యతో ఇబ్బంది పడకుండా చూస్తాం.

# నా పుస్తకం.. నా కథ

ధర్మపురి : విద్యార్థుల్లో చదువుతోపాటు ప్రాపంచిక విషయాలపై అవగాహన, కాల్పనిక శక్తి పెంపొందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ప్రపంచ అక్షరాస్యతా దినోత్సవం సెప్టెంబరు 8 వరకు ప్రతి రోజు 'నా పుస్తకం.. నా కథ' నినాదంతో నిత్యం సాయంత్రం 30 నిమిషాలపాటు ప్రతి విద్యార్థి గ్రంథాలయ పుస్తకాలు చదివేలా చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లావ్యాప్తంగా 218 ఉన్నత పాఠశాలలుండగా 35,916 మంది విద్యార్థులున్నారు. వీరికి ఉపయోగపడేలా గ్రంథాలయ పుస్తకాలకు రూ.5 వేల ప్రత్యేక గ్రాంటును కూడా కేటాయిస్తున్నారు. ధర్మపురి పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో హైదరాబాద్‌కి చెందిన ఓ ప్రైవేటు సంస్థ సహకారంతో రూ.25 వేల కథల పుస్తకాలను కొనుగోలు చేశారు. 6 నుంచి 8వ తరగతి వరకు ఒక బృందంగా, 9, 10 తరగతులు మరో బృందంగా ఏర్పాటు చేసి సాయంత్రం 30 నిమిషాలపాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

నీతి కథలు, స్వాతంత్ర్య సమరయోధుల కథలతోపాటు జనరల్ నాలెడ్జ్ పుస్తకాలను కేటాయిస్తున్నారు. పుస్తకాల పఠనంపై ప్రతిరోజు నివేదికలను ఉన్నతాధికారులకు పంపిస్తున్నారు. బాగా చదివే విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు కేటాయిస్తున్నారు. విద్యార్థులు చదివిన విషయాలపై సొంతంగా తమ అభిప్రాయాలను రాసుకునేలా ఉపాధ్యాయులు ప్రోత్సహిస్తున్నారు. అయిదుగురు విద్యార్థులు ఓ



బృందంగా ఏర్పడి చదివిన అంశాలను చర్చించుకుంటున్నారు.

**నైపుణ్యాల పెరుగుదల**

ప్రతిరోజు సాయంత్రం అరగంటపాటు నీతి పుస్తకాలు చదవడం బాగా నచ్చింది. చదివిన విషయాన్ని సొంతంగా ఆలోచించి పుస్తకంలో రాసుకుంటున్నాం. దీంతో దోషాలు సవరించుకుంటూనే పఠన, లేఖన నైపుణ్యాలను పెంపొందించుకుంటున్నాం.
తాళ్లపల్లి మనిచందు, పదో తరగతి, బాలుర ఉన్నత పాఠశాల, ధర్మపురి

**సృజనాత్మకత పెంపునకు చర్యలు**

విద్యార్థులకు ప్రతి రోజు సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. వీరంతా గ్రంథాలయ పుస్తకాలను చదువుకునేలా టీచర్లు చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి పాఠశాలలో దీన్ని అమలుపరుస్తున్నారు.
రామునాయక్, జిల్లా విద్యాశాఖాధికారి, జగిత్యాల

# దేవుడి భూములూ దోచేశారు!

ఒంగోలు : సింగరాయకొండలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చెందిన విలువైన భూములు అన్యాక్రాంతమయ్యాయి. ఆలయానికి 3 వేల ఎకరాలకుపైగా భూములుండగా, ప్రస్తుతం 300 ఎకరాలకు మాత్రమే కౌలు వేలం నిర్వహిస్తున్నారు. మిగిలిన భూములు ఆక్రమితదారుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. ఆలయాన్ని ఆనుకుని ఉన్న సోమరాజుపల్లి, సింగ రాయకొండ పరిధిలో సుమారు 1,500 ఎకరాలు ఆక్రమణకు గురికాగా, అధికార యంత్రాంగం కనీసం పట్టించుకోకపోవడం గమనార్హం.

ఒంగోలులోని పాల పరిశ్రమకు ఆలయానికి చెందిన సర్వే సంఖ్య 128లో 12.80 ఎకరాలను ఎలాంటి సంప్రదింపుల్లేకుండా కట్టబెట్టేశారు. ఈ భూములు వెబ్‌ల్యాండ్‌లో పాల పరిశ్రమ ఆధీనంలో ఉన్నట్లు చూపడం గమనార్హం.

నెల్లూరు జిల్లా చెన్నూరులో 1156, 1128 సర్వే సంఖ్యలలో 98.11 ఆక్రమణలో ఉన్నాయి. ఏళ్లుగా వదిలేయడంతో దేవుడి భూములు ఎక్కడున్నాయో అధికారులకే తెలియని పరిస్థితి.

సింగరాయకొండ మండలం కనుమెళ్లలో ఆలయానికి చెందిన 98.11 ఎకరాలను ఏళ్ల కిందట అమ్మేశారు. విక్రయ విలువలో నాలుగో



వంతు మాత్రమే కొనుగోలుదారులు చెల్లించారు. మిగిలిన నగదును ఇవ్వాల్సి ఉంది. ప్రస్తుత విలువ ప్రకారం రూ.కోట్లలో ఆలయానికి చెల్లించాల్సి ఉంది.

పాత సింగరాయకొండ, సోమరాజుపల్లి పరిధిలో వందల ఎకరాలు చేతులు మారిపోయాయి. ఆయా భూముల్లో రొయ్యల చెరువులు, వివిధ పంటలు పండిస్తుండగా, సింగరాయకొండలో భవంతులు సైతం నిర్మించారు. ఇవన్నీ దేవస్థానం పరిధిలోనే ఉన్నా కనీసం దక్కించుకోవాలనే ఆలోచన అధికార యంత్రాంగం చేయడం లేదు.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం**

సింగరాయకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయ భూములు ఆక్రమణలపై ఇప్పటికే దేవాదాయశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పెద్దమొత్తంలో ఇళ్ల నిర్మాణం వంటివి చేపట్టడంతో ఉన్నతాధికారుల నుంచి వచ్చే ఆదేశాలకనుగుణంగా చర్యలు తీసుకుంటాం. పానకాలరావు, జిల్లా దేవాదాయశాఖాధికారి

# రాయవరం.. అక్రమార్కుల పరం!

మార్కాపురం : మార్కాపురం మండలం రాయవరం చెరువును అక్రమార్కులు కొల్లగొడుతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా యంత్రాలతో యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. దీంతో చెరువు తన స్వరూపం కోల్పోయింది. గతంలో ఈ చెరువును ఉపాధి హామీ పథకం కింద రూ.లక్షలు వెచ్చించి అభివృద్ధి చేశారు. ప్రస్తుతం అక్రమార్కులు యంత్రాలతో తవ్వేస్తూ



గుల్లచేస్తున్నారు. ఇక్కడ తవ్విన మట్టిని వెంచర్లకు తరలిస్తూ జేబులు నింపుకొంటున్నారు. చెరువులో గుంతలు తీయడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో రాకేష్ అనే యువకుడు ఇక్కడ తీసిన గుంతలో పడి మృతిచెందాడు. మట్టి అక్రమ రవాణాపై అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# అందరికీ నీడ.. పునరావాస మేడ

జంగారెడ్డిగూడెం : పోలవరం పునరావాస కాలనీలు పూర్తి చేసేందుకు కసరత్తు మొదలైంది. వైకాపా ప్రభుత్వం తన పాలనలో పునరావాస కాలనీల నిర్మాణాన్ని గాలికి వదిలేసింది. పూర్తి చేసిన పనులకు కూడా గుత్తేదారులకు బిల్లులు ఇవ్వలేదు. దీంతో గుత్తేదారులు సుమారు నాలుగేళ్ల కిందట పనులు ఆపేశారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసేందుకు తొలి ప్రాధాన్యం ఇస్తున్న కూటమి ప్రభుత్వం నిర్వాసితుల పునరావాసంపై దృష్టి సారించింది. ఇప్పటికే నిర్వాసితులకు పునరావాస పరిహారం విడుదల చేసింది.

గతంలో ఆగిపోయిన దగ్గర నుంచి కాలనీలు, మౌలిక వసతులు, సామాజిక భవనాలు నిర్మించేందుకు కార్యాచరణ చేపట్టింది. ఇందులో భాగంగా గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో గతంలో చేసిన నిర్మాణాలకు పెండింగ్ బిల్లులను గుత్తేదారులకు చెల్లించింది. మిగిలిన పనులు పూర్తి చేసేందుకు తాజా అంచనాలు వేసి సుమారు రూ.365 కోట్లతో టెండర్లు పిలిచారు. ఏలూరు జిల్లా పరిధిలోని పనులకు సంబంధించి సెప్టెంబరు 8న టెండర్లు తెరిచే అవకాశాలు ఉన్నాయి. జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి పంచాయతీ పరిధిలోని చల్లావారిగూడెంలో 1,505 ఇళ్లు, లేఅవుట్ పరిధిలో మౌలిక వసతులకు సంబంధించిన పనులకు రూ.203 కోట్లకు ఈ నెల 23న టెండర్లు పిలిచారు. వంకావారిగూడెంలో ఎర్రవరం లేఅవుట్ మౌలిక వసతులకు రూ.6.93 కోట్లు, జీలుగుమిల్లి మండలం స్వర్ణవారిగూడెం, బుట్టాయగూడెంలో సరుగుడు లేఅవుట్ పనులకు రూ.3.14కోట్లు ఇచ్చారు. బుట్టాయగూడెంలోని 624 ఇళ్లు, కాలనీల్లో వసతులకు సంబంధించి రూ.68.53 కోట్లు, జీలుగుమిల్లి మండలం దర్భగూడెంలో 358 గృహాలకు సంబంధించి రూ.51.39 కోట్లు, బుట్టాయగూడెం మండలం దొరమామిడి లేఅవుట్లో 305 ఇళ్లకు సంబంధించి రూ.30.88 కోట్లకు టెండర్లు పిలిచారు. రాచన్నగూడెంలోని శివగిరి లేఅవుట్లో అసంపూర్తిగా ఉన్న మౌలిక వసతుల కోసం రూ.1.93 కోట్లు చొప్పున టెండర్లు దాఖలయ్యాయి. సిద్ధంగా ఉన్నాం.. టెండర్లు ఖరారైతే పనులు చేపట్టేందుకు తాము సిద్ధంగా ఉన్నామని గృహ నిర్మాణ సంస్థ ఈఈ కేవీవీఎస్ ప్రసాద్ పేర్కొన్నారు.

# సాగులో కృషి విజ్ఞాన కాంతులు




ఎమ్మిగనూరు : జిల్లాలో రైతులకు ఆధునిక వ్యవసాయ, అనుబంధ రంగాల సేవలందిస్తూ పంట ఉత్పాదకత పెంపునకు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు చేయూత అందిస్తున్నారు. పంటలు, చేతికొచ్చిన దిగుబడులు అధిక వర్షాలకు దెబ్బతినకుండా సూచనలు ఇస్తున్నారు. కర్షకులకు వాతావరణ సమాచారాన్ని ప్రసార సాధనాలు, సామాజిక మాధ్యమాల ద్వారా ఎప్పటికప్పుడు చేరవేస్తూ అప్రమత్తం చేస్తున్నారు. విలువ ఆధారిత ఉత్పత్తులు, చిరు ధాన్యాలతో ఆహార పదార్థాల తయారీ వంటి పలు కార్యక్రమాలపై రైతులకు తర్ఫీదు ఇస్తూ ముందుకెళ్తున్నారు. శాస్త్రవేత్తల సేవలకు గుర్తింపుగా ఇటీవల నాలుగు అవార్డులు అందుకున్నారు.

**ఉచితంగా విత్తనాలు అందించి..**

జిల్లాలో ఎంపిక చేసిన రైతులకు కందులు, మినుములు 15క్వింటాలు రైతులకు ఉచితంగా అందజేశారు. విత్తనోత్పత్తి కింద 65క్వింటాళ్ల వేరుసెనగ విత్తనం ఉచితంగా పంపిణీ చేశారు. కొత్త కొర్ర వంగడ విత్తనం వంద మందికి అందజేశారు. చిరుధాన్యాల పథకం కింద 5క్వింటాళ్ల సజ్జ విత్తనం రైతులకు పంపిణీ చేశారు. 150మంది రైతులకు టార్పాలిన్లు ఉచితంగా ఇచ్చారు. అధిక సాంద్రత పద్ధతిలో 1500 ఎకరాల్లో పత్తి సాగు చేయించి దిగుబడి పెంచేందుకు రైతులకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందజేస్తున్నారు.

**రైతు సేవలకు గుర్తింపు**

ఎమ్మిగనూరు మండలంలోని బనవాసిఫారం వద్ద 50ఎకరాల విస్తీర్ణంలో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేశారు. ఒకటిన్నర దశాబ్దం క్రితం ప్రారంభమైంది. జిల్లా పశ్చిమ ప్రాంత రైతులకు పంటల సాగు, అనుబంధ రంగాలపై సలహాలు, సూచనలు అందిస్తోంది. కాలానుగుణంగా వచ్చిన అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, కొత్త వంగడాలను క్షేత్రస్థాయిలో సాగు చేయించి పంట ఉత్పాదకతను పెంచుతూ వ్యవసాయ రంగం బలోపేతానికి కృషి చేస్తున్నారు. రైతులకు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఇటీవల నాలుగు అవార్డులు దక్కాయి. తమిళనాడులోని వేలూరులో అటారిజోన్ ఎక్స్ డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్.మీరాతో పాటు ఇతర వ్యవసాయ నిపుణుల ద్వారా అవార్డులు అందుకున్నారు.

జిల్లాలో అపరాల ఆదర్శ గ్రామ పథకం కింద సాగును పెంచేందుకు కృషి చేశారు. సమగ్ర సస్య రక్షణలో భాగంగా ట్రైకోడెర్మావిరిడి, సూడోమోనస్ వినియోగం, 1.55లక్షల మంది రైతుల డేటా బేస్ సేకరించి వారికి వ్యవసాయ, అనుబంధ, వాతావరణ సమాచారం ఎప్పటికప్పుడు చేరవేయడం, భూసార పరీక్షలు 2,500, నీటి పరీక్షలు 500లు చేసి అవార్డు అందుకున్నారు.

**నికర ఆదాయం పెంచేందుకు కృషి**

రైతులు పంటల సాగులో నికర ఆదాయం పొందేందుకు సాగులో వచ్చిన ఆధునిక వంగడాలు, సాంకేతిక పరిజ్ఞానం అందిస్తున్నాం. వ్యవసాయ అనుబంధ రంగాలపై శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. జిల్లాలోని రైతులందరికీ ప్రసార, సామాజిక మాధ్యమాల ద్వారా సమాచారం అందించేందుకు కృషి చేస్తున్నాం. డాక్టర్ రాఘవేంద్రచౌదరి, సమన్వయకర్త, కృషి విజ్ఞా కేంద్రం

# నిబంధనలకు విరుద్ధం.. చర్యలకు సిద్ధం



నెల్లూరు : జిల్లా ఆక్వా రంగానికి ప్రసిద్ధి. పెద్దఎత్తున రొయ్యలు, చేపల చెరువులు సాగు చేస్తున్నారు. ఇక్కడి నుంచి విదేశాలకు రొయ్యల ఎగుమతి జరుగుతోంది. అయితే ఎక్కువమంది అనుమతులు లేకుండానే సాగు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. జిల్లాలోని 21 మండలాల పరిధిలో రొయ్యలు, చేపల చెరువులు ఉన్నాయి. ఇందులో 17,700 మంది రైతులు రొయ్యలు, 6857 మంది చేపల సాగు చేపట్టారు. ఎక్కువ మంది లైసెన్సులు లేకుండా సాగు చేస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు, విద్యుత్ సర్వీసులు, మార్కెటింగ్ విషయంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ నేపథ%రి%్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. ప్రతి రైతు తప్పని సరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, లైసెన్సు తీసుకోవాలని తెలిపింది. అందులో భాగంగా జిల్లాలో మత్స్యశాఖ ప్రత్యేకంగా 30 రోజుల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తోంది. లైసెన్స్‌లు లేనివారు 16,670 మంది జిల్లాలో ఇప్పటి వరకు లైసెన్సులు లేని రొయ్యల రైతులు 12,500 మంది, చేపల సాగులో లేని వారు 4170 మంది ఉన్నారు. లైసెన్స్ లేని రైతులు నెల రోజుల్లో తప్పనిసరిగా తీసుకోవాలని మత్స్యశాఖ అధికారులు చెబుతున్నారు. ప్రతి గ్రామంలోని సచివాలయంలో మత్స్యశాఖ గ్రామ సహాయకులు ఉంటారు. వారిని సంప్రదిస్తే అర్హత ఉన్న ప్రతి రైతుకు లైసెన్స్ జారీ చేస్తారు. గ్రామ స్థాయిలో మత్స్యశాఖ సహాయకులు స్పందించక పోతే నెల్లూరు నగరంలో ఉన్న జిల్లా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేయవచ్చు. రైతులు 94408 14739 నంబరుకు సమస్యలు తెలపవచ్చని అధికారులు తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తప్పనిసరిగా తీసుకోవాలి ప్రత్యేక డ్రైవ్‌లో రొయ్యలు, చేపల రైతులు తప్పని సరిగా లైసెన్స్ తీసుకోవాలని జిల్లా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ కె.శాంతి తెలిపారు. అలా చేయని రైతులపై చర్యలు తీసుకుంటామన్నారు.

# సోమశిలకు వరద పరవళ్లు



ఆత్మకూరు: సోమశిల జలాశయానికి వరద పెరుగుతుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఎప్పుడైనా పెన్నానదిలోకి 40వేల క్యూసెక్కులు విడుదల చేయనుండటంతో.. లోతట్టు ప్రాంతాలను జాగృతం చేశారు. మరోవైపు కండలేరులో నీటి నిల్వ 50 టీఎంసీల మార్కును అధిగమించింది.

**ఎగువన వర్షాలతో...**

కర్నూలు, కడప జిల్లాల్లో కురిసిన వర్షాలు.. కందు ఉద్ధృతంగా ప్రవహిస్తుండటంతో.. ఆదినిమ్మాయపల్లి వద్ద నదిలో 48,800 క్యూసెక్కుల ప్రవాహం ఉండగా– అన్నమయ్య ప్రాజెక్టు నుంచి మూడు వేల క్యూసెక్కులు విడుదలవుతోంది. దాంతో జలాశయంలోకి వచ్చే ప్రవాహం 50వేల నుంచి 60వేల క్యూసెక్కుల వరకు పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. దాంతో లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. ఎవరూ నదిలోకి దిగవద్దని హెచ్చరికలు జారీ చేశారు. ప్రస్తుతం సోమశిలలో 73.69 టీఎంసీల నిల్వ ఉండగా– జలాశయంలోకి 37,212 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. 39,281 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

**కండలేరులో 50 టీఎంసీలు**

కండలేరులో నిల్వ 50 టీఎంసీల మార్కును అధిగమించింది. ప్రస్తుతం 50.27 టీఎంసీలుగా ఉంది. జలాశయంలోకి 10,230 క్యూసెక్కులు వస్తుండగా.. 1685 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. సోమశిల, కండలేరు జలాశయాల్లో మొత్తంగా ప్రస్తుతం 124 టీఎంసీలు ఉండగా.. రోజుకు ఒక టీఎంసీ చొప్పున పెరుగుతోంది. సెప్టెంబరులో 50టీఎంసీల మార్కును దాటడం జలాశయం చరిత్రలో ఇదే మొదటిసారి. దాంతో ఉమ్మడి జిల్లా రైతులు సంతోషంగా ఉన్నారు.

# అలా తెచ్చారు.. ఇలా పోయాయి!

తాళ్లూరు : వైకాపా ప్రభుత్వం నాడు–నేడు పథకంలో భాగంగా జిల్లాలోని పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఆర్వోప్లాంట్లు దిష్టిబొమ్మల్లా మారాయి. నాణ్యత లేనివి కావడంతో అనతి కాలంలోనే మరమ్మతులకు గురయ్యాయి. జిల్లాలో 2,180 వరకు ప్రభుత్వ పాఠశాలలు ఉండగా.. వాటిలో సుమారు వెయ్యి పాఠశాలలను తొలివిడతలో ఎంపిక చేసి ప్లాంట్లను ఏర్పాటు చేశారు. ప్రాథమిక పాఠశాలల్లో ఒక్కోదానికి రూ.లక్ష నుంచి రూ.మూడు లక్షల్లోపు, ఉన్నత పాఠశాలల్లో రూ.5 లక్షల చొప్పున వెచ్చించారు. ఇలా మొత్తం రూ.15 కోట్లపైగా నిధులు ఖర్చు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసంస్థ ద్వారానే ఆర్వో ప్లాంట్లను సమకూర్చారు. అవి తొందరగానే మూలకు చేరాయి. విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు నాడు–నేడు పథకం కోసం ఏర్పాటు చేసిన యాప్‌లో నమోదు చేస్తే సదరు సంస్థ తరఫున సిబ్బంది వచ్చి మరమ్మతులు చేసే వారు. అయినా మూణ్నాళ్ల ముచ్చటగానే మారాయి. యథావిధిగా ఉపాధ్యాయులు బయట నుంచి నీళ్ల డబ్బాలు కొనుగోలు చేసి విద్యార్థులకు మంచినీరు అందిస్తున్నారు. ఈ కారణంగా ఒక్కో పాఠశాలలో తాగునీటి కోసమే నెలకు సుమారు రూ. 5 వేల నుంచి



రూ.10 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

**పదేపదే చెప్పినా ఫలితం లేదు..**

కూటమి ప్రభుత్వమైనా చొరవ తీసుకొని పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లను బాగుచేయించాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరుతున్నారు. గతంలో వీటిని ఏర్పాటు చేసిన సంస్థ సిబ్బందికి మరమ్మతుల గురించి పదేపదే తెలియజేసినా ప్రస్తుతం ఎవరూ రావడం లేదని చెబుతున్నారు. దీనిపై ఒంగోలు డిప్యూటీ డీఈవో ఎ.చంద్రమౌళీశ్వరరావును వివరణ కోరగా.. పాఠశాలల్లో పనిచేయని ఆర్వో ప్లాంట్ల గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మరమ్మతులు చేయిస్తామని తెలిపారు.

# నాణ్యతపై 'తారు'మబ్బులు

డోన్ : ఉమ్మడి కర్నూలు జిల్లా మీదుగా వెళ్లే 44వ నంబరు జాతీయ రహదారి నిర్వహణ అధ్వానంగా మారింది. అక్కడక్కడా దెబ్బతిని గుంతలు పడటంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ మార్గంలో ప్రతిరోజూ వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. ప్రతి నెలా రూ.కోట్లలో ఆదాయం సమకూరుతున్నా మరమ్మతులపై దృష్టి సారించడం లేదు. కర్నూలు నుంచి ప్యాపిలి వరకు 75 కి.మీ. పొడవునా ఉన్న జాతీయ రహదారి గుంతలమయంగా మారింది. నేషనల్ హైవే కావడంతో వాహనదారులు వేగంగా వెళుతుంటారు. గుంతలు కనపడకపోవడం.. దగ్గరికి వచ్చేసరికి ప్రమాదాన్ని గుర్తించి ఒక్కసారిగా బ్రేకులు వేస్తున్నారు. దీంతో వెనుక వచ్చే వాహనాలతో ముప్పు ఏర్పడుతోంది. డోన్ నుంచి కర్నూలుకు వెళ్లాలంటే గంట ప్రయాణం. రోడ్డుపై గుంతలు ఉండటంతో సుమారు 2 గంటలు పడుతోందని వాహనదారులు పేర్కొంటున్నారు.

**ఆదాయం సమకూరుతున్నా..**

ప్రతిరోజూ ఎన్‌హెచ్ 44 మీదుగా 20 వేలకుపైగా వాహనాలు తిరుగుతుంటాయి. ఒక్క అమకతాడు టోల్‌ప్లాజా పరిధిలో నిత్యం రూ.5 లక్షలకుపైగా టోల్ వసూలవుతుంది. ఈ ఒక్క టోల్‌ప్లాజా నుంచే నెలకు రూ.1.50 కోటి వరకు ఆదాయం సమకూరుతుంది. అయినప్పటికీ రహదారి నిర్వహణను గాలికొదిలేశారన్న విమర్శలున్నాయి. రహదారిపై అక్కడక్కడా వీధి దీపాలు లేకపోవడం.. గుంతలు ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

**పైపై మరమ్మతులు**గతంలో జాతీయ రహదారిపై గుంతలు పడటంతో గుత్తేదారులు అక్కడక్కడా ప్యాచ్‌వర్క్ పనులు చేశారు. గత కొన్ని రోజులుగా కురిసిన వర్షాలకు ప్యాచ్‌వర్క్ వేసిన చోటే తారు లేచిపోయి తిరిగి గుంతలు పడటం గమనార్హం. ఈ నేపథ్యంలో జాతీయ రహదారి నిర్వహణ అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేయించాల్సిన అవసరం ఉంది.

**ఎక్కడెక్కడ ఎలా ఉందంటే..**

డోన్ పరిధిలో దొరపల్లి వంతెన, ఉడుములపాడు వంతెన, ఓబులాపురం మిట్ట, దేవరబండ స్టేజీ, జగదుర్తి స్టేజీ వద్ద గుంతలు పడ్డాయి. వెల్దుర్తి మండల పరిధిలోని మదార్‌పురం, బొమ్మిరెడ్డిపల్లి, మల్లెపల్లి వద్ద రహదారి అధ్వానంగా ఉంది. కల్లూరు మండలంలోని ఉలిందకొండ, చిన్నటేకూరు, పెద్దటేకూరు, దూపాడు, వెంగన్నబావి నుంచి కర్నూలు వెళ్లే వరకు రహదారి పలు ప్రాంతాల్లో దెబ్బతింది.

# ఆక్రమణల చెరలో చెరువులు

రావికమతం : వందలాది ఎకరాల సాగుకు ఆయువుపట్టుగా ఉన్న చెరువులు ఆక్రమణలతో ఉనికిని కోల్పోతున్నాయి. ఏటికేడు చెరువు గర్భాల విస్తీర్ణం తగ్గిపోతోంది. దీంతో నీటినిల్వ సామర్థ్యం తగ్గిపోయి అన్నదాతలకు అష్టకష్టాలు తప్పట్లేదు. రావికమతం మండలం పిల్లవాని పాలెంలోని సర్వే నం. 261–1లోని చినపున్న చెరువు గర్భం విస్తీర్ణం 6.07 ఎకరాలు. దీని కింద సుమారు 650 ఎకరాల వరకు ఆయకట్టు రైతులు లబ్ధి పొందుతున్నారు. ప్రస్తుతం ఈ చెరువు చిక్కిసగమైంది.

చెరువు గర్భంలో వరి, చెరకు సహా ఇతర పంటలు సాగు చేస్తున్నారు. దీంతో సరిపడా సాగునీరు అందక ఆయకట్టు రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరుపాక రెవెన్యూలోని సర్వే నం. 19–1లోని 3.96 ఎకరాల విస్తీర్ణంగల వియ్యపువాని చెరువుదీ ఇదే పరిస్థితి. మేడివాడ పెద్ద చెరువు విస్తీర్ణం సుమారు 40 ఎకరాల వరకూ ఉంటుంది. ఇందులో 15 నుంచి 20 ఎకరాల వరకు ఆక్రమణకు గురైంది. కొత్తకోట, దొండపూడి, రావికమతం, తట్టబంద, మర్రివలస తదితర గ్రామాల్లోని చెరువుల పరిస్థితి అధ్వానంగా ఉంది.

**చర్యలు తీసుకున్నా మళ్లీ మొదటికే..** సుమారు 25 ఎకరాలు విస్తీర్ణం ఉన్న గొంప మిరియాల చెరువు పూర్తిగా ఆక్రమణకు గురైంది. పలువురు చెరువును ఆక్రమించి సాగుభూమిగా మార్చుకొని వరి, చెరకు, సరుగుడు వంటి పంటలు సాగుచేస్తున్నారు.

# కని'పెట్టె'దెవరు..?!

విశాఖపట్నం: విశాఖ నుంచి గోమాంసాన్ని అక్రమంగా తరలిస్తున్నారు. కొన్ని రైళ్లలో వ్యూహాత్మకంగా భారీగా రవాణా చేస్తున్నట్లు సమాచారం. విశాఖ నుంచి బెంగళూరు, దిల్లీ, ముంబయికి వెళ్లే రైళ్లలో అధికంగా తరలిస్తున్నట్లు తెలుస్తోంది. రైల్వే పార్సిల్ కేంద్రం వద్ద సరైన నిఘా లేకపోవడంతో ఇదంతా జరుగుతున్నట్లు చర్చ సాగుతోంది. తనిఖీలేవి?: విశాఖ రైల్వే స్టేషన్‌లో జ్ఞానాపురం వైపు ఎనిమిదో నంబరు ప్లాట్‌ఫాంపై రైల్వే పార్సిల్ కేంద్రం ఉంది. గతంలో ఇక్కడ రైల్వే పోలీసుల తనిఖీ కేంద్రం ఉండేది. రోజూ ఒకరిద్దరు పోలీసులు అక్కడ విధులు నిర్వహిం



చేవారు. అనుమానిత వస్తువులను తనిఖీ చేసేవారు. సందేహం ఉంటే బిల్లులు పరిశీలించేవారు. ఏం పంపిస్తున్నారో అనేక సార్లు ప్రశ్నించేవారు. పోలీసులు ఉన్నారన్న భయంతో కొందరు వెనుకంజ వేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. రెండు నెలల కిందట ఆ పాయింట్ తొలగించేశారు. పార్సిల్ బుక్ చేస్తున్న అధికారులు ఆదాయమే లక్ష్యంగా పనిచేస్తున్నారు తప్ప... ఏం పంపిస్తున్నారు, లోపల ఏముందని ప్రశ్నించడం లేదు. దీంతో ఇక్కడి నుంచి రవాణా అవుతున్నవేంటో బయటకు తెలియడం లేదు.బీ కొందరికి పార్సిల్ ఏజెన్సీలను రైల్వే అప్పగించింది. వారు ఏ వస్తువులు పార్సిల్ చేస్తే వాటిని పంపేస్తున్నారు. గోమాంసం అక్రమ రవాణాలో ఇక్కడే అసలు దందా సాగుతున్నట్లు అనుమానిస్తున్నారు. వీరితో చేతులు కలిపి కొందరు అధికారుల అండతో రవాణా సాగుస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

# చెరువుల అభివృద్ధికి ఆర్ఆర్ఆర్

చిత్తూరు: జిల్లాలోని చెరువులకు జీవం రానుంది. వైకాపా ప్రభుత్వ పాలనలో నిర్లక్ష్యానికి గురైన జల వనరులకు కూటమి ప్రభుత్వం జవసత్వాలు కల్పిస్తోంది. తాజాగా చిన్ననీటి వనరులు, చెరువుల అభివృద్ధికి చర్యలు చేపట్టింది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఆర్ఆర్ఆర్(మరమ్మతులు, పునర్నిర్మాణం, పునరుద్ధరణ) పథకం కింద జిల్లాలో 214 సాగునీటి చెరువుల అభివృద్ధికి రూ.132.98 కోట్ల వ్యయ అంచనాలతో సవివర నివేదికల(డీపీఆర్)ను జిల్లా జల వనరుల శాఖ అధికారులు సిద్ధం చేశారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆమోదంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదించనున్నారు. చెరువుల ఆక్రమణలతో



పాటు కట్టలు బలహీనం కాగా.. కాలువలు, మొరవలు దెబ్బతిన్నాయి. తద్వారా చెరువులకు నీరు చేరలేదు. వీటిని కాపాడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో నిధులు విడుదల చేయనున్నాయి. ఒక్కో చెరువుకు రూ.10 లక్షల నుంచి రూ.1.25 కోట్ల వరకు నిధులు అవసరమని ప్రతిపాదనలు పంపామని జిల్లా జల వనరుల శాఖ ఎస్ఈ వెంకటేశ్వరరాజు తెలిపారు.

# రాయితీ కావాలంటే రిజిస్ట్రేషన్ కావాలంతే!

ఒంగోలు : ఆక్వా రంగంలోని రైతులు చెరువుల రిజిస్ట్రేషన్ల విషయంలో వెనుకబడ్డారు. జిల్లాలోని కోస్తాతీర ప్రాంత మండలాల్లో 1,500 మంది రైతులు 11 వేల ఎకరాలకుపైగా విస్తీర్ణంలో ఆక్వా సాగు చేస్తున్నారు. ఇందులో మూడో వంతు విస్తీర్ణానికి మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ప్రస్తుతం ఆక్వా జోన్ పరిధిలో సాగు చేస్తూ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేసుకున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్తు వినియోగానికి సంబంధించి యూనిట్‌ను రూ.1.50కే సరఫరా చేస్తోంది. జిల్లాలోని 374 మంది రైతులకు రాయితీపై విద్యుత్తు అందిస్తుండడంతో వారిపై పెట్టుబడుల భారం తగ్గుతోంది. మరో 1100 మందికిపైగా రైతులు 6,649 ఎకరాలకు రిజిస్ట్రేషన్ చేయించుకోలేదు. ఇటీవల అమరావతిలో జరిగిన కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆక్వాసాగుపై సమీక్షించారు. రిజిస్ట్రేషన్ విధిగా చేయించాలని, వాటికి విద్యుత్తు రాయితీ ఇచ్చే అవకాశం ఉంటుందని ప్రకటించారు.

**ఎక్కువ విస్తీర్ణం డీకేటీ భూముల్లోనే...**

జిల్లాలోని తీర ప్రాంత మండలాల్లో 30 ఏళ్ల కిందట పేదలకు ప్రభుత్వం అసైన్డ్ భూములను ఇచ్చింది. ఎక్కువ మంది లబ్ధిదారులు అప్పట్లో



ఇతరులకు అనాధికారికంగా విక్రయించారు. ఆయా భూములు ఆక్వా సాగుకు అనుకూలంగా ఉండటంతో కాలక్రమేణా టైగర్, వెనామీ రొయ్యల సాగు చేస్తున్నారు. విద్యుత్తు రాయితీ నిమిత్తం రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నా యాజమాన్య హక్కులకు సంబంధించి సాంకేతిక చిక్కులొస్తున్నాయి. దీంతో ఎక్కువ మంది రైతులు రాయితీ విద్యుత్తుకు దూరమవుతున్నారు. ఏ ఒక్కరైతు నష్టపోకూడదనే ఉద్దేశంతో చెరువుల రిజిస్ట్రేషన్‌పై సాగుదారులకు మత్స్యశాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.


జిల్లాలోని సముద్రతీర మండలాల్లో ఆక్వా సాగు

మండలాలు : ఒంగోలు, కొత్తపట్నం, టంగుటూరు, నాగులుప్పలపాడు, సింగరాయకొండ, జరుగుమల్లి

ప్రస్తుతం సాగు విస్తీర్ణం: 11,033 ఎకరాలు

రిజిస్ట్రేషన్ పూర్తయింది: 4,384 ఎకరాలు

# ఉల్లి రైతు కన్నీటి ఘోష



ధర్మవరం : ఉల్లి పంట సాగు చేసిన రైతులు ధర లేక తల్లడిల్లుతున్నారు. చేతికందిన పంటను కోసి విక్రయించుకోలేక నానా అవస్థలు పడుతున్నారు. నాలుగు నెలలు కష్టపడి పంట పండిస్తే పెట్టుబడి మాట దేవుడెరుగు.. కనీసం కూలీ డబ్బులు కూడా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉల్లి గడ్డలను కొనేందుకు వ్యాపారులు ముందుకు రాకపోడంతో రైతులే సొంతంగా ఆటోలు బాడుగకు తీసుకుని ఊరూరా అమ్ముతున్నారు. కొందరైతే హోటళ్లు, దాబా యజమానులను బతిమాలాడుకుని వంద కిలోల ఉల్లి బస్తాను రూ.70, 80కే ఇచ్చేస్తున్నారు. మరికొందరు నిత్యాన్నదానం జరిగే ఆలయాలకు ఉచితంగా అందిస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలోని అన్ని మార్కెట్‌యార్డుల్లో ఉల్లి విక్రయాలు జరుగుతున్నాయి. బహిరంగ మార్కెట్‌లో ఉల్లి పరిమాణాన్ని బట్టి ధరలు ఉంటున్నాయి. వ్యాపారులు రూ.100కు 5 కిలోల నుంచి 8 కిలోల వరకు విక్రయిస్తున్నారు. ఉల్లి నారకు పెట్టిన ఖర్చులు కూడా రాని పరిస్థితి నెలకొంది.

**తగ్గిన సాగు**

జిల్లా వ్యాప్తంగా సాధారణంగా 500 ఎకరాలకుపైగా ఉల్లి పంట సాగైంది. అయితే ధరలు రానురాను తగ్గుతుండటంతో రైతులు పంట సాగుకు ఆసక్తి చూపించలేదు. కేవలం 210 ఎకరాల్లోనే సాగు చేశారు. ప్రస్తుతం కోత కోయాల్సి ఉంది. ఆశించిన మేరకు ధర లేకపోవడంతో కోయాల వద్ద అనే మీమాంసలో పడ్డారు. మిగతా పంటలతో పోలిస్తే ఎకరా విస్తీర్ణంలో ఉల్లి సాగుకు రూ.50 వేల నుంచి రూ.65 వేల వరకు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. దానికితోడు వాతావరణంలో మార్పుల కారణంగా పంటకు తెగుళ్లు వ్యాపించే అవకాశం ఉంటుందని రైతులు ముందుకు రాలేదు.

జిల్లాలోనే రొద్దం మండలంలో అత్యధికంగా వంద ఎకరాల్లో ఉల్లి పంట సాగు చేశారు. చాలా మంది రైతులు సగం కోసి మిగతాది పొలంలోనే వదిలేశారు.

తాడిమర్రి మండలంలోని దాడితోట గ్రామంలో రమణారెడ్డి అనే రైతు రూ.1.30లక్షలు పెట్టుబడి పెట్టి పంట సాగు చేశారు. వారం రోజుల కిందటే ఉల్లిని కోయాల్సి ఉంది. ధర లేకపోవడంతో పొలంనే పంటంతా ఉండిపోయింది.

కూలీ గిట్టుబాటు కాలేదు – నారాయణస్వామి, గౌరాజుపల్లి

రెండు ఎకరాల్లో ఉల్లి సాగుకు రూ.1.25 లక్షలు ఖర్చు చేశా. దిగుబడి బాగానే ఉన్నా.. ధరలేక సగం పంట మాత్రమే కోశా. రూ.40 వేలు చేతికొచ్చింది. మిగతాది అలాగే వదిలేశాను. ప్రభుత్వం ఉల్లి రైతులను ఆదుకోవాలి.

**ఆందోళన అవసరం లేదు**

– చంద్రశేఖర్, జిల్లా ఉద్యాన శాఖాధికారి

ఉల్లి పంటకు కష్టకాలమే. గతంలో పోలిస్తే మన దగ్గర ఉల్లి పంట సాగు కొంతమేరకు తగ్గింది. రైతులు ఆందోళన చెందకుండా కొన్ని రోజులు వేచి ఉండాల్సిందే.

# శోధన అటు ఇటైతే.. వేదన



ఆత్మకూరు ఏదైనా సమాచారం కోసం గూగుల్‌లోకి వెళ్లి తమకు కావాల్సిన పదాలను చరవాణిలో టైప్ చేసిన వెంటనే ఫోన్ చేస్తారు.. సార్ మీరు ఈ వస్తువు కోసం ఆన్‌లైన్‌లో వెతికారు. మేం ప్రత్యేక ఆఫర్‌లో మీకు డోర్ డెలివరీ చేస్తామని చెబుతారు. మనం సమాచారం వెతికే సమయంలో ఎక్కడా వివరాలను నమోదు చేయకుండానే ఎలా కాల్స్ వస్తున్నాయన్నది తెలుసుకోవాలి.

**నకిలీ గుర్తించడం ఎలా?**

డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.గూగుల్.కామ్ అని టైప్ చేస్తే ఒక్కోసారి స్పెల్లింగ్ మారి ఉంటుంది. గూగుల్‌లో రెండు ఓలు ఉండాల్సిన చోటు రెండు సున్నాలను స్కామర్లు ఉంచుతారు. అసలు వెబ్‌సైట్ మాదిరిగా ఉన్నప్పటికి సైట్ పనితీరు వేరుగా ఉంటుంది. ఓ వెబ్‌సైట్‌లోకి వెళ్లి సమాచారం వెతికిన తరువాత మరో వెబ్‌సైట్‌లో సమాచారం చూపుతోందంటే అది నకిలీదని గుర్తించాలి. వెబ్‌సైట్ ముందు హెచ్‌టీపీపీఎస్ ఉండి అది సెక్యూర్డ్ అని చూపితేనే నమ్మాలి. కేవలం హెచ్‌టీపీపీ అని ఉన్నా అనుమానించాల్సిందే. స్కామర్లు అసలు వెబ్‌సైట్‌లాగా సృష్టించి చివరలో.కామ్ అని కాకుండా .నెట్ అనో లేక .ఈఎన్ లాంటి పదాలను ఉంచుతారు.

ఉమ్మడి అనంత జిల్లాలో నెలకు పదుల సంఖ్యలో సైబర్ కేసులు నమోదవుతుండటం ఆందోళన రేకెత్తిస్తోంది. ఆత్మకూరు మండలానికి చెందిన ఓ యువకుడు.. ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెట్టి అదనపు సంపాదన చేయడం ఎలా? అని వెతకడం ప్రారంభించాడు. వెంటనే ఓ వ్యక్తి నుంచి ఫోన్ వచ్చి ఫలానా యాప్‌లో పెట్టుబడి పెడితే ఆదాయం వస్తుందని నమ్మించాడు. పది రోజులు అలా లాభాలు ఖాతాలో జమయ్యాయి. నమ్మకం ఏర్పడి రూ.40 వేలు పెట్టుబడి పెట్టాడు. తరువాత వచ్చిన లాభాలు ఖాతాలో జమకాలేదు. ఆరా తీయగా త్వరలో జమఅవుతాయని సూచించారు. కొద్దిరోజులయ్యాక యాప్ ఆన్‌లైన్ నుంచి డిలీట్ అయింది. పెట్టుబడి సొమ్ము పోయింది. సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదనపు సంపాదన ఎలా చేయాలి? అని శోధించినపుడే ఈ అంశంలో తప్పటడుగు పడిందని అర్థమైంది.

**మాయాజాలం** మనం సమాచారం కోసం వెతికే వెబ్‌సైట్ల మాదిరిగానే నకిలీ వెబ్‌సైట్లు ఉంటాయి. ఓ వెబ్‌సైట్ సెర్చ్ ఇంజిన్‌లో పదాలను టైప్ చేసి ఒకే నొక్కిన వెంటనే యాక్సెప్ట్ కుకీస్ అని వస్తూ ఉంటుంది. అవగాహన లేక వెంటనే అలో అని నొక్కుతున్నారు. అలా నొక్కిన వెంటనే మీరు నకిలీ వెబ్‌సైట్‌లో ఉన్నంతవరకూ మీరు ఏం టైప్ చేసినా మూడో వ్యక్తికి తెలిసిపోతుంది. తర్వాత ఫోన్ చేసి ట్రాప్ చేయడానికి ప్రయత్నిస్తారు.

# పురం వ్యాపార పన్నులో మతలబు




హిందూపురం : పురపాలిక పరిధిలో ఏ వ్యాపారం చేసేవారైనా అనుమతి తప్పనిసరి. వ్యాపారాన్ని బట్టి మూడు స్లాబుల్లో పన్ను విధిస్తారు. ఏడాదికి చిన్న దుకాణానికి రూ.600, మధ్యస్థాయి రూ.800, పెద్ద వాటికి రూ.1200 పన్ను కింద మున్సిపల్ పారిశుధ్య విభాగానికి చెల్లించాలి. వారు ఇచ్చే అనుమతి పత్రాన్ని దుకాణంలో అందరికీ కనిపించేలా ప్రదర్శించాలి. ఈ ప్రక్రియ చాలాచోట్ల అమలు కావడం లేదు. వైకాపా పాలనలో పన్ను వసూళ్లను పట్టించుకోకపోవడంతో బకాయి రూ.2.88 కోట్లకు చేరింది. ఈ ఏడాది వసూలు చేయాల్సింది రూ.32 లక్షలు కలిపితే రూ.3.2 కోట్లు అయింది.

విధింపులోనూ నిర్లక్ష్యమే..

పురపాలిక పరిధిలో 44 వేలు భవనాలు ఉన్నట్లు మున్సిపాలిటీ గుర్తించింది. వ్యాపార కేంద్రం కావడంతో నిబంధనల ప్రకారమే 10 శాతం భవనాల్లో వ్యాపారాలు సాగిస్తుంటారని అంచనా.. ఈ లెక్కన 4,400 వ్యాపార అనుమతి లైసెన్స్‌లు ఉండాలి. ప్రస్తుతం 2600 మంది రిజిస్టర్ చేసుకొన్నారు. మిగిలిన వాటికి సంబంధించి పన్ను విధిస్తే అదనంగా ఏడాదికి రూ.18 లక్షల ఆదాయం వస్తుందని తెలిసినా అధికారులు మిన్నకుండిపోతున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

**సిబ్బంది చేతివాటంతో..**


పన్ను వసూలు వదిలేసి, కింది స్థాయి సిబ్బంది కొందరు దుకాణదారులతో ప్రతి నెలా కొంత పుచ్చుకొంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. పన్ను వసూలు చేయకపోవడానికి ఇదే ప్రధాన కారణమని తెలుస్తోంది. మున్సిపల్ ఉన్నతాధికారులు సైతం వ్యాపార పన్ను వసూళ్లపై సమీక్ష నిర్వహించకపోవడంతో బకాయిలు పేరుకుపోతున్నాయి.

**సర్వే నిర్వహిస్తాం – మల్లికార్జున, మున్సిపల్ కమిషనర్, హిందూపురం**

బకాయిలు ఉన్నది వాస్తవమే. సచివాలయ సిబ్బందితో పట్టణంలో సర్వే చేయిస్తాం. బకాయిల వసూలుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తాం.

# నాడు పన్నాగం..నేడు కబ్జాకు సిద్ధం

శ్రీకాళహస్తి : కబ్జాకోరుల ఆశలన్నీ ఫ్రీహోల్డ్‌పైనే ఉన్నాయి. శ్రీకాళహస్తి మండలం ఇలగనూరు సమీపంలో పరిశ్రమల పరిసర ప్రాంతాల్లోని విలువైన భూములపై భూకబ్జాదారులు కన్నేశారు. వైకాపా హయాంలో ఏర్పాట్లు చేసుకున్న వీరు తాజాగా ఆ భూములను గుట్టుచప్పుడు కాకుండా చదును చేస్తున్నారు. వైకాపా హయాంలో ఫ్రీహోల్డ్ పేరుతో యథేచ్ఛగా కబ్జాలు జరిగాయి. ఇలగనూరులో అపాచీ పరిశ్రమ ఏర్పాటుకు భూములు ఇచ్చి అప్పటి సీఎం జగన్ శంకుస్థాపన సైతం చేశారు. ఆ సమయంలోనే సర్వే నంబరు 383, 384, 310, 405ల్లో దాదాపు 25 ఎకరాల ప్రభుత్వ భూమిని ఫ్రీహోల్డ్‌లో ఉంచి కబ్జా చేయడానికి పూనుకున్నారు. ఎన్నికల కారణంగా ఈ ప్రక్రియ ఆగిపోయింది. కూటమి ప్రభుత్వం రాగానే ఫ్రీ హోల్డ్‌పై నిషేధం విధించింది. ఎప్పుడెప్పుడు నిషేధం



ఎత్తివేస్తుందోనని అక్రమార్కులు ఆశతో నిరీక్షిస్తున్నారు.

ప్రభుత్వ భూములపై కన్ను: ఫ్రీహోల్డ్‌లో కబ్జా చేసేందుకు సిద్ధం చేసుకున్న 25 ఎకరాలకు సమీపంలోని మరో 10 ఎకరాలనూ కబ్జా చేయాలనుకున్నారు. గతంలో కబ్జాలకు ప్రయత్నించిన అక్రమార్కులే మళ్లీ ప్రయత్నాలు ప్రారంభించారు.

# పరదా కట్టారు... గోతులు తవ్వారు!

నర్సీపట్నం : బ్రిటిష్ సైనికాధికారుల సమాధులకు సమీపంలో ప్రధాన రహదారిని ఆనుకుని కట్టిన ఆకుపచ్చ మ్యాట్ని మున్సిపల్ కమిషనర్ సురేంద్ర గురువారం తొలగించినప్పటికీ శనివారం ఉదయం మళ్లీ కట్టారు. స్తంభాల కోసం పునాదుల తవ్వకం మొదలు పెట్టారు. ఇది పురావస్తు భూమి అంటూ మూడు రోజుల కిందట హడావుడి చేసిన అధికారులెవరూ ఇటువైపు కన్నెత్తి చూడలేదు. ప్రధాన రహదారి విస్తరణ సమయంలో రెండేళ్ల కిందట అప్పటి ఎమ్మెల్యే గణేష్ ఆదేశాల మేరకు ఇక్కడి దుకాణాలను వాటి యజమానులు స్వచ్ఛందంగా తొలగించారు. అప్పట్లో హడావుడిగా తొలగించినా ఇక్కడి వరకు రోడ్డును విస్తరించలేదు. విస్తరణకు మళ్లీ ప్రయత్నించినా అల్లూరి స్మారక ప్రాంతాల పరిరక్షణ సమితి సభ్యులు ఇది పురావస్తు భూమి అంటూ కలెక్టర్‌కు, ఇతర అధికారులకు ఫిర్యాదులు పంపడం, అధికారులొచ్చి హెచ్చరికలు చేస్తుండంతో ఇన్నాళ్లూ నిర్మాణాలు చేపట్టలేదు. సమితి ప్రతినిధులు మండల న్యాయసేవాధికార కమిటీ ద్వారా కోర్టు దృష్టికి తీసుకురావడంతో సీనియర్ సివిల్ జడ్జి పటాన్ షియాజ్‌ఖాన్ ఈ ప్రదేశాన్ని ఇటీవల అధికారులతో కలిసి పరిశీలించి వెళ్లారు. మూడు రోజుల కిందట కొందరు ఆకుపచ్చ మ్యాట్ కట్టడంతో కమిషనర్ సురేంద్ర సిబ్బందితో వచ్చి తొలగించారు. సమాధుల ప్రాంతాన్ని తామేమీ ఆక్రమించలేదు. దశాబ్దాలుగా తాము వ్యాపారాలు సాగిస్తున్న దుకాణాలను రోడ్డు విస్తరణ కోసం తొలగించాం. ఇప్పుడు అదే ప్రదేశంలో కట్టుకుంటామని కమిషనర్‌కు పలువురు తెలియజేశారు. ఏదైనా ఉంటే తహసీల్దారు మాట్లాడండి అంటూ వ్యాపారులకు స్పష్టం చేసి కమిషనర్ వెళ్లిపోయారు పనులు జరుగుతున్నా అల్లూరి స్మారక ప్రాంతాల పరిరక్షణ సమితి సభ్యులు, ఆయా శాఖల అధికారులు



ఇటువైపు రాలేదు.

**పురావస్తు సంపదగా నోటిఫికేషన్**

ఈ స్థలానికి సంబంధించి స్పష్టమైన స్కెచ్‌మ్యాప్, సరిహద్దుల సమాచారం పంపాలని పురావస్తు, మ్యూజియంల శాఖ సహాయ సంచాలకులు ఆర్.ఫల్గుణరావు పదిరోజుల కిందట తహసీల్దారు రామారావుకు లేఖ పంపారు. రెవెన్యూ అధికారుల నుంచి ఈ వివరాలు అందిన తర్వాత స్మారక చిహ్నాలు, పురావస్తు చట్టం–1960 ప్రకారం చర్యలు చేపట్టాల్సి ఉంది. పురావస్తు సంపదగా 2011 జనవరి 5న నోటిఫికేషన్ ఇచ్చినా ఆచరణపై అప్పటి అధికారులు శ్రద్ధ చూపలేదు. 1922–24 నడుమన బ్రిటిష్ పాలకులను సవాల్ చేస్తున్న మన్యం పితూరీని అణచి వేయడానికి అప్పటి ప్రభుత్వం గెరిల్లా యోధులైన సైనికాధికారులు లియోనెల్ నెవెల్లీ హైటర్, క్రిస్టోఫర్ విలియం స్కాట్ కవర్డ్‌లను రప్పించింది. వీరిని 1922 సెప్టెంబరు 24న దామనాపల్లి ఘాట్‌లో అల్లూరి వీరిని హతమార్చారు. మృతదేహాలను నర్సీపట్నం ఆర్అండ్‌బీ బంగ్లాకు సమీపంలో కేటాయించిన భూమిలో ఖననం చేసిన బ్రిటిష్ పాలకులు పాలరాతి సమాధులు నిర్మించారు. కాలక్రమేణా ఇక్కడ ఇళ్లు, దుకాణాలు వెలిశాయి. కొందరికి అప్పట్లో పట్టాలిచ్చారని చెబుతున్నారు.

# వడివడిగా ఉక్కు అడుగులు

నక్కపల్లి : పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న మండలంలో ప్రస్తుతం అందరి దృష్టి ఆర్సెలార్ మిత్తల్ ఉక్కు పరిశ్రమపైనే ఉంది. ఇది ఏర్పాటైతే వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలతోపాటు, దీని పరిసర ప్రాంతాలన్నీ ఆర్థికాభివృద్ధి దిశగా పరుగులు పెట్టనున్నాయి. తాజాగా రైల్వే లైను కోసం 111 ఎకరాలు కేటాయిస్తూ సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం ఎంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందనేది తెలుస్తోంది.

తెదేపా హయాంలోనే సిద్ధంచేసిన సుమారు 4,300 ఎకరాల భూముల్లో ఇప్పటికే 1800 ఎకరాల వరకు బల్క్ డ్రగ్ పార్కుకు ఇచ్చారు. ఈ ఏడాది జనవరిలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబునాయుడు ఈ పనులు ప్రారంభించారు. అప్పటి నుంచి ఇవి శరవేగంగా సాగుతున్నాయి. మరోవైపు ఉక్కు పరిశ్రమను రాష్ట్రానికి రప్పించడంలోనూ ప్రభుత్వం సఫలీకృతమైంది. దీనికోసం నక్కపల్లి మండలంలోనే రెండు వేల ఎకరాలకు పైగా కేటాయించడంతోపాటు దీని పనులు ప్రారంభానికి సంబంధించి అవసరమైన అనుమతులు ఇవ్వడానికి కేబినెట్‌లోనూ తీర్మానించారు. దీని తర్వాత నుంచి ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు వేగమయ్యాయి. ఇప్పటికే టౌన్‌షిప్ నిమిత్తం సుమా రు 500 ఎకరాలు, రెండో విడతలో అదనపు భూములకోసం మూడు వేల ఎకరాలకు పైగా అవసరం కాగా, ఆ దిశగా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. కొద్దిరోజుల క్రితం రెండోవిడత సేకరణ పనులు మొదలు పెట్టారు. ప్రస్తుతం రైతుల నుంచి దీనిపై అభ్యంతరాలు వస్తున్న నేపథ్యంలో వారితో చర్చించి ముందుకెళ్లేలా మంత్రి వంగలపూడి అనిత చర్చలు ప్రారంభించారు. మరోవైపు మిత్తల్ పరిశ్రమను వీలైనంత వేగంగా మొదలు పెట్టేలా మరో అడుగు ముందుకు వేసింది. ఆ మేరకు రైల్వే స్లైడింగ్‌కు (ప్రధాన లైను నుంచి పరిశ్రమలకు వేసే లైను) 111 ఎకరాలు కేటాయిస్తూ ఉత్తర్వులు వచ్చాయి.

గుల్లిపాడు నుంచే! ఉక్కు పరిశ్రమ ఏర్పాటైతే ఎగుమతులు, దిగుమతుల నిమిత్తం కచ్చితంగా అవసరమైన రవాణా సదుపాయం కావాలి. ప్రస్తుతం కేటాయించిన భూములు తీరప్రాంతాన్ని ఆనుకుని ఉండటంతో క్యాప్టివ్ పోర్టు ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. దీంతో పాటే ఇప్పుడు రైల్వే లైను ఏర్పాటుకు ముందుకు వచ్చింది. ఆ మేరకు 111 ఎకరాలను కేటాయించారు. ప్రస్తుతం నక్కపల్లి మండలానికి సంబంధించి గుల్లిపాడు రైల్వేస్టేషన్ ఉండగా, ఇక్కడ ప్యాసింజర్ రైళ్లు మాత్రమే ఆగుతాయి. ఈ స్టేషన్ అభివృద్ధి పనులు మూడేళ్ల క్రితం చేపట్టారు. ఇవన్నీ తుదిదశకు చేరుకుంటున్నాయి. ఉక్కు పరిశ్రమ ఏర్పాటైతే... దీనికి పది కిలో మీటర్ల లోపే ఈ స్టేషన్ ఉంటుంది. దీని ద్వారా ప్రత్యేక లైనువేసే అవకాశం ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. స్టేషన్ నుంచి లైను వేస్తే చినదొడ్డిగల్లు, వేంపాడు రెవెన్యూల పరిధిలోనే దాదాపుగా తీసుకోవచ్చని తెలిసింది. ఇప్పటికే ఈ ప్రాంతంలో దీనికి సంబంధించిన భూముల పరిశీలించినట్లు తెలియవచ్చింది. కాగా మధ్యలో జాతీయ రహదారి ఉండటంతో దీన్నెలా దాటిస్తారనేది సందేహంగా మారింది. జాతీయ రహదారి దాటే ప్రాంతంలో వాహనాల కోసం పై వంతెన వేస్తారని రైల్వే ఇంజినీర్ ఒకరు తెలిపారు.

# నేత్ర దానం.. వెలుగుల గమ్యం

ఎమ్మిగనూరు : ఎమ్మిగనూరుకు చెందిన హుసేని (54) గుండెపోటుతో బాధపడుతూ ఇటీవల సర్వజన వైద్యశాలలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఐ డొనేషన్ కౌన్సిలర్ శంకర్ ఆధ్వర్యంలో బాధితుడి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించడంతో నేత్రదానానికి సమ్మతించారు. దీంతో మృతుడి కార్నియాలను సేకరించి ఎల్‌వీ ప్రసాద్ ఐ బ్యాంకుకు పంపించారు.

జిల్లాలో నేత్రదానం చేసే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఏటా సుమారు 400 మంది కార్నియాలను సేకరిస్తున్నారు. నేత్ర సమస్యలతో బాధపడుతున్న వారికి అమర్చి వెలుగులు నింపారు. "ఈనెల 25 నుంచి సెప్టెంబరు 8 వరకు వరకు నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నాం.. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు విస్తృతంగా నిర్వహించి కళ్లు దానం చేసే వారి సంఖ్య పెంచేందుకు కృషి చేస్తాం" అని రెడ్‌క్రాస్ ఛైర్మన్ డాక్టర్ గోవిందురెడ్డి తెలిపారు.

**ఎవరి కళ్లు దానం చేయొచ్చు**

ప్రమాదవశాత్తు మృతి చెందిన ఆరోగ్యవంతులు, గుండె జబ్బులు,



ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో మృతి చెందిన వారు, సహజ మరణం పొందిన వారి నేత్రాలను దానం చేయొచ్చు.

ఏ వయసు వారి కళ్లయినా ఇవ్వవచ్చు కళ్లద్దాలు ధరించే వారు, మధుమేహం, రక్తపోటు రోగులూ మరణానంతరం తమ నేత్రాలను దానం చేయొచ్చు.క్యాన్సర్‌తో బాధపడుతన్న వారు, నల్లగుడ్డు దెబ్బతిన్న వారు, ఎయిడ్స్ రోగులు, కామెర్లు, పిచ్చికుక్క కాటుతో మరణించిన వారు అనర్హులు.

**అపోహలు.. వాస్తవాలు**

నేత్రదానం 15- 20 నిమిషాల్లో పూర్తయ్యే అతి సామాన్య ప్రక్రియ. అంధులకు కార్నియా (నల్లగుడ్డు)ను మాత్రమే అమరుస్తారు. మొత్తం కంటిని కాదు.ఒక వ్యక్తి మరణించిన తర్వాత 4 గంటల్లోపు అతని కార్నియా పొరను శస్త్రచికిత్స ద్వారా సేకరించి సక్రమంగా భద్రపరిస్తే ఇతరులకు చూపు ప్రసాదించవచ్చు.నేత్రదానానికి ఎవరైనా వాగ్దానపత్రం ఇచ్చినా వారి సమీప బంధువు ఆమోదం కూడా అవసరం అవుతుంది.

**ఎలా దరఖాస్తు చేయాలి**

నేత్రాలు దానం చేయాలనుకొనే వారు దరఖాస్తు పత్రాన్ని భర్తీ చేసి ప్రాంతీయ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో పనిచేస్తున్న జిల్లా అంధత్వ నివారణ సంస్థ, జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ కార్యాలయాల్లో అందజేయాలి. 18 సంవత్సరాల వయసు నిండిన వారి నుంచి మాత్రమే దాన పత్రం స్వీకరిస్తారు. ప్రాంతీయ కంటి ఆసుపత్రిలో కౌన్సిలర్ నంబరు 9640692299కు ఫోన్ చేస్తే సిబ్బంది వచ్చి నేత్రాలను సేకరిస్తారు.

# యువత మైకం.. భవిత శోకం

ఒంగోలు: చక్కగా చదువుకుంటూ భవితకు పునాదులు వేసుకోవాల్సిన వయసులో కొంతమంది విద్యార్థులు, యువత గంజాయి మత్తుకు బానిసైపోతున్నారు. అందరితోనూ కలివిడిగా ఉంటూ సరదాగా తిరగాల్సిన వీరిని మైకం కమ్మేస్తోంది. గంజాయి తాగడం తప్ప మరో దానిపై ధ్యాస పెట్టని వీరిని చూసి కన్నవారు కన్నీటిపర్యంతమవుతున్నారు. గంజాయికి అలవాటు పడిన తమ పిల్లలకు ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని వ్యసన విముక్తి కేంద్రం (డీ అడిక్షన్ సెంటర్)లో చికిత్స చేయిస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది 20 ఏళ్ల వయసువారే ఉండడం గమనార్హం.


ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని మానసిక వైద్య చికిత్స విభాగంలో గంజాయికి బానిసలైన వారికి వైద్యం అందించి సాధారణ స్థితికి చేరుకునేవిధంగా చేస్తున్నారు. వీరిని ఆసుపత్రిలో చేర్చుకుని రెండు వారాల పాటు వైద్యులు పర్యవేక్షిస్తున్నారు. మొదట్లో వ్యసనపరులు చికిత్సకు సహకరించకున్నా వైద్యులు మందులు ఇవ్వడంతో పాటు కౌన్సెలింగ్ ఇస్తూ వారిని దారిలోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. అత్యధిక కేసుల్లో మార్పు కనిపిస్తోంది. వీరు స్నేహితుల బలవంతం చేశారనో, ఇతరత్రా పరిస్థితుల ప్రభావంతో తిరిగి గంజాయి తాగితేపరిస్థితి మళ్లీ మొదటికొస్తుంది. ఇలా రెండు, మూడుసార్లు ఈ తరహాలో అలవాటు పడిన వారు ఆసుపత్రికి వచ్చి




చికిత్స పొంది సాధారణ జీవితం గడుపుతున్నారు.

గంజాయి వ్యసనపరుల్లో ఎక్కువగా 14 ఏళ్ల నుంచి 25 ఏళ్ల వయసు వారు ఎక్కువగా ఉంటున్నారు. పాఠశాల, కళాశాల స్థాయిల్లో గంజాయి తాగడం అలవాటు చేసుకుని డబ్బులు దొరక్కుంటే గంజాయి అమ్మడానికి వెనకాడటంలేదు. గంజాయికి బానిసలైతే చదువును మధ్యలో వది లేయడంతోపాటు ఏమాత్రం బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారు. కళ్లు ఎర్రగా ఉంటే అనుమానించాల్సిందే..: గంజాయి తాగేవారి కళ్లు ఎర్రగా ఉండి ఏ పని మీద దృష్టిపెట్టలేరు. ముందుగానే మేల్కొని చికిత్సకు తీసుకొస్తే వ్యసనం వారిని బయటపడేయొచ్చు. టోల్‌ఫ్రీ నంబరు 1933కు గానీ, నేరుగా ఆసుపత్రికి వచ్చి మమ్మల్ని గానీ సంప్రదించవచ్చు.సాగర్, మానసిక వైద్య నిపుణులు

# 'పచ్చి'మోసం



కర్నూలు : ఉల్లి వ్యాపారులు 'పచ్చి'మోసానికి పాల్పడుతున్నారు. ఉల్లిరైతుకు కన్నీరు తెప్పిస్తున్నారు. గతంలో ఎన్నడూలేనివిధంగా ఆగస్టు చివరి వారంలోనే రికార్డుస్థాయిలో కర్నూలు మార్కెట్‌కు దిగుబడులొచ్చాయి. ఒక్కరోజే 302 లాట్లు వచ్చాయి. సరకు నాణ్యత లేదని, పచ్చిగా ఉందని.. తేమశాతం ఎక్కువగా ఉండటంతో ఎక్కువ రోజులు నిల్వ ఉండదని కొర్రీలు పెట్టి పక్కన పడేశారు. 150 లాట్లకు వ్యాపారులు టెండరులో ధరలు కోట్ చేయలేదు.

**దిగుబడుల వరద.. ధర'దడ'**

జులై నెల నుంచి మార్కెట్‌కు ఉల్లి దిగుబడులు అమ్మకానికి వస్తున్నాయి. నెల రోజులుగా మార్కెట్‌కు రోజుకు 150- 300 క్వింటాళ్లలోపే రైతులు తీసుకొస్తున్నారు. క్వింటా గరిష్ఠ ధర రూ.1,100 ఉండగా సగటున రూ.600- రూ.800 వరకు పలుకుతోంది.

రైతులు 28,673 ప్యాకెట్లలో 12,903 క్వింటాళ్ల సరకు తెచ్చారు. నాణ్యత లేదని.. పచ్చిగా ఉందంటూ వ్యాపారులంతా సిండికేట్‌గా మారి కొంత సరకును తక్కువ ధరకు కొనుగోలు చేసి మిగిలిన దానికి ధరనే నిర్ధారించలేదు. క్వింటా ఉల్లి కనిష్ఠ ధర రూ.501, మధ్యస్థం రూ.1,075, గరిష్ఠ ధర రూ.1,329 పలికింది. సగం లాట్లను వ్యాపారులు కొనుగోలు చేయలేదు.

**గద్దల్లా వాలిన దళారులు**

లైసెన్స్‌డ్ వ్యాపారులు ఉల్లిని కొనుగోలు చేయకపోవడంతో దళారులు, అనధికారిక వ్యక్తులు మార్కెట్‌లో గద్దల్లా వాలిపోతున్నారు. రైతుల నుంచి క్వింటా రూ.200, రూ.300, రూ.400కు కొనుగోలు చేస్తున్నారు. ఎవరికి వారు మార్కెట్‌యార్డులో కొనుగోలు చేస్తున్నా మార్కెట్ కమిటీ అధికారులు పత్తాలేకుండా పోయారు.

**కన్నెత్తి చూడని అధికారులు**

వ్యాపారులంతా సిండికేట్ అయ్యి సగం దిగుబడులు కొనుగోలు చేయకపోవడం గమనార్హం. వ్యాపారులతో మాట్లాడి మొత్తం సరకును కొనుగోలు చేసేలా ఒప్పించాల్సిన అధికారులు కార్యాలయం నుంచి బయటికి రాకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కర్నూలు వ్యవసాయ మార్కెట్‌కు వచ్చిన జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య.. మార్కెట్ కమిటీ సెక్రెటరీ, వ్యాపారులతో సమావేశమై వెళ్లిపోయారు. దిగుబడుల వైపు చూడకుండా.. తమతో మాట్లాడకుండానే వెళ్లిపోయారని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్యాకెట్ రూ.వందకు అడుగుతున్నారు**

ఐదెకరాల్లో ఉల్లి సాగు చేశా. మొదటి విడతగా ఒక ఎకరా దిగుబడులు 70 ప్యాకెట్లను కర్నూలు మార్కెట్‌కు తీసుకొచ్చా కోత కోసి, గ్రేడింగ్ చేయించి, మార్కెట్‌కు తెచ్చేందుకు రూ.34 వేలు ఖర్చయింది. ఎకరా పంట సాగుకు రూ.70 వేల వరకు పెట్టుబడి పెట్టా. మార్కెట్‌లో అమ్ముదామంటే ఈ-నామ్‌లో వ్యాపారులు సరకు బాగాలేదని కొనుగోలు చేయలేదు. దళారులు వచ్చి ప్యాకెట్ రూ.వందకు ఇస్తావా అని అడుగుతున్నారు. తెచ్చిన సరకంతా అమ్మినా రూ.7 వేలు కూడా రాని పరిస్థితి. పెద్ద రంగన్న, బస్తిపాడు

# ఎవరి'దారి' వారిదే



నంద్యాల : రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం రూ.కోట్ల నిధులు విడుదల చేస్తోంది. ప్రజల కష్టాలు తీర్చేలా చర్యలు చేపట్టింది. మరోవైపు పనులకు అడుగడుగునా ఆటంకాలు ఎదురవుతున్నాయి. తమకు నచ్చిన విధంగానే పనులు జరగాలని నాయకులు.. అస్మదీయ గుత్తేదారుడే చేయాలని అధికారులు పట్టుబడుతుండడంతో నిర్మాణాలు ఆగిపోతున్నాయి. నిధులు మురిగిపోయే పరిస్థితి ఏర్పడింది. మరోవైపు గుంతల రహదారులపై ప్రయాణించలేక జనం ఇబ్బందులు పడుతున్నారు.ఆళ్లగడ్డ నియోజకవర్గ పరిధిలోని రుద్రవరం-నర్సాపురం మెట్ట రోడ్డు గుంతలమయంగా మారడంతో రహదారి నిర్మాణానికి రెండేళ్ల కిందట నిధులు కేటాయించారు. సెంట్రల్ రోడ్డు ఫండ్ కింద మొత్తం 50 కి.మీ. పొడవునా చాగలమర్రి నుంచి మహదేవపురం వరకు రహదారి అభివృద్ధికి రూ.32.5 కోట్లు మంజూరయ్యాయి. 32.5 కి.మీల పొడవునా పూర్తి చేశారు. కేవలం 8 కి.మీ. మేర ఆగిపోయాయి. రూ.8 కోట్ల విలువైన ఈ పనుల విషయమై గుత్తేదారుడికి.. ఓ నేతకు మధ్య సఖ్యత కుదరలేదు. 'ఒప్పందం' విషయంలో పేచీ పడడంతో ఏడాదికిపైగా పనులు ఆగిపోయాయి. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

**వారు సై అంటేనే..**

ఆర్‌అండ్‌బీ పనుల్లో నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ప్రజాప్రతినిధులు 'సై' అంటే పని.. లేకుంటే లేదు అనేలా పరిస్థితి మారింది. ఇదే సమయంలో కొందరు అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ప్రజాప్రతినిధులకు తప్పుడు సమాచారమిచ్చి పనులు జరగకుండా చేస్తున్నారు. పాణ్యం మండలం కొణిదేడు గ్రామ సమీపంలో ఇటీవల ఏర్పాటుచేసిన వంతెన వద్ద సర్వీసు రోడ్డు నిర్మించాల్సి ఉండగా గుత్తేదారుడు ఆ పనులు చేయలేదు. తనకు ఇదే ఒప్పందంపై మరో పని అప్పగిస్తే తప్ప చేయనని మొండికేశారు. గుత్తేదారుడిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఆ పని చేయకపోగా ప్రజాప్రతినిధుల అనుమతితో మరో పని కట్టబెట్టేందుకు యత్నిస్తున్నారు. జిల్లాలోని వివిధ నియోజకవర్గాల్లో అవసరమైన రహదారులకు ప్రతిపాదనలు కాకుండా తమకు 'నచ్చిన' రహదారులకు ప్రతిపాదనలు, నిధులు మంజూరు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

**నిత్యం చక్రం తిప్పుతూ..**

నంద్యాల కలెక్టరేట్ ఆనుకుని వెళ్లే బొమ్మలసత్రం-నూనెపల్లె జాతీయ రహదారిని నాలుగు వరుసలుగా అభివృద్ధి చేయడంతోపాటు డివైడర్లు, ఇరువైపులా కాలువల నిర్మాణానికి రూ.13 కోట్లు మంజూరయ్యాయి. ఎండీఆర్ కింద మంజూరైన ఈ పనులను అంచనా వ్యయం కన్నా 4.1 శాతం ఎక్కువకు గుత్తేదారుడు తీసుకుని రూ.2.6 కోట్ల విలువైన పనులు చేశారు. ఈ ప్రాంతంలో ఆక్రమణలు తొలగించకపోవడంతో పనులు ఆగిపోయాయి. ప్రస్తుతం ఈ పనులను అస్మదీయ గుత్తేదారుడికి ఇచ్చేందుకు ఉన్నతాధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. వైకాపాకు చెందిన ఒక గుత్తేదారుడికి పనులు ఇచ్చేలా పావులు కదుపుతున్నారు. దీనిని ఓ ప్రజాప్రతినిధి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దీంతో ఈ పనులు ప్రశ్నార్థకంగా మారిపోయాయి.నంద్యాల పట్టణంలోని శ్రీనివాసనగర్-సంజీవనగర్ ప్రధాన రహదారిని నాలుగు వరుసల సీసీ రహదారిగా నిర్మించేందుకు రూ.4.5 కోట్లతో టెండర్లు పిలిచారు. దీనిని చేసేందుకు నలుగురు గుత్తేదారులు పోటీ పడ్డారు. నిబంధనల ప్రకారం వీరిలో తక్కువ మొత్తానికి వేసిన గుత్తేదారుడికి పనులు అప్పగించాల్సి ఉంది. అస్మదీయ గుత్తేదారుడికి ఈ పనులు రాలేదని 'అగ్రిమెంట్'ను అధికారులు ఆపేశారు. ప్రస్తుతం దీనిని రద్దు చేసేలా ప్రయత్నిస్తున్నారు.

# ప్రవేశాలు పెరిగాయ్!

ఒంగోలు: జిల్లాలో 24 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు నడుస్తున్నాయి. ఇవి పేద, సాధారణ మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు కొండంత అండగా నిలుస్తున్నాయి. కార్పొరేట్ కళాశాలలతో సమానంగా బోధన, సౌకర్యాలు మెరుగుపరచడంతో ఆదరణ పెరుగుతోంది. వీటిల్లో చేరే వారిలో గ్రామీణ ప్రాంతాలకు చెందినవారే ఎక్కువగా ఉంటున్నారు. ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ఈ ఏడాది ఐఐటీ, నీట్ తదితర పరీక్షలకు సంబంధించి మెటీరియల్ (విద్యా సామగ్రి) ఉచితంగా అందిస్తున్నారు. దీంతోపాటు విద్యార్థులపై అధ్యాపకులు ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు. ప్రవేశ పరీక్షలకు సంబంధించి ఎలా బోధించాలనే దానిపై ప్రతి ఆదివారం ఒక్కో సబ్జెక్టు నిపుణులతో అధ్యాపకులకు అవగాహన కల్పిస్తున్నారు.కళాశాలల్లో అధ్యాపకుల కొరత లేకుండా ఎక్కడైనా ఉద్యోగ విరమణ చేసినప్పుడు ఖాళీలు ఏర్పడితే వారి స్థానంలో ఒప్పంద అధ్యాపకులను నియమిస్తున్నారు. ప్రయోగ పరీక్షలకు సంబంధించి రసాయనాలు అందుబాటులో ఉంచుతున్నారు. నిధుల రాక కోసం ఎదురుచూడకుండా అవసరమనుకుంటే అత్యవసర నిధితో కొనుగోలు చేస్తున్నారు. పల్లె ప్రాంతాల్లో అమ్మాయిలను చదువు కోసం సుదూర ప్రాంతాలకు పంపలేని వారు స్థానికంగా ఉన్న కళాశాలల్లో చేర్పిస్తున్నారు.

అబ్బాయిలతోపాటు అమ్మాయిల సంఖ్య పెరుగు తూ వస్తోంది. కళాశాలల నిర్వహణ ఎలా ఉంది.. పరీక్షలు ఎలా జరుగుతున్నాయి.. తదితర అంశాలపై ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు ప్రతి వారం విధిగా తనిఖీలు చేయాలని బోర్డు ఉన్నతాధికారులు సూచిస్తున్నారు. ఎప్పటికప్పుడు లోపాలు చక్కదిద్దాల్సిందిగా చెబుతుండడంతో పర్యవేక్షణ మెరుగుపడింది.

**పేద విద్యార్థులకు భరోసా** కళాశాలల్లో చదివే పేద విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, తల్లికి వందనం పథకాలు భరోసానిస్తున్నాయి. పేద విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఉత్తీర్ణత శాతం పెరుగుదలకు కృషి చేయడంతోపాటు విద్యార్థులను ఇంటర్మీడియట్ అనంతరం ప్రవేశ పరీక్షలకు సిద్ధం చేస్తున్నాం. ఆంజనేయులు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి

# మాపై క'రుణ'చూపండి!

ఒంగోలు: బీసీ కార్పొరేషన్ ద్వారా జిల్లాలోని బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు, మేదర, కుమ్మరి, శాలివాహన తదితర సామాజిక వర్గాలకు చెందిన పేదలకు స్వయం ఉపాధి నిమిత్తం గత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం యూనిట్లు మంజూరు చేసింది. అయిదేళ్ల అనంతరం యూనిట్లు మంజూరు కావడంతో దరఖాస్తులు అధిక సంఖ్యలోనే వచ్చాయి. మంజూరైన యూనిట్లకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేసి బ్యాంకర్ల ద్వారా రుణ మంజూరు పత్రాలు కూడా ఇచ్చారు. వాటి గ్రౌండింగ్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రాయితీ నగదు విడుదల కాకపోవడంతో నాలుగు నెలలకుపైగా లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు.

**2,069 యూనిట్లు...12,675 దరఖాస్తులు**

2019-24 మధ్య వైకాపా ప్రభుత్వ పాలనలో ఈబీసీలకే కాదు...ఎస్సీ, ఎస్టీ, బీసీతో పాటు అగ్రవర్ణ పేద వర్గాలకు ఒక్క స్వయం ఉపాధి యూనిట్ కూడా మంజూరు చేయలేదు. దీంతో ఆయా వర్గాల యువత ఉపాధి యూనిట్ల మంజూరు నిమిత్తం ప్రైవేటు వ్యాపారులు లేదా వాణిజ్య బ్యాంకులను ఆశ్రయించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్నికల హామీల్లో భాగంగా కార్పొరేషన్లను గాడిలో పెట్టేందుకు ప్రణాళిక రూపొందించింది. ఇందులో భాగంగా వెనుకబడిన తరగతుల (బీసీ) ప్రజలకు వెన్నుదన్నుగా ఉండేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా బీసీలతోపాటు అగ్రవర్ణ పేదలకు కూడా జీవనోపాధుల నిమిత్తం రాయితీపై బ్యాంకు అనుసం




ధానం కింద రూ.కోట్లు రుణాల రూపంలో ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాకు 2,069 యూనిట్లు..రూ.49.65 కోట్లు మంజూరు లక్ష్యం కాగా నిర్దేశించింది,. ఇందుకు రెండు నెలలపాటు దరఖాస్తులు స్వీకరించగా మొత్తం 12,675 వచ్చాయి.

**1,070 మందికి బ్యాంకు రుణం**

2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తాజాగా ఆర్థికంగా వెనుకబడిన అన్ని సామాజిక వర్గాల పేదలకు రాయితీ రుణాలు అందించే క్రమంలో ఆరు రంగాలను ప్రాధాన్యంగా తీసుకుంది. మహాత్మ జ్యోతిబాపూలే జయంతిని పురస్కరించుకుని ఏప్రిల్ 11న ఒంగోలులోని కలెక్టరేట్‌లో స్వయం ఉపాధి యూనిట్ల మెగా గ్రౌండింగ్ మేళా నిర్వహించారు. ఆ రోజున తొలి విడతగా 611 మందికి రూ.16.24 కోట్ల మేర మంజూరు చేసినట్లు ప్రకటించారు. ఆ తర్వాత ఎంపిక చేసిన వారితో కలిపి ఇప్పటివరకు మొత్తం 1,070 మందికి రూ.32.64 కోట్లు మంజూరుకు బ్యాంకర్లు ఆమోదించారు. రాయితీ 40 శాతం ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఇంతవరకు ప్రభుత్వం నుంచి రాయితీ విడుదల కాలేదు. నిరుద్యోగులు యూనిట్లు ఎప్పుడిస్తారంటూ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు.

# రెవెన్యూ లీలలు ఇంతంత కాదయా..!

రాజమహేంద్రవరం : గత ప్రభుత్వంలో అక్రమాల వల్ల నష్టపోయిన బాధితులకు న్యాయం చేయాలని.. కూటమి ప్రభుత్వం అనేక సంస్కరణలు తెస్తుంటే.. క్షేత్రస్థాయిలో దీనికి భిన్నమైన పరిస్థితి ఏర్పడుతోంది. ప్రధానంగా గత రీసర్వే అనంతరం తలెత్తిన సమస్యల పరిష్కారంలో కొందరు తహసీల్దార్లు తీవ్ర జాప్యం చేస్తున్నారు. భూయజమానికి ప్రమేయం లేకుండా వేరే వారికి ఆన్‌లైన్‌లో బదలాయిస్తున్నారు. కొన్నింటిని వివాదాస్పద భూములుగా పేర్కొని నిషేధిత జాబితాలో చేర్చుతున్నారు.

రాజానగరం మండలం జి.యర్రంపాలెంలో 0.50 ఎకరాల భూమిని 2015లో రాజమహేంద్రవరం గ్రామీణానికి చెందిన రామారావు కొనుగోలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో రీ సర్వే అనంతరం ఎల్‌పీఎం 1156 కేటాయించారు. దస్త్రాలన్నీ తనవద్దే ఉన్నా, ఎవరికీ విక్రయించకపోయినా 2023లో అప్పటి అధికారులు వేరే వ్యక్తి పేరిట బదలాయించారని వాపోయారు. దీనిపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేయగా.. విచారణ అనంతరం వెబ్‌ల్యాండ్‌లో అర్జీదారు పేరు నమోదు చేయాలని తహసీల్దార్‌కు జేసీ చిన్నారాముడు జూన్‌లో ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికీ ఆ దిశగా చర్యలు లేకపోవడం గమనార్హం.

రాజానగరం మండలం పాలచర్లలో తనకున్న 0.83 ఎకరాలను వేరే వ్యక్తికి 0.46 ఎకరాలు కేటాయిస్తూ స్థానిక రెవెన్యూ అధికారులు డి.పట్టా మంజూరు చేశారని కొత్త సత్యనారాయణ ఇటీవల ప్రజాఫిర్యాదుల విభాగంలో ఫిర్యాదు చేశారు. దీనిపై ఎటువంటి వివాదం లేకున్నా 22ఏ నిషేధిత జాబితాల్లో చేర్చడంతో ఇబ్బందులు



పడుతున్నామన్నారు. దివాన్‌చెరువు ఫ్లైఓవర్‌కు సంబంధించి చేపట్టిన భూసేకరణ విషయంలోనూ వివాదం నెలకొంది. గతంలో సేకరించి పరిహారం చెల్లించిన భూమికంటే ఎక్కువ విస్తీర్ణం భూమిని స్వాధీనం చేసుకుంటున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై రీసర్వేకు ఆర్డీవో ఆదేశించారు.

గోపాలపురం మండలం పరిధిలోని ఓ గ్రామంలోని వ్యక్తికి అయిదెకరాల భూమి ఉండగా.. అతనికి తెలియకుండా మరో వ్యక్తి పేరిట ఆన్‌లైన్‌లో బదలాయింపు జరిగింది. దీనిపై ఫిర్యాదు అందడంతో విచారణకు కలెక్టర్ ఆదేశించినట్లు తెలిసింది. ఇందులో కొందరు అధికారులు ప్రమేయం ఉన్నట్లు తెలుస్తోంది.

గోపాలపురం మండలంలో ఓ విశ్రాంత ఆర్మీ జవాన్‌కు అయిదెకరాల భూమి కేటాయించినట్లు నమ్మించి నకిలీ దస్త్రాలు సృష్టించారు. దీనికిగాను రూ.14 లక్షలు వసూలు చేశారు. దీనిలో డీటీతోపాటు మరికొందరు సిబ్బంది, ప్రైవేటు వ్యక్తులున్నట్లు విచారణలో తేలింది. రెవెన్యూ అధికారి, సిబ్బందిపై చర్యలు తీసుకున్నారు.

# విషం వడ్డిస్తున్నారు!



అనంతపురం: రోజుల తరబడి నిల్వ ఉంచిన మాంసం, నాసిరకం నూనెలతో వంటకాలు... పాడైపోయిన కూరగాయలు, పురుగులు పట్టిన పప్పుదినుసులతో తయారుచేసిన ఆహార పదార్థాలు.. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లలో జరుగుతున్న తతంగం ఇది. కొందరు యజమానులు ధనార్జనే ధ్యేయంగా కల్తీ ఆహారాన్ని జనాలకు అంటగడుతూ జేబులు నింపుకొంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా హానికర రసాయనలు, మోతాదుకు మించి రంగులు వినియోగిస్తూ ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఆహార భద్రతా అధికారులు కేసులు పెట్టి శిక్షలు విధిస్తున్నా కొందరు నిర్వాహకుల్లో మార్పు కనిపించడం లేదు.

అనంత నగరం గుత్తిరోడ్డులోని వినాయక హోటల్‌లో ఓ వినియోగదారు శీతలపానీయం కొన్నారు. బాటిల్‌ను పరిశీలిస్తే కాలం చెల్లిందిగా తేలింది. ఆహార భద్రతా అధికారులు తనిఖీలు చేయగా అక్కడ ఉన్న బాటిళ్లు అన్నీ కాలం చెల్లినవిగా తేల్చారు. దీంతో హోటల్ యజమానిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. కదిరిలోని అరబిక్ రెస్టారెంట్‌కు వచ్చినవారు ఆహార పదార్థాలు తినగా మిగిలిపోయిన వాటిని మరుసటిరోజు మళ్లీ వేడి చేసి.. కొత్తవారికి వడ్డించినట్లు అధికారుల తనిఖీల్లో బయటపడింది. నాణ్యతలేని మాంసాన్ని వంటల్లో వాడుతున్నట్లు గుర్తించారు. రెస్టారెంట్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేశారు.
అనంతపురం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఓ రెస్టారెంట్‌లో పురుగులు పట్టిన శనగల్ని వంటల్లో వాడుతున్నట్లు అధికారుల తనిఖీల్లో బయటపడింది.

**మిగిలింది వేడి చేసి..**

రోజూ వండిన ఆహారాన్ని మరుసటి రోజు వేడి చేసి తింటే అది విషంగా మారుతుంది. అలాంటిది కొన్ని రెస్టారెంట్లలో మాంసాన్ని రోజుల తరబడి నిల్వ చేస్తున్నారు. మిగిలిపోయిన వంటకాల నుంచి మాంసం ముక్కలను వేరు చేసి ఫ్రిజ్‌లో పెట్టేస్తున్నారు. మరుసటి రోజు వాటినే వినియోగిస్తున్నారు. దీనివల్ల ఆయా రెస్టారెంట్లల్లో తిన్న పిల్లలు, వృద్ధులు, గర్భిణులు అనారోగ్యం బారిన పడుతున్నారు. 70 శాతానికి పైగా హోటళ్లలో నాణ్యమైన నూనె వాడటం లేదు. అదే నూనెను అనేకసార్లు వినియోగిస్తూ ఆహారాన్ని విషతుల్యం చేస్తున్నారు. బిర్యానీ, కబాబ్, స్వీట్లల్లో హానికర రంగులు కలిపి ప్రజల ఆరోగ్యానికి ముప్పు తెస్తున్నారు.

**ఈ ఏడాదిలో కల్తీ ఆహారంపై నమోదైన కేసులు**

అనంతపురం జిల్లా : 24
శ్రీసత్యసాయి.. : 25

**నాణ్యతాప్రమాణాలు పాటించకపోతే కఠినచర్యలు: తస్లిమా, ఫుడ్ ఇన్‌స్పెక్టర్, అనంతపురం**

మాంసాన్ని నిర్ణీత ప్రమాణాల మేరకు మాత్రమే నిల్వ చేయాలి. చాలామంది సాధారణ ఫ్రిజ్‌లో పెట్టేసి రోజుల తరబడి నిల్వ చేస్తున్నారు. దీనివల్ల కొన్ని గంటల్లోనే మాంసం చెడిపోవడం ప్రారంభమవుతుంది. దాంతో వంటలు చేస్తే అది విషంగా మారే ప్రమాదం ఉంది. నాణ్యత విషయంలో కఠినంగా వ్యవహరిస్తున్నాం. నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాతో పాటు కేసులు నమోదు చేస్తున్నాం.

# కాగితాల్లోనే విద్యుత్తు ఉపకేంద్రాలు



గుత్తి : గుత్తి విద్యుత్తు సబ్‌డివిజన్‌లో కొత్తగా విద్యుత్తు ఉపకేంద్రాల ఏర్పాటు అందని ద్రాక్షగా మారింది. ఉపకేంద్రాల ఏర్పాటు కాగితాలకే పరిమితమైంది. ఇవి గత ప్రభుత్వ హయాంలోనే మంజూరయ్యాయి. అప్పటి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ప్రస్తుతం కేంద్రాల ఏర్పాటులో తీవ్ర జాప్యం జరుగుతోంది. కేంద్రాల ఏర్పాటుకు రైతులు, ప్రజలు నిరీక్షిస్తున్నారు.
గుత్తి సబ్‌డివిజన్‌లో అదనపు విద్యుత్తు ఉపకేంద్రాల నిర్మాణాలు చేపట్టకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. ఏడాదికేడాది విద్యుత్తు వినియోగం పెరుగుతోంది. విద్యుత్తు అవసరాలకు అనుగుణంగా ఉపకేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. గుత్తి, ధర్మాపురం, ఖాదర్‌పేట, పామిడి పట్టణాలకు ఉపకేంద్రాలు మంజూరయ్యాయి. సబ్‌డివిజన్‌లో రోజుకు రెండు మిలియన్ యూనిట్లు విద్యుత్తు వినియోగం ఉంటోంది. వ్యవసాయ కనెక్షన్లు 8 వేల వరకు ఉన్నాయి. గృహోపయోగ సర్వీసులు 22 వేలు ఉన్నాయి. రైతులు నిరంతరం బోర్లు తవ్వుకుంటూ విద్యుత్తు కనెక్షన్లు తీసుకుంటున్నారు.

**అప్పటి అంచనాలే దిక్కు..**

ఎప్పుడో 30 ఏళ్ల కిందట అప్పటి అవసరాలకు అనుగుణంగా విద్యుత్తు ఉపకేంద్రాలను ఏర్పాటు చేశారు. అప్పట్లో ఏర్పాటు చేసిన నియంత్రికలపై విద్యుత్తు లోడు అధికంగా ఉంటోంది. ఫలితంగా తరచూ నియంత్రికలు కాలిపోతున్నాయి. పైగా విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతోంది. విద్యుత్తు సరఫరాను అధికారులు మెరుగుపరచాలని రైతుల నుంచి డిమాండ్ ఉంది. ధర్మాపురం గ్రామంలో చిన్నపాటి గాలి వీచినా త్రీఫేస్ కనెక్షన్లు ట్రిప్ అవుతున్నాయని మాజీ సర్పంచి శ్రీనివాసులు వాపోతున్నారు. ఇలాంటి పరిస్థితి మిగిలిన అన్నీ ప్రాంతాల్లోనూ ఉందని ఆయా గ్రామాల రైతులు చెబుతున్నారు.

**స్థల సేకరణకే పరిమితం**

గుత్తి, పామిడి మండలాలకు మూడు సబ్‌స్టేషన్ల నిర్మాణానికి విద్యుత్తుశాఖ అధికారులు స్థలసేకరణ పూర్తి చేశారు. ఒక్కో గ్రామంలో సుమారు 50 సెంట్ల స్థలాన్ని సేకరించారు. ఒక్కో కేంద్ర నిర్మాణానికి రూ.1.50 కోట్లు వెచ్చించాల్సి ఉంది. మూడు కేంద్రాలకు గాను రూ.4.50 కోట్లు మంజూరైనా పనులకు టెండర్లు జరగడం లేదు.

ఉపకేంద్రాల మంజూరు : 03
నిధుల కేటాయింపు : రూ.4.50 కోట్లు
గృహ, వ్యవసాయ కనెక్షన్లు : 20 వేలు
స్థల సేకరణ విస్తీర్ణం : 1.50 ఎకరాలు

**త్వరలోనే పనులు ప్రారంభిస్తాం: సాయిశంకర్, డీఈఈ,గుత్తి**


గత ప్రభుత్వ హయాంలో మంజూరైన ఉపకేంద్రాల నిర్మాణాలు త్వరలోనే మొదలవుతాయి. నిర్మాణ విభాగం అధికారులు టెండర్లు నిర్వహించి పనులు చేయాల్సి ఉంది.

# మెప్మాలో మరో తిమింగలం

తిరుపతి : తిరుపతి నగరంలో మెప్మా ఆర్పీల అరాచకాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. మొన్న 26వ డివిజన్ ఆర్పీ సుజాత, నిన్న లక్ష్మీపురం ప్రాంత ఆర్పీ ..ఇలా కొంతకాలంగా వరుసగా రూ.30 లక్షలు నుంచి రూ.కోటి వరకు మహిళల పొదుపు, రుణ చెల్లింపుల సొమ్ము కాజేస్తున్న ఘటనలు బహిర్గతమవుతున్నాయి. తాజాగా నగరంలోని సంజయ్‌గాంధీ కాలనీ ప్రాంతంలో ఉన్న ఒక మెప్మా సమాఖ్యలోని మహిళా సంఘాలకు చెందిన రూ.60 లక్షల సొమ్ము ఆర్పీ నౌహీరా స్వాహా చేసినట్లు ప్రాథమికంగా తేలింది. సంఘ సభ్యుల పొదుపు నిల్వలు, రుణ చెల్లింపు సొమ్ము కలిపి రూ.కోటి వరకు మోసపోయామని బాధితులు, వారి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. నాలుగు రోజుల కిందట వెలుగులోకి వచ్చిన ఈ అక్రమంపై మెప్మా అధికారులు రహస్యంగా విచారణ చేస్తున్నారు.
నగరంలోని మెప్మా సంఘాల లావాదేవీలను థర్డ్ పార్టీ ఆడిటర్ల బృందం రెండున్నరేళ్ల నుంచి పరిశీలిస్తున్నాయి. తాము కూడా మోసపోయామంటూ పలు సంఘాల మహిళలు అధికారుల వద్ద మొరపెట్టుకుంటున్నారు.

**నేనే మోసపోయానంటూ సందేశం**

'నన్ను ఓ మహిళ మోసం చేసింది. మీడియాకు ఇచ్చినా, కేసులు పెట్టినా నేను ఏమి చేయలేను. మీ డబ్బు మీకు ఇచ్చేస్తా' అంటూ నాలుగు రోజులుగా కనిపించకుండాపోయిన ఆర్పీ నౌహీరా వాట్సప్




గ్రూపులో మెసేజ్ పంపింది.

**ఏం జరిగిందంటే..?**

సంజయ్‌గాంధీ కాలనీ ప్రాంతానికి చెందిన 40 సంఘాల బాధ్యతలను నౌహీరా అనే ఆర్పీకి అప్పగించారు. పలు సంఘాల మహిళలకు బ్యాంకు లింకేజీ రుణాలు రూ.20 లక్షల వరకు ఇప్పించింది. వారు వాయిదాల నగదు చెల్లించేందుకు ఉపక్రమించగా.. తాను బ్యాంకులో జమ చేస్తానని ఆ సొమ్ము తీసుకొని.. బ్యాంకు ముద్ర కూడా లేకుండా రసీదులు ఇచ్చేది. కొత్త రుణం కోసం వారు దరఖాస్తు చేయగా పాత బకాయిలు చెల్లించాలని బ్యాంకర్లు చెప్పడంతో విషయం బయటపడింది. ఆడిట్ ప్రక్రియ జరుగుతోందని, వారంలో పూర్తి వివరాలు తెలుస్తాయని మెప్మా సీఎంఎం కృష్ణవేణి తెలిపారు.

# సహకార స్థలం అన్యాక్రాంతం

పుట్టపర్తి: పరిగిలో ఏర్పాటైన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి చెందిన విలువైన స్థలం అన్యాక్రాంతమైంది. కొన్నేళ్లపాటు ఖాళీగా ఉన్న స్థలంలో కొందరు ఇతర అవసరాలకు ఉపయోగించుకునే నెపంతో ఆక్రమణలకు పాల్పడ్డారని సొసైటీ సభ్యులే ఆరోపిస్తున్నారు. పరిగి మండలం బీచిగానిపల్లి, హెన్నంపల్లి, పరిగి గ్రామాల్లో వ్యవసాయ పరపతి సంఘాలు ఏర్పాటయ్యాయి. దాతలు కె.నంజుండప్ప, ఆర్.ఆదినారాయణరెడ్డి, సి.అంజినప్ప సర్వే నంబరు 421-3ఏలో మొత్తం 18 సెంట్ల స్థలాన్ని 1981, ఏప్రిల్ 4న సొసైటీకి రాసిచ్చారు. పైడేటి సర్కిల్‌లో పెద్ద ఆంజనేయస్వామి గుడి పక్కనే ఈ స్థలం ఉంది. ప్రజాప్రయోజనాల దృష్ట్యా ఇచ్చినట్లు దాతలు పేర్కొన్నారు. అప్పటికే ఉన్న భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో ఈ స్థలంలో కొత్తది నిర్మించాలని ప్రయత్నాలు చేయగా ఆర్థిక ఇబ్బందుల కారణంగా మిన్నకుండిపోయారు.

**ఒక్కొక్కటిగా...** కొన్నేళ్లుగా స్థలం ఖాళీగా ఉండటంతో కొందరు గడ్డివాములు వేసుకున్నారు. మరికొందరు తమకు తాతల కాలం నుంచి అందులో కొంత స్థలానికి లింక్ డాక్యుమెంట్లు ఉన్నాయంటూ కరెంటు బిల్లులు, కుళాయి రశీదులు సంపాదించి పంచాయతీ నుంచి అసెస్మెంట్ నంబరు తీసుకున్నారు. ఈ వ్యవహారంలో పెద్దమొత్తంలో చేతులు మారినట్లు ఆరోపణలున్నాయి. దీంతో సొసైటీ సభ్యులు 2003లో హిందూపురం సీనియర్ సివిల్ జడ్జి కోర్టును ఆశ్రయించారు. పరిశీలించిన కోర్టు.. ఆక్రమణలు తొలగించాలని 2004లో ఆదేశాలిచ్చింది. స్థలం అనుభవదారులు 2008లో హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకు



న్నారు. ఈనేపథ్యంలో కొంత స్థలాన్ని కొందరు వ్యక్తులు గతేడాది హిందూపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ విషయంగా సొసైటీ సభ్యులు ఇటీవల కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు.

**రాజకీయ నాయకుల ఒత్తిళ్లు: బద్రీనాథ్, శ్రీరాములు, పరిగి**

ఆక్రమణలు తొలగించాలని కోర్టు ఆదేశాలు ఇచ్చినా సంబంధిత అధికారులు రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి ముందుకు రావడం లేదు. ఆక్రమార్కులు నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు స్పందించడం లేదు. జిల్లా కలెక్టర్‌కు పలుమార్లు ఫిర్యాదు చేశాం. ఇప్పటికైనా స్పందించి న్యాయం చేయాలి.

**లింక్ డాక్యుమెంట్లు ఉన్నాయి: పూజారి సత్యనారాయణ, పరిగి**

స్థలం ఆక్రమించుకోలేదు. అందులో 39/48 అడుగుల విస్తీర్ణంలో ఉన్న స్థలానికి సంబంధించి లింక్ డాక్యుమెంట్ ఉంది. ఇతరులు ఆక్రమించుకున్నారు. కొంత స్థలం ఖాళీగా ఉంది.

**తగిన చర్యలు తీసుకుంటాం: హసీనా సుల్తానా, పరిగి తహసీల్దార్**

గ్రామస్థుల నుంచి ఫిర్యాదు వచ్చిన వెంటనే 15 రోజుల కిందట ఆర్ఐ, వీఆర్ఓలను పంపించి అక్రమ నిర్మాణాలను నిలిపివేయించాం. సంబంధిత స్థలానికి సంబంధించిన ఆధారాలను పరిశీలించి.. తగిన చర్యలు తీసుకుంటాం.

# మీ ఇంటికి చెత్తసేకరణకు వస్తున్నారా..?

తిరుపతి : పారిశుద్ధ్య నిర్వహణకు ఏటా రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా క్షేత్రస్థాయిలో సరిగా అమలు కావడం లేదని భావించిన కూటమి ప్రభుత్వం ఇంటింటా చెత్త సేకరణ ఎలా జరుగుతోందని ఆరా తీస్తోంది. 'మేం ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి మాట్లాడుతున్నాం.. మీ ఇంటికి చెత్త సేకరణకు సిబ్బంది వస్తున్నారా..' అని అడుగుతోంది. 'వస్తుంటే 1 నొక్కండి.. రాకపోతే 2 నొక్కండి' అంటూ ఐవీఆర్ఎస్ విధానంలో అధికారులు అభిప్రాయాలు సేకరిస్తున్నారు. ఈ క్రమంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల పునరుద్ధరణతో పాటు వ్యర్థాల సేకరణ, నిర్వహణపై ప్రజల అభిప్రాయాలు తీసుకుంటోంది. వాటిని విశ్లేషించి ప్రతి మంగళవారం జరిగే పంచాయతీరాజ్ ఉన్నతాధికారుల సమావేశంలో వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నారు.



**ఉమ్మడి జిల్లాలో ఇదీ పరిస్థితి..**

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రెండు నగరపాలికలు, 10 పురపాలికలు, 1,411 పంచాయతీలు ఉన్నాయి. 2014-19 మధ్య అప్పటి తెదేపా హయాంలో ఉపాధి హామీ నిధులతో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిర్మించారు. వైకాపా హయాంలో వాటిని అటకెక్కించారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఈ కేంద్రాల నిర్వహణపై దృష్టి సారించింది. తడి, పొడి చెత్త, హానికర వ్యర్థాలు వేర్వేరుగా సేకరించేలా ప్రణాళిక రూపొందించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సర్వే చేస్తోంది. ప్రజలు అసంతృప్తి చెందితే పంచాయతీల్లో కార్యదర్శి, ఈవోపీఆర్డీలుబీ నగర, పురపాలికల్లో కమిషనర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కారణం చెప్పాల్సి ఉంటుంది. వారి సమాధానం సహేతుకంగా లేకుంటే నోటీసు ఇస్తారు.

# 21 కి.మీ. ప్రయాణం నరకమే..!

తిరుపతి : వెంకటగిరి- గూడూరు రహదారి ప్రమాదకరంగా మారింది. ఛిద్రమైన తారు రోడ్డులో పెద్దఎత్తున విస్తరించిన గుంతలతో ఈ మార్గంలో వెళ్లాలంటేనే వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. నిత్యం ఈ మార్గంలో పెద్దపెద్ద కంటైనర్లు సైతం వెళ్తుంటాయి. బంగారుపేట నుంచి బాలాయపల్లి సమీపంలోని వెంకటరెడ్డికాలనీ వరకు సుమారు 21 కి.మీ. ఈ దుస్థితి నెలకొంది. గుంతలు తప్పించే క్రమంలో పదుల సంఖ్యలో ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం జరిగినా గత వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదని.. కూటమి ప్రభుత్వం స్పందించి మరమ్మతులు పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

# ఆలయ భూముల్లో అక్రమాల సాగు

అంతర్వేది : ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటిగా వర్ధిల్లుతున్న అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి క్షేత్రపాలకుడిగా పార్వతీ నీలకంఠేశ్వరస్వామి పూజలు అందుకుంటాడు. స్వామివారికి వందలాది ఎకరాల భూములు ఉన్నా కౌలు సక్రమంగా రాని పరిస్థితి నెలకొంది. కొంతమంది కౌలురైతులు నిబంధనలకు విరుద్ధంగా ఆక్వా చెరువులు తవ్వేశారు. మరికొంతమంది అక్రమ కట్టడాలు నిర్మించి ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ఈ తతంగం యథేచ్ఛగా కొనసాగుతోంది. దీనిపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.
అంతర్వేదిలోని పార్వతీ నీలకంఠేశ్వరస్వామికి ఉభయ ఉమ్మడి గోదావరి జిల్లాల్లో రూ.కోట్ల విలువ చేసే 174 ఎకరాలు పల్లం, 191 మెరక మొత్తం 365 ఎకరాలు ఉన్నాయి. వీటిలో అధికారికంగా 742 మంది కౌలురైతులు ఉన్నారు. అనధికారికంగా(క్రయవిక్రయాలు చేయడంతో) మరో వందమంది వరకు ఉంటారని అంచనా. ఎకరాకు రూ.200 నుంచి రూ.1500, మూడు నుంచి ఆరు బస్తాల ధాన్యం వరకు కౌలు వస్తోంది. ధాన్యం, ధన రూపంలో సుమారు రూ.12 లక్షల వరకు వార్షిక ఆదాయం వస్తుంది. ఈ లీజులను కట్టడంలో కౌలు రైతులు అలసత్వం వహించడంతో సుమారు రూ.30 లక్షలపైనే బకాయిలు ఉండిపోయాయి.



**అక్రమంగా చెరువుల తవ్వకం**

స్వామివారికి చెందిన భూముల్లో అంతర్వేది, కేశవదాసుపాలెం, శృంగవరప్పాడు, గొంది ప్రాంతాల్లో అనుమతులు లేకుండా ఆక్వా చెరువులను తవ్వేశారు. వీటిని ఇతరులకు ఇచ్చి సుమారు రూ.40 వేల నుంచి రూ.60 వేల వరకు లీజు పొందుతున్నారు. అక్రమంగా 60 గృహాలు నిర్మించారు. వీటిపై ఏవిధమైన చర్యలు చేపట్టడం లేదు. దీనిపై భక్తులు ఆందోళన చెందుతున్నారు.

**చర్యలు చేపడతాం..**

అక్రమంగా తవ్విన చెరువులు, కట్టిన ఇళ్లపై చర్యలు చేపడతాం. దీనిపై ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ దృష్టికి తీసుకెళ్లాం. తదుపరి చర్యలు తీసుకుంటాం. -వరప్రసాద్, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీనరసింహస్వామి, పార్వతీ నీలకంఠేశ్వరస్వామి, అంతర్వేది

# కరుగుతూ.. కనుమరుగవుతూ

పి.గన్నవరం : ఏటా గోదావరి వరదల ప్రభావానికి నదీకోత కారణంగా జిల్లాలోని రైతులు భారీగా నష్టపోతున్నారు. విలువైన భూములు కోల్పోయి నిరుపేదలుగా మారిపోతున్నారు. జులై, ఆగస్టులో వచ్చిన వరదలకు నదీపాయల వెంబడి దాదాపు 20 ఎకరాల్లో కొబ్బరి తోటలు, లంకభూములు నీటిలో కలిసిపోయాయి.పి.గన్నవరం మండలంలోని బూరుగులంక, జి.పెదపూడిలంక, ఊడుమూడిలంక.. వైనతేయ తీరంలోని జొన్నల్లంక, మొండెపులంక, మానేపల్లి, పి.గన్నవరం, ఆర్.ఏనుగుపల్లి, వై.కొత్తపల్లి, కె.ఏనుగుపల్లి, కతార్లంకలో నదీ కోత ఎక్కువగా ఉంది. మామిడికుదురు మండలం అప్పనపల్లి, పెదపట్నంలంక.. గౌతమి తీరంలోని అయినవిల్లి మండలం వీరవల్లిపాలెం, అయినవిల్లిలంక, పొట్టిలంక..కె.గంగవరం మండలం కూళ్ల, సుందరపల్లిలోనూ తీవ్రత ఉంది. ప్రభుత్వం రివిట్‌మెంట్లు, గ్రోయిన్లు వంటివి ఏర్పాటుచేయాలని రైతులు వేడుకుంటున్నారు.

**కొబ్బరితోట పడిపోయింది**

మొండెపులంకకు చెందిన రైతు కొపనాతి ఠాగూర్‌కు గోదావరి చెంతన 50 సెంట్ల లంకభూమి ఉంది. కష్టపడి కొబ్బరి తోటగా తయారుచేశారు. గతంలో పది సెంట్ల భూమి నదిలో కరిగిపోయింది. ప్రస్తుతం మరో పదిసెంట్లు పోయిందని వాపోయారు. జొన్నల్లంకకు చెందిన కుడుపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ 1986 ఆగస్టు వరదల అనంతరం ఎకరం లంకభూమిని కొబ్బరితోటగా తయారు చేసినట్లు తెలిపారు. ఇంతవరకు 30 సెంట్లు గోదావరి పాలైందని తెలిపారు. బూరుగులంక వాసి డి.సత్యనారాయణదీ అదే వేదన. తనకున్న రెండెకరాలు గతంలోనే నదిలో కలిసిపోయిందని..భూమిలేని రైతుగా మిగిలానన్నారు.

**మట్టి వినాయకులనే పూజిద్దాం** వినాయక చవితి ఉత్సవాల్లో మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని కలెక్టర్ మహేష్‌కుమార్ సూచించారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలపై ఏర్పాటు చేసిన ప్రచార గోడపత్రికను ఆవిష్కరించారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్, ఇతర రసాయనాలతో తయారు చేసిన విగ్రహాల వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందన్నారు. జలచరాలు మృత్యు వాత పడతాయన్నారు. కాలుష్యనియంత్రణ మండలి అధికారిణి ప్రణీత పాల్గొన్నారు.

# తీరం.. ఖనిజ హారం

అల్లవరం : జిల్లాలోని సాగర తీరంలో అరుదైన ఖనిజ సంపద నిక్షిప్తమైంది. ఇటీవల వర్షాలు, వరదలకు సముద్రం ఒడ్డు వెంబడి నల్లటి తెట్టు బయటపడింది. ఇందులో విలువైన లోహ సంపద ఉందని నిపుణులు చెబుతున్నారు. కొండలు, గుట్టల నుంచి నదుల ద్వారా అత్యంత విలువైన లోహాల సముదాయంతో కూడిన ఒండ్రు మట్టి సముద్రంలోకి చేరుతుంటుంది. అలల తీవ్రత వల్ల తేలికపాటి ఖనిజాలు, మట్టి వేరుపడి సముద్రపు లోతుల్లోకి వెళ్లిపోతాయి. భార ఖనిజాలు మాత్రం ఒడ్డుకు చేరి ఇసుక తిన్నెలపై పలచగా ఏర్పడి నల్లని పొరగా కనిపిస్తాయి.

**ఈ రకాలు ఎక్కువ**రాష్ట్రంలోని సువిశాల సముద్ర తీరం వెంబడి అత్యంత విలువైన ఖనిజ నిక్షేపాలు అధికంగా పేరుకుంటున్నట్లు బీఎస్ఓఐ(బీచ్ శాండ్ ఆఫ్‌షోర్ ఇన్వెస్టిగేషన్) నిర్వహించిన పరిశోధనల్లో తేలింది. ప్రధానంగా ఇలమైట్, రుటైల్, జిరా?న్, మోనాజైట్, సిలిమనైట్, గార్నెట్ వంటి ఖనిజాలు తీరం వెంబడి నిక్షిప్తం అవుతున్నట్లు తేల్చింది. కోనసీమ పరిధిలో అల్లవరం, ఎస్.యానాం, అంతర్వేది, మలికిపురం, కాట్రేనికోన సముద్ర తీరం వెంబడి అధికంగా కనిపిస్తున్నాయి.

**ఏపీలోనే అధికం**అత్యంత విలువైన ఈ ఖనిజ నిక్షేపాలు దేశంలోని మూడింట ఒక వంతు మన రాష్ట్రంలోనే ఉన్నట్లు గనుల శాఖ అధికారులు తెలిపారు. 1996లో కేంద్ర ప్రభుత్వం బీచ్ శాండ్ మైనింగ్‌కు అవకాశం కల్పించింది. దీనిలో వచ్చే మోనోజైట్‌ను మాత్రం అటామిక్ ఎనర్జీ బోర్డుకు అందించాలన్న షరతు విధించింది. ఈ నిబంధనల్ని అతిక్రమించి విదేశాలకు విక్రయించడంతో మైనింగ్ లీజులు రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. అప్పటి నుంచి అనుమతులు ఇవ్వలేదు.ఇలమైట్: అల్యూమినియం కన్నా తేలిక ఇనుము కన్నా దృఢమైనది. దీనిని విమానాల తయారీకి వాడుతుంటారు. అధిక షైనింగ్ కలిగి ఉండటం వల్ల రంగులు, పిగ్మెంట్స్ తయారీకి, తుప్పు పట్టని కారణంగా ఓడలు, గోల్ఫ్ బాల్స్, హిప్ మార్పిడి పరికాల తయారీలో వినియోగిస్తారు.
జిరా?న్, మోనాజైట్: ఇవి ఎక్కువగా న్యూక్లియర్, అటామిక్ ఎనర్జీ రంగలో వాడుతుంటారు. జిరా?న్ ముడి ఖనిజాన్ని సిరామిక్, మోనాజైట్‌ను థోరియం తయారీలో వాడతారు. మోనాజైట్ ధాతువు విలువైన 15 ఖనిజాల సముదాయం ఉంటుంది. వీటిని లేజర్, ఎల్ఈడీ, ఎంఆర్ఐ స్కాన్ పరికరాల్లో వినియోగిస్తారు.
గార్నెట్: శాండ్ బ్లాస్టింగ్స్, వాటర్ ఫిల్టరేషన్‌కు వినియోగిస్తారు. ఎక్కువగా గల్ఫ్ దేశాలకు ఎగుమతి చేస్తుంటారు.
సిలిమనైట్: ఉక్కు పరిశ్రమలో ఏర్పాటు చేసే కొలుముల తయారీకి దీన్ని వినియోగిస్తారు. రీఫ్రాక్టరీ బ్రిక్స్ తయారులో వాడుతారు.
2017 నుంచి నిలుపుదల సముద్రపు తీరం వెంబడి కనిపించే నల్లని ఇసుకలో విలువైన ఖనిజాలు ఉంటాయి. దీనిని శుద్ధి చేస్తే 20శాతం వరకు అవి లభిస్తాయి. వీటిని ప్రాసెసింగ్ చేసేందుకు 2018 తర్వాత అనుమతులు ఇవ్వలేదు.- వంశీధర్‌రెడ్డి, భూగర్భ, గనులు, మైనింగ్ శాఖ అధికారి

## థైస్ అందాలతో తికమక పెడుతున్న ఆకాంక్ష సింగ్..!


ఈమధ్య కాలంలో హీరోయిన్స్ మరీ ఎక్కువగా అందాలు ఆరబోస్తూ ఆడియన్స్ ను అలరిస్తున్న విషయం తెలిసిందే. కొంతమంది బికినీలతో దర్శనమిస్తే.. మరికొంతమంది చిన్నచిన్న స్కర్ట్ వేస్తూ అందాలను బయటపెట్టేస్తున్నారు. ఇంకొంతమంది ట్రాన్స్పరెంట్ దుస్తులు ధరించి మరీ అందాలు ఆరబోస్తున్న విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా ఇక్కడ ఒక నటి స్కర్ట్ ధరించి.. థైస్ అందాలతో ఆడియన్స్ ను తికమక పెట్టేసింది. ముఖ్యంగా పికిల్ బాల్ టోర్నమెంట్ కి ఆహ్వానం పలుకుతూ ఈమె షేర్ చేసిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. ఆమె ఎవరో కాదు ఆకాంక్ష సింగ్.. చలనచిత్ర నటిగా తనకంటూ ఒక గుర్తింపును సొంతం చేసుకున్న ఈమె.. నటి మాత్రమే కాదు గాయని , రచయిత్రి కూడా. అంతే కాదండోయ్ ఫిజియోథెరపిస్ట్ కూడా.. తొలిసారి సీరియల్స్ ద్వారా కెరియర్ ను ఆరంభించిన ఈమె.. సుమారుగా 10 నాటక ప్రదర్శనలలో కూడా పాల్గొనింది. ముఖ్యంగా ఈమె తల్లి కూడా నాటక రంగ నటిగా గుర్తింపు తెచ్చుకోవడం గమనార్హం. 2018లో నటించిన 'మళ్లీ రావా' సినిమాకు గాను ఉత్తమ నటిగా సైమా అవార్డును సైతం



సొంతం చేసుకుంది. నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్గా ఉంటూ ప్రేక్షకులను అలరించే ఈమె తాజాగా..ఎల్లో అండ్ బ్లాక్ కాంబినేషన్లో మినీ స్కర్ట్ ధరించి థైస్ అందాలతో యువతను ఉక్కిరిబిక్కిరి చేసింది. పికిల్ టోర్నమెంట్ కి ఆహ్వానం పలుకుతూ షేర్ చేసిన ఈ ఫోటోలు చూసి అభిమానులు సైతం తట్టుకోలేకపోతున్నారు. ఏది ఏమైనా ఆకాంక్ష సింగ్ తాజాగా షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. ఆకాంక్ష సింగ్ కెరియర్ విషయానికి వస్తే.. రాజస్థాన్లోని జైపూర్ లో పుట్టింది. 2017లో తెలుగు చిత్రం మళ్ళీరావా సినిమాతో హీరోయిన్గా ఇండస్ట్రీకి పరిచయమైంది. ఆ తర్వాత దేవదాస్ అనే సినిమాలో కూడా నటించిన ఈమె.. పహిల్వాన్ అనే కన్నడ చిత్రంలో కూడా నటించింది. 2022లో రన్ వే 34 అనే హిందీ సినిమాతో ప్రేక్షకులను అలరించిన ఈమె.. ఈ ఏడాది విడుదలైన షష్టిపూర్తి అనే తెలుగు చిత్రంలో కూడా నటించింది. సినిమాలలోనే కాదు టెలివిజన్ సీరియల్స్ లో కూడా నటించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. 2012లో ' నా బోలే తుమ్ నా మైనే కుచ్ కహ' అనే సీరియల్ ద్వారా తెరకు పరిచయమైన ఆకాంక్ష.. అక్కడ నుంచి పలు సీరియల్స్ లో నటిస్తూ ప్రేక్షకులను అలరిస్తూ వచ్చింది. ఇకపోతే ఈ సీరియల్ లో ఉత్తమ నటన కనబరిచినందుకు గానూ ఈమె 2012లో బంగారు అవార్డులకు నామినేట్ కూడా అయ్యింది. అయితే 2012లో వచ్చిన ఇండియన్ టెల్లీ అవార్డుల్లో భాగంగా ఇదే సీరియల్ కి ఉత్తమ నూతన నటి విభాగంలో అవార్డ్ ను దక్కించుకోవడం గమనార్హం. 2018లో ఏడవ సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డులకు గానూ ఉత్తమ మహిళ అరంగేట్రం విభాగంలో మళ్లీ రావా చిత్రానికి కూడా నామినేట్ అయ్యింది ఆకాంక్ష సింగ్.

## ఆ ప్రముఖుడి పేరు లీక్ చేయకుండా దాస్తున్న సన్నీలియోన్

శృంగార తారగా ప్రపంచవ్యాప్తంగా పాపులారిటీ తెచ్చుకున్న సన్నీలియోన్ ఇప్పుడు పూర్తిగా ఆ ప్రపంచానికి దూరమైన సంగతి తెలిసిందే. బాలీవుడ్ లో తన కెరీర్ ని నిర్మించుకునేందుకు ఈ భామ తపించింది. దీనికి తన భర్త డేనియల్ వెబర్ పూర్తి సహకారం అందించారు. సన్నీలియోన్ ఇప్పటికే చార్ట్ బస్టర్ సింగిల్ ఆల్బమ్స్ లో నర్తించడమే గాక, బాలీవుడ్ లో పలు విజయవంతమైన చిత్రాల్లో నటించింది. టాలీవుడ్ సహా సౌత్ లోను సన్నీలియోన్ మెరుపుల గురించి తెలిసిందే. మంచు మనోజ్ %-%కరెంట్ తీగ%-% చిత్రంలోను సన్నీలియోన్ కీలక పాత్రలో నటించింది. సన్నీ మేని విరుపులకు తెలుగు యువత ఫిదా అయిపోయింది. అయితే ప్రత్యేక గీతాల స్పెషలిస్టుగా, నటిగాను పాపులరైన సన్నీలియోన్ అనూహ్యంగా తన కిడ్స్ కోసం బిగ్ బ్రేక్ కూడా తీసుకుంది. దత్తత తీసుకున్న చిన్నారితో పాటు సరోగసీలో జన్మించిన పిల్లల కోసం సన్నీలియోన్ మాతృమూర్తిగా బాధ్యతలు చేపట్టింది. తన జీవితంలో కీలక సమయాన్ని పిల్లల పెంపకం కోసం కేటాయించింది. తద్వారా



మాతృత్వంలోని ఆనందాన్ని ఆస్వాధిస్తోంది. సన్నీలియోన్ ఇంతకుముందే వ్యవస్థాపకురాలిగాను మారింది. స్టార్ స్టక్ పేరుతో సౌందర్య ఉత్పత్తుల రంగంలోకి ప్రవేశించింది. ఈ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వెలుగుతోంది. మరోవైపు సన్నీలియోన్ సొంత బ్యానర్ ప్రారంభించి, అందులో సినిమాలను కూడా నిర్మిస్తోంది. ప్రస్తుతం సినీ నిర్మాతగా విక్రమాదిత్య మోత్వానే దర్శకత్వం వహించే బయోపిక్ సిరీస్ను ప్రకటించింది. ఈ ప్రాజెక్ట్ తన భర్త డేనియల్ వెబర్తో కలిసి స్థాపించబడిన సన్సిటీ బ్యానర్ నిర్మిస్తుంది. విక్రమాదిత్య మోత్వానే సహ నిర్మాతగా వ్యవహరిస్తారు. ఒక అద్భుతమైన జీవితకథను వెబ్ సిరీస్ గా అందించడం ఉత్సాహం పెంచుతోందని సన్నీలియోన్ ఆనందం వ్యక్తం చేస్తోంది. నిజ ఘటనల ఆధారంగా ఈ సిరీస్ని రూపొందిస్తుండడంతో మోత్వానీ లాంటి సీనియర్ దర్శకుడు దీనిని ఉత్కంఠగా ఓటీటీ తెరపై చూపించగలరని సన్నీ నమ్మకాన్ని వ్యక్తం చేస్తోంది. అయితే తాను నిర్మించే వెబ్ సిరీస్ ఎవరి జీవితం ఆధారంగానో ఇంకా చెప్పలేదు. ఆ ప్రముఖుడి పేరును కనీసం రివీల్ చేయకుండా సన్నీ దాచేస్తోంది. అయితే బయోపిక్ కేటగిరీలో వెబ్ సిరీస్ అనగానే అందరిలో క్యూరియాసిటీ పెరుగుతుంది. ఆ రకంగా హైప్ పెంచాలనే ప్రయత్నం సఫలమవ్వాలంటే ప్రతి సన్నివేశం ఉత్కంఠను కలిగించేలా, గ్రిప్పింగ్ గా స్క్రీన్ ప్లేని ఎలివేట్ చేయడంలో మోత్వానీ పనితనం ప్రదర్శించాల్సి ఉంటుంది. వెబ్ సిరీస్ లకు ప్రపంచవ్యాప్తంగా రీచ్ ఉంటుంది గనుక నిర్మాతగా సన్నీలియోన్ పేరు, దర్శకుడిగా మోత్వానీ పేరు మార్మోగడం ఖాయం.




## అఖండ 2 నుండీ అదిరిపోయే అప్డేట్.. 600 మంది డాన్సర్స్ తో..



అఖండ.. బాలకృష్ణ - బోయపాటి కాంబినేషన్లో వచ్చిన హ్యాట్రిక్ మూవీ ఇది. ఊహించని విజయాన్ని సొంతం చేసుకొని.. ఈ కాంబినేషన్ కి మరింత పాపులారిటీ అందించింది. ఈ సినిమా తీసుకొచ్చిన విజయంతో ఈ సినిమా సీక్వెల్ పై అంచనాలు కూడా భారీగా పెరిగిపోయాయి. అలా ' అఖండ 2: తాండవం' అంటూ ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. వీరిద్దరి కాంబినేషన్లో రాబోతున్న నాలుగవ సినిమా కావడంతో అంచనాలు కూడా భారీగా పెరిగిపోయాయి. నిజానికి సెప్టెంబర్ 25వ తేదీన పవన్ కళ్యాణ్ 'ఓజీ' సినిమాకి పోటీగా ఈ సినిమాను బరిలోకి దింపుతున్నట్లు మేకర్స్ ప్రకటించినా.. ఆ తర్వాత కొన్ని కారణాలవల్ల సినిమాను వాయిదా వేస్తున్నట్లు.. ఈ సినిమా నిర్మాతలలో ఒకరైన బాలయ్య కూతురు తేజస్విని ఒక లాంగ్ నోట్ విడుదల చేస్తూ స్పష్టం చేసింది. ఇప్పుడు సంక్రాంతి బరిలో వచ్చే ఏడాది దింపబోతున్న విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా.. తాజాగా ఈ సినిమాకు సంబంధించి ఒక అదిరిపోయే అప్డేట్ అభిమానులలో గూస్ బంప్స్ తెప్పిస్తోంది. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం.. బాలకృష్ణతో పాటు 600 మంది డాన్సర్స్ తో ఒక భారీ మాస్ పాటను చిత్ర బృందం తాజాగా చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. భాను మాస్టర్ ఈ పాటకు కొరియోగ్రఫీ చేస్తున్నారు. అలాగే మ్యూజిక్ డైరెక్టర్ ఎస్.తమన్ ఒక రేంజ్ లో బిజిఎం, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నట్లుతెలుస్తోంది. అఖండ సినిమాలో " జై బాలయ్య" పాట ఎలా అయితే సూపర్ హిట్ అయిందో.. ఈ సినిమాలో ఈ పాట అంతకుమించి బిగ్ బ్యాంగర్ అవుతుందని మేకర్స్ భావిస్తున్నారు. ముఖ్యంగా బాలకృష్ణ స్టెప్స్ ఈ పాటలో ప్రత్యేకంగా ఉండనున్నాయని, ఈ పాట కోసం చాలా జాగ్రత్తగా ప్రణాళికలు రూపొందించినట్లు తెలుస్తోంది. అఖండ 2 సినిమా విషయానికి వస్తే.. ఎం తేజస్విని నందమూరి సమర్పణలో.. 14 రీల్స్ ప్లస్ బ్యానర్ పై రామ్ ఆచంట, గోపీ ఆచంట ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో ఆది పినిశెట్టి కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇందులో సంయుక్త హీరోయిన్గా నటిస్తూ ఉండగా హర్షాలీ మల్హోత్ర, ప్రముఖ సీనియర్ నటి శోభనతో పాటు ప్రగ్యా జైశ్వాల్ కూడా కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాలో హర్షాలీ మల్హోత్రా జననీ పాత్రను పోషిస్తుంది. ఈమె ఇదివరకే 'బజరంగీ భాయిజాన్' సినిమాలో మున్ని పాత్రతో భారీ పాపులారిటీ అందుకున్న విషయం తెలిసిందే. అటు శోభన ఇందులో సన్యాసి పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం. అంతేకాదు ప్రముఖ సీనియర్ హీరోయిన్ లయ కూతురు శ్లోక కూడా ఈ సినిమా ద్వారా వెండితెరపైకి అడుగులు వేస్తోంది. మొత్తానికైతే భారీ తారాగణంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ సినిమా బాలయ్యకు ఎలాంటి విజయాన్ని అందిస్తుందో చూడాలి.


## హౌస్ ఫుల్స్ పడుతుంటే.. ఓటీటీలోకి ఎందుకొస్తుంది?




పెద్ద పెద్ద సినిమాలే నెల రోజులు పూర్తి కాకముందే ఓటీటీలోకి వచ్చేస్తున్నాయి. థియేటర్లలో రిలీజయ్యాక సరిగ్గా నాలుగు వారాల గడువుతో ఓటీటీలో స్ట్రీమ్ చేస్తున్నారు. గత నెలలో రిలీజైన 'కూలీ'ని ఇలాగే డిజిటల్గా రిలీజ్ చేశారు. అలాంటపుడు కొత్త హీరో హీరోయిన్లు నటించిన ఓ చిన్న సినిమాకు నెల రోజుల్లోనే డిజిటల్ స్ట్రీమింగ్ ఉంటుందని ఆశించడం సహజం. 'లిటిల్ హార్ట్స్' సినిమా మీద ఇలాంటి ఆశలే పెట్టుకున్నారు ఓ వర్గం ప్రేక్షకులు. థియేటర్లలో అద్భుత స్పందన తెచ్చుకుంటున్న ఈ సినిమాను ఓటీటీలో చూసేందుకు ఆ వర్గం ఆడియన్స్ ఎదురు చూస్తున్నారు. సెప్టెంబరు 5న ఈ చిత్రం థియేటర్లలో విడుదలైంది. అక్కడ్నుంచి నాలుగు వారాల గ్యాప్ పెట్టుకుని అక్టోబరు 2న ఈ చిత్రాన్ని ఈటీవీ విన్లో డిజిటల్గా రిలీజ్ చేసేస్తున్నట్లు ఒక పోస్టర్ రెడీ చేసి వదిలారు సోషల్ మీడియాలో. ఆ పోస్టర్ చూసి అందరూ నిజమే అనుకున్నారు. కానీ ఈటీవీ విన్ ఎక్స్ హ్యాండిల్ నుంచి ఇది ఫేక్ అని పోస్ట్ పడింది. థియేటర్లలో మూడో వీకెండ్ కూడా హౌస్ ఫుల్స్ పడుతుంటే ఇంత త్వరగా ఎందుకు ఓటీటీలో రిలీజ్ చేస్తామంటూ ఆ సంస్థ రిటార్ట్ ఇచ్చింది. "ఇలా ఫేక్ న్యూస్ స్ప్రెడ్ చేస్తే మీ ఫోన్ మీద ఒట్టే" అంటూ 'లిటిల్ హార్ట్స్' సినిమా స్టయిల్లోనే పోస్ట్ పెట్టింది. ఓటీటీ సంస్థలతో డీల్స్ మేరకు థియేటర్లలో ఆడుతున్న సినిమాలను కూడా కొన్ని సార్లు త్వరగా డిజిటల్గా రిలీజ్ చేయాల్సి ఉంటుంది. ఐతే 'లిటిల్ హార్ట్స్'కు ఆ ఇబ్బంది లేదు. 'ఈటీవీ విన్' సినిమా ప్రొడక్షన్లో కూడా భాగమైంది. అలాంటపుడు డిజిటల్గా రిలీజ్ చేయడంలో షరతులేమీ లేవు. థియేట్రికల్ రన్ అంతా పూర్తయ్యాక తాపీగానే ఓటీటీలో రిలీజ్ చేసుకునే అవకాశముంది. ఈ వీకెండ్లో కొత్త సినిమాల నుంచి పెద్దగా పోటీ లేకపోవడంతో ముందు వారాల్లో వచ్చిన సినిమాలే బాక్సాఫీస్ దగ్గర ఆధిపత్యం చలాయిస్తున్నాయి. శని, ఆదివారాల్లో 'లిటిల్ హార్ట్స్'కు ఫుల్స్ పడే సంకేతాలు కనిపిస్తున్నాయి. కాబట్టి 'లిటిల్ హార్ట్స్' ఓటీటీలోకి రావడానికి కొంచెం ఎక్కువ సమయమే పట్టొచ్చు.

## ఆండ్రియా ఈజ్ బ్యాక్.. లైవ్ పెర్ఫార్మెన్స్ తో అదరహో!

ఆండ్రియా జెరేమియా.. ప్రముఖ కోలీవుడ్ నటిగా, గాయనిగా తనకంటూ ఒక పేరు ప్రఖ్యాతలు సొంతం చేసుకున్న ఈమె తమిళ్, మలయాళం చిత్రాలలో ఎక్కువగా నటిస్తూ.. భారీ పాపులారిటీ అందుకుంది. 1985 డిసెంబర్ 21న తమిళనాడు చెన్నైలో జన్మించిన ఈమె మోడల్ గా కెరియర్ ను మొదలుపెట్టి.. నేపథ్య గాయనిగా పేరు దక్కించుకుంది. 'యుగానికి ఒక్కడు' సినిమాతో మంచి పేరు దక్కించుకున్న ఆండ్రియా.. ఆ తర్వాత హీరో సిద్ధార్థ్ తో కలిసి 'గృహం' అనే సినిమాలో చాలా బోల్డ్ సీన్లలో నటించి మతి పోగొట్టింది. తెలుగులో నేరుగా నాగచైతన్య, సునీల్ కాంబినేషన్లో వచ్చిన 'తడాఖా' సినిమాలో నటించి ఆకట్టుకుంది. కమలహాసన్ విశ్వరూపం సినిమాతో మరింత పాపులారిటీ అందుకున్న ఈమె.. అటు సోషల్ మీడియాలో కూడా యాక్టివ్ గా ఉంటూ ఎప్పటికప్పుడు ప్రేక్షకులను అలరిస్తూనే ఉంటుంది. అంతేకాదు తన వ్యక్తిగత విషయాలను కూడా పంచుకునే ఆండ్రియా.. చాలా రోజుల తర్వాత మళ్లీ లైవ్ పెర్ఫార్మన్స్ ఇచ్చి అందరి దృష్టిని ఆకర్షించింది. అసలు విషయంలోకి వెళ్తే.. తమిళనాడు చెంగలపట్నం కట్టంకులతూర్ లో ఉన్న ఎస్ఆర్ఎమ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ యూనివర్సిటీలో నిర్వహించిన "చ%ూ=వ్ఖుఖుఎము% -2025" ప్రోగ్రాంలో తన అద్భుతమైన పర్ఫామెన్స్ తో అందరినీ ఆకట్టుకుంది.



ఇందులో తన అద్భుతమైన గాత్రంతో లైవ్ పెర్ఫార్మన్స్ ఇచ్చి యువతను ఉర్రూతలూగించింది. సోల్ ఫుల్ వాయిస్ , ఎలక్ట్రిఫైయింగ్ ఎనర్జీతో తన పెర్ఫార్మన్స్ తో వేరే లెవెల్ లో అదరగొట్టిందని చెప్పవచ్చు. ఇన్నాళ్ల తర్వాత మళ్లీ ఒక కాలేజ్ సందర్భంగా ఆండ్రియా ను ఇంత ఎనర్జిటిగ్ గా చూసేసరికి అభిమానులు సైతం సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఈవెంట్ కి సంబంధించిన ఫోటోలను తాజాగా ఆండ్రియా తన సోషల్ మీడియా ద్వారా షేర్ చేయడంతో ఆండ్రియా ఈజ్ బ్యాక్ అంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. మొత్తానికైతే ఇన్నాళ్లు తన గాత్రానికి అభిమానులను దూరం చేసిన ఈమె.. ఇన్నేళ్ల తర్వాత మళ్ళీ మైక్ పట్టి పాటలు పాడడంతో అభిమానులు సైతం సంతోషం వ్యక్తం చేస్తున్నారు.క ప్రస్తుతం ఎందుకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. ఆండ్రియా జెరెమియా విషయానికి వస్తే.." కన్నుమ్ కన్నుమ్ నోకియా" అనే పాటతో నేపథ్య గాయనిగా ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది. తమిళ్ చిత్రం 2007లో వచ్చిన 'పచ్చైకిలి ముత్తుచరం' అనే సినిమా ద్వారా నటిగా ఇండస్ట్రీకి పరిచయమయ్యింది. ఈమె కుటుంబ నేపథ్యం విషయానికి వస్తే తమిళనాడులోని అరక్కోణంలో ఒక ఆంగ్లో ఇండియన్ కుటుంబంలో ఈమె జన్మించారు. ఈమె తండ్రి మద్రాస్ హైకోర్టులో న్యాయవాది. ఈమెకు ఒక చెల్లెలు కూడా ఉన్నారు.. 8 ఏళ్ల వయసులోనే క్లాసికల్ పియానో నేర్చుకున్న ఈమె.. 10 సంవత్సరాల వయసులో జాక్సన్ ఫైవ్ బృందంలో భాగమై సింగర్ గా పేరు సొంతం చేసుకుంది. రంగస్థలం నాటకాలలో కూడా పాల్గొన్న ఈమె ఉమెన్స్ క్రిస్టియన్ కాలేజీలో స్టూడెంట్స్ సెనేట్ అధ్యక్షురాలు కూడా..

## మినీ స్కర్ట్ లో నడుము అందాలు చూపిస్తూ.. కాక రేపుతున్న వరుణ్ తేజ్ బ్యూటీ!

ఈ బ్యూటీ తెలుగులో నటించినవి కొన్ని సినిమాలే అయినప్పటికీ.. తన యాక్టింగ్ తో చెరిగిపోని ముద్ర వేసుకుంది. అయితే అలాంటి ఈ హీరోయిన్ తాజాగా తన హాట్ అందాలతో కుర్రకారుకు సెగలు పుట్టిస్తోంది. ఆ బ్యూటీ ఎవరో కాదు మెగా ప్రిన్స్ హీరో వరుణ్ తేజ్ హీరోగా వచ్చిన 'గని' సినిమాతో ప్రేక్షకులను అలరించిన సయీ మంజ్రేకర్. చివరిగా కళ్యాణ్ రామ్ నటించిన 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' మూవీలో చివరిగా నటించింది. ఈమె ఎవరో కాదు బాలీవుడ్ నటుడు,నిర్మాత, దర్శకుడు,స్క్రీన్ ప్లే రైటర్ అయినటువంటి మహేష్ మంజ్రేకర్ కుమార్తనే ఈ సయీ మంజ్రేకర్.. సినిమాల మీద ఉన్న ఆసక్తితో తండ్రి బాటలో సినిమాల్లోకి హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది. అలా మొదట బాల నటిగా 'కాక్స్ పర్ష్' అనే మరాఠి మూవీలో నటించింది. ఆ తర్వాత 'దబాంగ్-3' మూవీతో బాలీవుడ్లోకి హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది.అయితే అలాంటి ఈ ముద్దుగుమ్మ తాజాగా తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేసిన ఫోటోలు నెట్టింట్లో వైరల్ అవుతున్నాయి. ఆ ఫోటోలో సయీ మంజ్రేకర్ శ్రియా సేన్ అనే ఫ్యాషన్ డిజైనర్ డిజైనింగ్ చేసిన పొట్టి స్కర్ట్,టాప్ లో కనిపించింది. వైట్ కలర్ టాప్,స్కర్ట్ లో తన అందాలను ఆరబోస్తూ



ఫోటోలకు,వీడియోలకు ఫోజులిచ్చింది. పొట్టి స్కర్ట్ లో థైస్ అందాలు, టాప్ లో ఎద అందాలు.. పైగా నడుము అందాలు కనిపించేలా.. అందాలు ఆరబోస్తూ కుర్రకారుకు సెగలు పుట్టిస్తోంది. ప్రస్తుతం తన లేటెస్ట్ పోస్ట్ కి సంబంధించిన ఫోటోలు నెట్టింట వైరల్ గా మారడంతో పాటు ఈ హీరోయిన్ పెట్టిన పోస్ట్ కూడా సోషల్ మీడియాలో ఆసక్తికరంగా మారింది. తాజాగా పొట్టి స్కర్ట్, టాప్ లో ఉన్న ఫోటోలు షేర్ చేస్తూ కింద క్యాప్షన్ ఈ విధంగా రాసు కొచ్చింది. నేను ఈ మధ్యనే శ్రియా సేన్ ను కలిశాను. ఆమెకి ఫ్యాషన్ పట్ల ఉన్న అవగాహన చూసి ఎంతగానో అట్రాక్ట్ అయ్యాను.. రెండు వారాల క్రితమే శ్రేయా సేన్ కొత్త దుస్తుల బ్రాండ్ ని ప్రారంభించింది.. ఆమె డిజైన్ చేసిన డ్రెస్ ని వేసుకోవాలని చాలా ప్రయత్నించాను. నా ప్రయత్నాలకు తగ్గట్టు ఇప్పుడు ఆ అవకాశం నాకు వచ్చినందుకు చాలా హ్యాపీగా ఫీలవుతున్నాను. ముఖ్యంగా శ్రేయా సేన్ డిజైన్ చేసిన ఈ డ్రెస్సుని వేసుకొని.. ఆ డ్రెస్ ను చాలా ఫీల్ అవుతున్నాను. ఇది నాకు చాలా గొప్పగా అనిపిస్తుంది" అంటూ ఇంట్రెస్టింగ్ క్యాప్షన్ ఇచ్చింది..

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536